సృజన

'ఖాకీ మతం'

118

ఆగస్టు 1981

నిర్వహణ

'సాహితీమిత్రులు'

చెరలాడిన చాకులకు
బరిగీసిన బాకులకు
భాషలో వేషంలో భేదం వుందా ?
చిందిన రక్తానికి, కలిగిన ఖేదానికి భేదం వుందా ?
మసీదుముందో, మందిరంముందో రెచ్చగొట్టబడుతున్న
మనుషుల ఉద్రేకాలదేమతం ?
మట్టిలో కలిసిపోతున్న ప్రాణాలదేమతం ?
రూపాయర్లదేమతం ? రూపాలర్లదేమతం ?
కాల్పులదేమతం ? కర్ఫ్యూదేమతం ?
గూండాలదేకులం ? గుడుంబాకేబలం ?
గూండాల గుడుంబాల గిరాకీకోసం
ఎన్నికల క్లబ్బుతెరచిన ఈ ప్రభుత్వానిదేమతం ?

సంవత్సర చందా రు. 20 ఈ సంచిక రు. 2

ఈ సంచికలో....

33 పేజీలో సమీక్ష ప్రచురించిన ఉద్గీథ కవితాసంకలనం, రచన: 'వసుమ రి' ఈశ్వరసుబ్బారావు, ఛవిఛటా పబ్లికేషన్స్, సికింద్రాబాదు, పేజీలు 108 + xxii వెల రు. 6/- ప్రతులకు: పి. భవానీ శంకర్, ఛవిఛటా ప్రచురణలు, 1-106, ఓల్డ్ అల్వాల్ సికిందరాబాదు - 500 010.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Navatha Printers J. P. N. Road, Warangal - 506 002
for Venkataramana Mudranalayam, Warangal

ఆ రాత్రి
ఎర్రకోటపై జెండానెగరేస్తూ
ఎర్రగులాబీ మరో కొత్త దేశానికి
ఆహ్వానం పలికినపుడు
అది అట్టడుగు గుండెపొరల్లోంచి వచ్చిందనుకున్నాను

నౌకాలీ మొదలు లాహోరువరకు
ప్రవహించిన మానవ రక్త ఘోషను
నూతన ప్రసవానందంతో మరచిపోయాను
కొత్త కలల కుళ్ళాలు అల్లుకున్నాను

కాని
నేను దులిపేసి మేలుకోవడానికి ప్రయత్నిస్తున్న
'ఈ చరిత్ర ఒక పీడకల' [1]
తమ కలహాలను మతకలహాలుగా
అద్దాలమేడల్లోని పాలకులు
అలక్ష్యంగా జనంమీదికి రాళ్ళుగా విసురుతున్నారు.

అందుకే ఈ రాత్రి
నిద్రిస్తున్న గాయాలను
కత్తులు నెత్తురుచిందించి రేపుతున్నాయి
కలహాల, పోలీసుకాల్పుల, కర్ఫ్యూలవ్యవస్థలో
గల్లంతయిన కొత్త కలల కుళ్ళాల కోసం
రంజాన్ చంద్రునిలో వెతకనా?
చవితి చంద్రునిలో వెతకనా?

'కన్నతల్లీ'![2] చెప్పు
ఇపుడయినా చెప్పు
ఈజెండా ఎవరికోసం ఎగురుతున్నది?!

1. History is a nightmare from which I am trying to awake (Joyce, - James)
2. '....దేశంలో మతఘర్షణలకు ఇం. కాం. కన్నతల్లి' .. అటల్‌బిహారీ వాజపేయి

అడవినుంచి ఊళ్ళోకి, కొండలనుంచి కోర్టుల్లోకి
చాటుమాటునుంచి రహదారుల్లోకి ఎగబాకిన

'ఎదురు కాల్పులు'

చుట్టుముట్టు సూర్యాపేట, నట్టనడుమ నల్లగొండ. ఈపాట రాసినరోజుల్లో సూర్యాపేట, బాలెంలగ్రామాలు నైజాం నిరంకుశ ఆటవికన్యాయం గ్రామాలమీద దాడిచేస్తే ఇదిఊరా, అడవా అని ఊళ్ళు ఊళ్ళు కదిలి ప్రశ్నించడమేకాదు ఎదురించిన గ్రామాలు. ఇప్పుడు సూర్యాపేట చిన్నపాటి పట్టణమయింది. హైదరాబాదునుంచి కలకత్తావెళ్ళే జాతీయరహదారిలో, పోనీ విజయవాడవెళ్ళే వ్యాపారమార్గం లోవుంది. వ్యాపారము, సినిమాలు, సందడిపెరిగింది. ఒక డిగ్రీకాలేజీకూడ వచ్చింది. కాని ఆ పరిసరాల్లోనే ముక్కుపచ్చలారని కాలేజి కుర్రవాళ్ళను పట్టుకొని కాల్చివేసి 'ఎదురు కాల్పుల్లో' చనిపోయారని ప్రకటించగలుగుతున్నది ఇవ్వాళ నల్లగొండ పోలీసు యంత్రాంగం. ఈ పిల్లలను టీస్టాల్‌లోనుంచి పట్టుకపోతుంటే చూసినవాళ్ళుంటారు, తూటాలచప్పుడు విన్నవాళ్ళుంటారు. కాని వీళ్ళు ఎన్‌కౌంటర్‌లలో చనిపోయారని నమ్మమంటాడు. ఎస్ పీ వేదవ్యాసుడు. పోలీసు విన్నన్న చెప్పిందేవేదం.

మంచినీళ్ళ బావిదగ్గర నలుగురిని పట్టుకొని కాల్చివేస్తారు. ఇది ఎన్‌కౌంటర్ కాదు హత్యఅని చెప్పడానికి పౌరహక్కుల బాధ్యులువెళ్తారు. అది నల్లగొండ, అక్కడ జనంలేకుండా నిర్మానుష్యంచేస్తాడు పోలీసుఅధికారి. ఖాకీదుస్తులనీడలు, అవిసృష్టించిన భయాల నీడలుమాత్రమే సాక్ష్యాల గుండెలమీద మౌనాన్ని ఇనుపబూట్లతో విని పిస్తుంటాయి.

తుంగతుర్తిలో ఇద్దరిని పట్టుకొని కాల్చేస్తారు. ఎన్‌కౌంటర్‌అని యధావిధి ప్రకటన. చచ్చినఇద్దరిలో ఒకరిపేరైనాతెలియదు కాని పోలీసులకు. అతడు నక్సలైట్ మాత్రమేకాదు నక్సలైట్లలో ఏగ్రూప్రుకు చెందినవాడోకూడ స్పష్టంగాతెలుస్తుంది.

ఇది ఎన్‌కౌంటర్ అవునోకాదో న్యాయవిచారణ జరిపించాలన్న ఆంధ్రప్రదేశ్ పౌరహక్కులసంఘం డిమాండు ప్రకటించడానికి పత్రికల్లో చోటుండదు. మనుషులే అనుకుంటాను నడుపుతున్న పత్రికల్లో మనుషులు మరణించిన కారణాలుతెలుసుకోవ డానికి కనీసం ఒక పిడికెడుమంది ప్రదర్శించిన వ్యగ్రతకు చోటులేదు, విచారమూ లేదు, విచారణాలేదు.

ఏడేళ్ళుగానడుస్తున్న సికిందరాబాదు కుట్రకేసులో ముద్దాయిలు, సిపిఐఎంఎల్ (ఆర్. ఒ. సి.) కార్యకర్తలు మందాడి రవీందర్‌రెడ్డి, పర్వయ్యలు జులై 20/21 రాత్రి ఖమ్మంపట్టణంలో అరెస్టవుతారు. 22న పోలీసులు వీళ్ళను కోర్టులో హాజరు పరుస్తారు. ఆవార్త పత్రికల్లోకూడ వస్తుంది. (కొన్నిపత్రికల్లో ఈ వార్తకుకూడ స్థలంలేదు) వీళ్ళను సూర్యాపేటమీదుగా తీసుకవస్తుంటే సూర్యాపేటలో పోలీసువ్యాన్ పైఎవరోకొందరు దాడిచేస్తారు. ఈఇద్దరూ తప్పించుకోవడానికి ప్రయత్నిస్తారు. అఘర్ష ణలో రవీందర్‌రెడ్డి అక్కడికక్కడే మరణిస్తాడు ఉస్మానియాఆసుపత్రికి తీసుకొచ్చే దారిలోపర్వయ్య మరణిస్తాడు- ఇట్లామననునమ్మమంటారు పోలీసులు. దాడిచేసినవారిలో ఎవరూ గాయపడలేదు. పోలీసులు ఎవరూగాయపడలేదు. కోర్టుకు హాజరుపరచడమనే తప్పుచేసినందువల్ల చంపబడవలసినవాళ్ళు ఎవరు బతికిపోయారో వాళ్ళుమాత్రమే పోలీసులచేతుల్లో చచ్చిపోయారు! ఎంతదారుణమైనచర్య, కాని ఎంతబాహాటంగా, ఎంత నగ్నంగా, ఎంత నిర్భయంగా, ఎంత నిస్సిగ్గుగా నిర్వహిస్తున్నదీ పోలీసుయంత్రాంగం. చేయదల్చుకున్న దుర్మార్గానికి ఈ కట్టుకథలు ఎందుకు? పోలీసుసామ్యంకాక ఈ దేశంలో ప్రజాస్వామ్యంవుందని ఎవరైనా ఈదేశంలో నిజంగా నమ్ముతున్నాడు గనుకనా? కోర్టులో హాజరుపరచిన వ్యక్తులనుకూడ తన జిల్లాసివార్లలోకి ప్రవేశించ గానే ఏదోనెపంపెట్టి కాల్చివేసే అధికారాన్ని నల్లగొండజిల్లాలో పోలీసు యంత్రాం గానికి ఎవరిచ్చారు? ఇది ప్రజాస్వామ్యవాదులు సూటిగా తమకుతాము వేసుకోవాల్సిన ప్రశ్న. రవీందర్‌రెడ్డిని పట్టుకోకుండా పట్టుకొని కాల్చివేయకుండా వెళ్ళనని నల్లగొండ ఎస్పీ వ్యాస్ ప్రతిజ్ఞచేశాడని జనంలో బాగావాడుకలోవున్నది. ఇది నిజమే అయితే ఒక బాధ్యతగల పోలీసుఅధికారి, ఇంత బాధ్యతారహితమైన ప్రకటనలు చేయడానికి ఎవరి మౌనం, ఎవరి ఉదాసీనత, ఎవరి పిరికితనం, ఎవరి అనైక్యతకారణం?

జిల్లాలో విప్లవ సాహిత్యాన్ని అమ్మగూడదని పత్రికలు, పుస్తకాలు అమ్ము కునే వాళ్ళకు ఈ అధికారి లిఖిత పూర్వకమైన ఆదేశాలు ఇచ్చాడు. ఏ చట్ట ప్రకారం? ఏ ప్రాథమిక భావప్రకటన స్వేచ్ఛను వినియోగించుకొని? మనం ప్రశ్నించలేదు. కేతేపల్లి పోలీసుక్యాంపులో బొంబాయినుంచివచ్చిన నిజనిరూపణ కమిటీసభ్యులనే అరెస్టుచేసి కొన్నిగంటలు ప్రశ్నించారు. ఇదెక్కడిన్యాయమని మనం ప్రశ్నించలేదు. మనమంతే ప్రజలపక్షం వహించవలసిన అత్యధిక సంఖ్యాకులమైనమనం, నిత్యమూ ప్రభుత్వయంత్రాంగపు దాస్యంలో, భూస్వామ్యదోపిడిలో వ్యక్తిత్వాలనుకోల్పోయే అవమానాలకుగురవుతున్నమనం, మనందరికీ లేదా మనలోకొందరికి కేతేపల్లిలోనో,

బహదూర్‌పేటలోనో, పెనుగోడులోనో, మునగాలలోనో, మరొకచోటనో మరొక చోటనో జరిగిన, జరిగినాయని చెప్పబడుతున్న సంఘటనలపై ఏకాభిప్రాయం లేకపోవచ్చు. ఒకేదృష్టితో చూడకపోవచ్చు. మనలో ఏ అందరివీ లేదా కొందరివీ నక్సలైట్ రాజకీయాలు లేదా నక్సలైట్ రాజకీయాలుగా చెప్పబడుతున్న రాజకీయాలు కాకపోవచ్చు. కాని ఈ దేశంలో నిజంగా శాంతి, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం కోరుకునే పౌరులమేగనుక మనమయితే చట్టబద్ధమైన హంతకవ్యవస్థగామారిన ఈ పోలీసు రాజ్యాన్ని ప్రశ్నించకుండా నిద్రించడం మనకు సాధ్యంకాదు.

ఇవ్వాటి మౌనప్రేక్షకులంతా వెనుకా ముందుగా రేపో, మరునాడో పోలీసు 'ఎదురుకాల్పుల'కు ఎదురుపడకుండా క్షేమంగావుండడమూ సాధ్యంకాదు.

24-7-81 — సంపాదకుడు

రచనలకోసం విజ్ఞప్తి

ఆర్థికఇబ్బందులు, నిర్వహణా సమస్యలతోపాటు సృజన రచనలవిషయంలో కూడ తీవ్రమైనకొరతను ఎదుర్కొంటున్నది. కళావిలువలులేని నినాదప్రాయమైన పాటలు, కవితలు, మూసలోపోసిన ఫార్ములాపద్ధతికథలు, ఇతర భాషల్లోని మంచి రచనలకు (చెడ్డ) అనువాదాలుతప్ప మౌలికమైన ఉత్తేజకరమయిన కనీసం తృప్తికరమైన రచనలు రావడంలేదు. ముఖ్యంగా సమీక్షలు, మౌలికమైన సృజనాత్మకరచనలు కరువయినాయి. ఉత్తమమైన రచనలుపంపించి ప్రజాసాహిత్య ప్రమాణాలు ఉన్నతంగా కాపాడడంలో సృజనకు ఇతోధికంగా సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

— 'సాహితీమిత్రులు'

సురా - రగులుకొనే రాక్షసిబొగ్గు : ఈశాన్య భారత్ రాజకీయార్థిక పరిచయం.

అశాస్త్రీయ పరిచయం

కె. బాలగోపాల్

ప్రతి ఉద్యమాన్ని కేవలం శాంతిభద్రతలదృష్ట్యా చూసే రివిజనిస్టులు వేస్తున్న ఘోషను భేదించి ఈశాన్య భారతపు ఉద్యమాలకు సంబంధించిన 'అజ్ఞానపుటంతానికి' ప్రయత్నించటం మెచ్చుకోదగ్గ విషయం. పోరాటంలో తటస్థంగా ఉండకుండ ఒక పక్షం తీసుకోవడంగూడ మెచ్చుకోదగ్గ విషయమే. అయితే 'సురా' ఆశయాలు శ్లాఘనీయమే అయినా ఉత్పత్తి అయిన సరుకు చాలరకాలుగా అసంతృప్తికరం, తీవ్రంగా విమర్శకు గురికావలసినది. నక్సల్బరీతో కమ్యూనిస్టు ఉద్యమంలో 'తిరిగి జాతీయ సమస్యలపై చర్చలు చెలరేగే అవకాశం ఏర్పడింద'ని నమ్మే 'సురా' ఈ సమీక్షను గూడ ఆ చర్చలో భాగంగా గ్రహిస్తాడని ఆశిస్తాను.

ఈ పుస్తకం చదివే వారికెవరికైనా మొదటిగా స్ఫురించేది, రచయితకు జాతి ఉద్యమాలపట్ల "వీక్‌నెస్" ఉందన్న విషయం. రెండవది అతనికి ఈశాన్యభారతంలో నడుస్తున్న అన్ని ఉద్యమాలపట్ల సద్భావం ఉందన్న విషయం. అయితే మార్క్సిస్టు దృక్పథంలో జాతిఉద్యమాలకు ఒక విశిష్ట స్థానంలేదు. అన్ని జాతిఉద్యమాలు సమర్థనీయంకావు, అన్నీ వ్యతిరేకించ వలసినవికావు. ప్రతి జాతిఉద్యమానికి ఒక ప్రధానమైన వర్గస్వభావం ఉంటుంది. అదే ఆ జాతి ఉద్యమంపట్ల మార్క్సిస్టుల వైఖరిని నిర్దేశిస్తుంది. ఉదాహరణకు నాజీవాదం జర్మన్ జాతీయతావాదం. అయినా దాని వర్గ స్వభావం మొదట ఫాసిజం, క్రమంగా సామ్రాజ్యవాదం కావడంవలన, 1920 లలోని జర్మన్ ప్రజల దుర్భర జీవితపరిస్థితులకు సానుభూతిగల కమ్యూనిస్టులుగూడ నాజీవాదాన్ని ఏరోజు సమర్థించలేదు. అలాగే తూర్పుబెంగాల్‌లో ముజిబూర్ రెహ్మన్ నాయకత్వాన నడిచిన జాతిఉద్యమం యదార్థంగా సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదానికి మాత్రమే సహకరిస్తుందన్న వాదనతో చైనా నాయకత్వం, మనదేశంలో చాలమంది విప్లవ కమ్యూనిస్టులు దానిని సమర్థించలేదు. (అయితే ఆ జాతి ఉద్యమం అని తరువాత జరిగిన పరిశోధనలవలన తెలుస్తోంది. అదే నిజమయితే, దానిని సమర్థించడమే సబబు, ఇది వేరేవిషయం). అదే పాలస్తీనా జాతీయతావాదం మౌలికంగా సామ్రాజ్యవాద వ్యతిరేకం గావటంచేత అది వ్యక్తిగత హింసావాదాన్ని చేపట్టినప్పటికీ, దాన్ని సమర్థించడం మార్క్సిస్టులవిధి.

ఈ విషయాలు 'సురా'కు తెలియకకాదు. తెలిసేతాను సాధించదలుచుకున్న దానికి కావలసిన పునాది ముందుగానే వేసుకున్నాడు. వలస విధానానికి వ్యతిరేకమైన జాతిఉద్యమం ఎంత అమానుషత్వానికి లోనైనా మార్క్సిస్టులకు (ఒక్క-ట్రాట్స్కీ వాదుల్ని మినహాయిస్తే) సమర్థనీయం కాబట్టి, ఈశాన్య భారతంలోని జాతులను ఆర్థికంగా దోచుకొని ఈశాన్యేతర భారతాన్ని అభివృద్ధిచేయడం భారత ప్రభుత్వ ఆర్థిక నీతిఅని, ఈ జాతులు నివసించే ప్రాంతాలు, అంటే అస్సాం, త్రిపుర, నాగాలాండ్ మొదలయిన రాష్ట్రాలు, వెనుకబడి ఉండటమే మిగతా భారతదేశం అభివృద్ధి చెందడానికి కారణమని, చూపించడం 'సురా' ఉద్దేశ్యం (పేజీ 74). అతని వాదానికి ఇది పునాది.

ఈ పునాదిలో మొదటిఅంశం ఈశాన్య భారత చరిత్రను, రాజకీయార్థికాలను పాక్షికంగా పాఠకునికి పరిచయం చేయడం. నిజానికి బెంగాలీల చరిత్రనర్థంచేసుకోకుండ ఈశాన్య భారతాన్ని అర్థంచేసుకోవడంఅసాధ్యం. ఈనాడు అస్సాంలోను త్రిపురలోను మేఘాలయలోను ఉద్యమాలలో కొద్దోగొప్పో బెంగాలీ వ్యతిరేకత ఉందంటే అది యాదృచ్ఛికంగాదు. ఆ జాతుల చరిత్రలు బెంగాలీల చరిత్రతో ముడిపడి ఉన్నాయి. ఒకరి చరిత్రచెప్పి ఇంకొకరి చరిత్ర చెప్పకపోవడం ఆ ఇంకొకరికి అన్యాయం చేయడం అవుతుంది. కాని, బెంగాలీలగురించి 'సురా' ఈ పుస్తకంలో చెప్పినవి రెండేవిషయాలు. ఒకటి బ్రిటిష్ ప్రభువులు 1825 లో ఈశాన్య భారతంలో ప్రవేశించిన తరువాత తమ పాలనా యంత్రాంగాన్ని నడపడానికి మధ్యతరగతి (భద్రలోక్) బెంగాలీలను తరలించుకు వెళ్ళినట్లు, ఈ బెంగాలీలే తరువాతి కాలంలో ఈశాన్య భారతంపై తమ ఆధిక్యతను నెలకొల్పి అక్కడి ప్రజలను సాంస్కృతికంగాను అన్యంగాను పీడించినట్లు. రెండవది, ఈశాన్య భారతంలో పరిశ్రమలు మొదలుపెట్టిన తరువాత ఏర్పడిన ఆహారకొరతను భర్తీచేయడానికి బ్రిటిష్‌వారు తూర్పు బెంగాల్‌నుండి ముస్లిం రైతాంగాన్ని తరలించుకు వెళ్ళినట్లు. అయితే, ఈవిధంగా బ్రిటిష్‌వారు రమ్మన్నచోటికల్లా చేయమన్న పనికల్లా బెంగాలీలు ఎందుకు వెళ్ళారన్న అనుమానం 'సురా'కు వచ్చినట్లులేదు. బహుశా, మనలో కొంతమంది దేశద్రిమ్మరితనం మలయాళీల రక్తంలో ఉందనుకునేటట్లు, వలసవెళ్ళడం బెంగాలీల జాతి లక్షణం అని 'సురా' భావమేమో!

అయితే వాస్తవం దీనికి విరుద్ధం. ఈనాటికీ అంతంగాని బెంగాలీలవలసకు కారణం వారి గత రెండువందల సంవత్సరాల భయంకరచరిత్ర. భారతదేశంలో

మరేజాతీ బ్రిటీష్ వారిచేత బెంగాలీలంతగా పీడించబడలేదు. గత శతాబ్దంలో మునుపెన్నడూలేనంతగా క్షామాలు కరువులు ఈ దేశంలో పాటిల్లడానికి సామ్రాజ్యవాద దోపిడీ కారణమైతే, ఆ దోపిడీ ఎక్కువకాలంగా, అతితీవ్రంగా సాగింది ఈనాటి బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ ప్రాంతాలలో. ఆసామ్రాజ్యవాద పీడన ఫలితంగానే ఈనాటికీ బంగ్లాదేశ్‌లో ఉన్నంత కటికదారిద్ర్యం మరే 'మూడవ ప్రపంచ' దేశంలోను లేదు, ఆ పీడన ఫలితంగానే 'సురా' కృతజ్ఞతలు తెలుపుకున్నవారిలో ఒకరైన గెయిల్ ఒమ్వెట్ అన్నట్లు మొదటినుంచీ ఈశాన్య భారతంమీద 'బెంగాలీలఆధిక్యత' ఉన్నప్పటికీ, ఈనాటికీ పశ్చిమబెంగాల్‌లో ఉన్నంతదారిద్ర్యం ఈశాన్య భారతంలో ఎక్కడాలేదు (దరిద్రరేఖ దిగువునఉన్న జనాభాశాతం అస్సాంకంటె ఎప్పుడూ పశ్చిమబెంగాల్‌లోనే ఎక్కువగా ఉంటూవస్తోంది). ఆ పీడనఫలితమే క్షామం, వలస. ఆ పీడన ఫలితమే అస్సాంలోని 'విజాతీయుల సమస్య' అయితే 'సురా' చెప్పని ఈ కథను కొంచెం వివరంగా తెలుసుకోవలసిన అవసరంఉంది.

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తమ దేశంలో తయారైన వస్త్రాలకు మార్కెట్ సంపాదించడంకోసం భారతదేశంలోని చేనేత పరిశ్రమను నాశనం చేసిన వైనం అందరికీ తెలిసినదే. అయితే ఇది అన్ని ప్రాంతాలలోకంటె బెంగాల్‌లో ఎక్కువగా సాగింది. ఢాకాలోని సన్నటి వస్త్రాల నేతగాళ్ళ చేతివేళ్ళు తెగగోయించినట్లు కూడ ఒక కథ ఉంది. ఇది ఎంత నిజమో తెలియదుగాని, నాశనం మాత్రం జరిగింది. ఈ వినాశకార్యానికి రెండు ఫలితాలున్నాయి. మొదటిది, ఉత్పత్తి సాధనాలను పోగొట్టుకొని, భూమిలేని రైతాంగంలో భాగమైన చేనేతకార్మికులు. రెండవది ఈ వస్త్రాల ఎగుమతి వ్యాపారం చేస్తూ ఉండిన వ్యాపారస్తులు చితికిపోయి మధ్యతరగతిలో చేరడం. దీనికి సమాంతరంగా పుట్టింది జమీందారీ వ్యవస్థ. ఈ వ్యవస్థ కూడ బెంగాల్‌లో మరెక్కడాలేని వింత స్వరూపాన్ని దాల్చింది. ఇక్కడ జమీందారుకూ రైతుకూ మధ్య ఛోటా జమీందార్లు (జోతేదార్లు) బయలుదేరారు. అంటే రైతు శ్రమను మెట్లుమెట్లుగా దోచుకునే భూస్వాముల సోపానం ఏర్పడిందన్నమాట. ఈ జోతేదార్ల పట్టణస్వరూపమే మధ్యతరగతి 'భద్రలోక్'. వీరు, చితికిన వస్త్రవిపణులు, బ్రిటిష్ వారి పాలనాయంత్రాంగంలో భాగంగా వలసవెళ్ళారు. ఈవర్గ వైరుధ్యానికి రెండవవైపున్నది, అతిగా దోచుకోబడ్డ రైతాంగం, వారితో పోటీగా నిలబడి వారి జీవితం మరింత దుర్భరం చేసిన ఒకప్పటి చేనేత పనివారు. వీరిసమూహం బెంగాల్ పల్లెపట్ల దారిద్ర్య నిలయం. దీనికి తోడు, ఈ జమీందార్లు, జోతేదార్లు రైతాంగం నుండి దోచిన తిండిగింజల బలవంతపు ఎగుమతి. దేశంలో క్షామం ఉన్న సంవత్సరా

లలో గూడ సామ్రాజ్యవాదులు దేశంనుండి తిండిగింజల ఎగుమతి చేస్తూనేవచ్చారు బిపిన్‌చంద్రరాసిన 'భారతదేశంలో ఆర్థిక జాతీయతత్వం ఉత్పన్నం, అభివృద్ధి' అన్న పుస్తకంలో ఈ విషయాలకు సంబంధించిన సమాచారాలు విపులంగా ఇవ్వబడ్డాయి). వీటన్నిటి ఫలితం గత శతాబ్దంలో దేశంలో పైశాచిక నృత్యం చేసిన క్షామం. ఈ క్షామం దక్షిణ, ఉత్తర భారతాలను తూర్పున బెంగాల్ ఒరిస్సా ప్రాంతాలను అతిగా పీడించింది. వీటన్నిటి ఫలితమే 'భూమికోసం, భుక్తికోసం' వలస. సురా 'అస్సాం టీ త్రాగడం అంటే పేదింపబడుతున్న అస్సామీ కూలీల రక్తం తాగడమే' నన్న 1886 లోని సంజీవనీ పత్రిక సంపాదకీయం కోట్ చేసాడు. అతను చెప్పనిదేమిటంటే ఈ కూలీలు అస్సామీలు కారని, కూటికోసం అన్ని వందల మైళ్ళ వలస వెళ్ళిన బిహారీలు, ఒరియాలు, బెంగాలీలునని. ఈ శతాబ్దంలో గూడ ఈ వలస సాగుతూనే వచ్చింది.

కథ అంతటితో ఆగలేదు. పాకిస్తాన్ ఏర్పడ్డ తరువాత పశ్చిమ పాకిస్తాన్ తూర్పు పాకిస్తాన్‌ను వలస విధానంలో దోచుకుంది. పాకిస్తాన్ ప్రభుత్వ ఆర్థిక విధానాల ఫలితంగా తూర్పుబెంగాల్ రైతాంగంఆదాయంలో 24 నుండి 49 శాతం వరకు పశ్చిమ పంజాబు పెట్టుబడిదార్లు దోచుకున్నట్లుగా అంచనాలున్నాయి. ('ఎక్స్‌ప్లోజన్ ఇన్ ఎ సబ్‌కాంటినెంట్' అన్న పుస్తకంలో రిచర్డ్‌నేషన్స్ వ్యాసం) అంటే మళ్ళీ పేదరైతాంగం 'పొట్టచేతపట్టుక' వలస పోవలసివచ్చింది. ఈ నాటికీ ఇది సాగుతోంది. ప్రతిఏటా వ్యవసాయ కూలీలు బంగ్లాదేశ్ నుండి అస్సాంకు ఇరుదేశాల సరిహద్దు దళాల కళ్ళుగప్పి కూలిపని కోసం వస్తూంటారు. ఇంత ప్రమాదకరమైన రాకపోకలు ఎంతో దారిద్ర్యం లేకపోతే జరగవు. అంతేగాని ముస్లింలీగ్ నాయకులో కాంగ్రెస్ నాయకులో వోట్లకోసం రప్పించుకున్నారనడం పూర్తిగా అశాస్త్రీయం.

ఈ విషయాలు సురా కు తెలియకకాదు. ఇవినేను పరిశోధనచేసి కనుగొన్నవి గావు. మరయితే ఎందుకుదాచినట్లు? అసలు 'బహిరాగతుల'ను అస్సాంనుండి తరిమివేస్తే నష్టపోయేది ఒకప్పుడు అస్సాంలో ఆధిక్యత కలిగిఉండిన బెంగాలీలుకాదని, రెండెకరాల భూమికోసం అస్సాంవచ్చి తమశ్రమతో వేల ఎకరాలను సాగులోకి తెచ్చిన రైతాంగమని ఎందుకు చెప్పలేదు? సురా కు బెంగాలీద్వేషం ఆపాదించలేం. మరయితే మార్క్సిజం బెంగాలీజాతీయదురహంకారవాదతత్వమనే అస్సామీయుల ఆరోపణకు భుజాలు తడుముకోవడమా? లేకపోతే 'రివిజనిస్టం'టారని భయమా?

సురా తన ప్రతిపాదనను సమర్థించడానికి వేసుకొన్న పునాదిలో రెండవ అంశం ఈశాన్యభారతాన్ని ఒక్క 'యూనిట్'గా పరిగణించడం. ఇది అతనికి

రెండు విధాలుగా అవసరం. మొదటిది, ఏ అతివాద జాతీయవాదులో, మతిచెడ్డ రివిజనిస్టులో తప్ప ప్రజాతంత్రవాదులందరూ నాగా, మిజో, త్రిపురిజాతుల పోరాటాన్ని సమర్థిస్తారు. (కనీసం సానుభూతితో చూస్తారు). ఈ సమర్థింపు, సానుభూతి, అస్సాం ఉద్యమానికికూడ సంక్రమింపజేయడం సురా ఉద్దేశ్యం. రెండవదేమంటే, మొదట్లో చెప్పినట్టు ఈశాన్యభారతాన్ని దోచుకొని ఈశాన్యేతర భారతాన్ని అభివృద్ధిచేసే వలసవిధానం భారతఆర్థికనీతి అన్నది సురా ప్రతిపాదన. అయితే అస్సాంరాష్ట్రాన్ని ప్రత్యేకంగా పరిగణిస్తే ఈ ప్రతిపాదనను నిరూపించడం కష్టం. కాబట్టి ఈశాన్య భారతాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి కొండప్రాంతం గిరిజనజాతుల విగతిని బ్రహ్మపుత్ర నదీలోయప్రాంతం అస్సామీలకు కొంచెంఅంటించి నిరూపణ చేయడం అవసరం. ఇది ఏవిధంగా సాధించాడన్నది చూద్దాం. నిజంగానే వలసవిధానం భారత దేశ ఆర్థికనీతి అయితే వలసప్రాంతాల జీవనప్రమాణం ఇతర ప్రాంతాలకంటే తక్కువగా ఉండాలి. అంతేకాకుండ ఉత్పత్తి, జీవనప్రమాణాల పెరుగుదలరేటు ఇతరప్రాంతాలకంటె తక్కువగాఉండాలి. దీనికి సంబంధించిన గణాంకాలు సురా 74వ పేజీలో ఇచ్చాడు. మొత్తం భారతదేశం తలసరిఆదాయం 1278 రూపాయలని, ఈశాన్యభారతంలో 824 రూపాయలని (ఏ సంవత్సరంలోనో, ఏ సంవత్సరం ధరల ప్రకారమో, చెప్పలేదు. 1980 81 లెక్కలింకా రాలేదుకాబట్టి, 1970-71వి కావచ్చు, లేదా తరువాతి అంచనాలు కావచ్చు) మొత్తం భారతదేశంలో తలసరి ఆదాయం 315 శాతం, ఉత్పత్తి 4 శాతంపెరుగగా, ఈశాన్యభారతంలో 260 శాతం, 2 శాతంమాత్రమే పెరిగాయని అంటున్నాడు. (ఈ పెరుగుదలగూడ ఏ సంవత్సరంనుండి ఏ సంవత్సరానికో చెప్పలేదు. అక్కడ ఇచ్చిన రెఫరెన్సును బట్టిచూస్తే, 1960-61 నుండి 1970-71కి అయిఉండాలి. అయితే 200 శాతం, 300 శాతం వాస్తవికఆదాయం ఎప్పుడూ పెరగలేదుకాబట్టి ఇది డబ్బు ఆదాయం అయిఉండాలి. ఇంత అపసవ్యపు పరిశోధనను 'శాస్త్రీయదృక్పథం' అని గర్వంగాచెప్పుకుతిరగడం ఎందుకు?

అయితే ఈశాన్య భారతం నుండి అస్సాంను విడదీసి, 1960-61, 1970-71 లెక్కల నాధారంగా పరిశీలిస్తే కనిపించేది ఇందుకు విభిన్నమైన వాస్తవం. (ఈ దిగువ ప్రస్తావించిన గణాంకాలన్నీ బకుల్ ధోలాకియా, రవీంద్ర ధోలాకియా, 20 సెప్టెంబర్ 1980 ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ వ్యాసం నుంచి తీసుకొన్నవి).

1960-61 లో (అదే సంవత్సరం ధరల ప్రకారం) భారతదేశం తలసరి ఆదాయం 307 రూపాయలు: అస్సాం తలసరి ఆదాయం 349 రూపాయలు 1970-71లో

(1960-61 ధరల ప్రకారం) దేశతలసరి ఆదాయం 340 రూపాయలు, అస్సాం సరితల ఆదాయం 358 రూపాయలు, 1947 మొదలుకొని అస్సాంనుదోచి ఈశాన్యేతర భారతాన్ని అభివృద్ధిచేయడమే భారత ఆర్థికనీతి అయితే 1960లోను, 1970 లోనుగూడ అస్సాం తలసరిఆదాయం దేశ తలసరి ఆదాయంకంటె ఎక్కువ ఎందుకుంది ? అయితే ఈ పది సంవత్సరాలలో దేశ తలసరిఆదాయం సుమారు 10 శాతం పెరుగగా అస్సాంలో 2 శాతంమాత్రమే పెరిగినమాట వాస్తవం. కాని దేశతలసరిఆదాయం పెరుగుదలకుకారణం అస్సాందోపిడికాదు, విదేశీఅప్పులతో సాధించిన 'ఆకుపచ్చ విప్లవం' (green revolution) ఈ 10 సంవత్సరాలలో పంజాబు తలసరిఆదాయం 374 రూపాయలనుంచి 499 రూపాయలకు, హర్యానా తలసరిఆదాయం 360 రూపాయల నుండి 497 రూపాయలకు పెరిగాయి. దేశతలసరిఆదాయం పెరుగుదలకు కారణం ఇది. అయితే ఈపెరుగుదల సాధించింది ఈనాటికీతీరని విదేశీఅప్పులతో (1966 నుండి 1973 లోపల భారతప్రభుత్వం 10 వేలకోట్ల రూపాయలు అప్పుచేసింది. ఈ విషయం తరిమెల నాగిరెడ్డి పుస్తకం 'తాకట్టులో భారతదేశం'లో చెప్పబడింది).

జీవనప్రమాణం సంగతి ఇలావుంటే, ఉత్పత్తి పెరుగుదలరేటు తీసుకుందాం. 1960-61 నుండి 1970-71 ల మధ్య భారతదేశపు సగటు ఉత్పత్తి పెరుగుదలరేటు ('చక్రవడ్డీ' రేటు) 3.24; అస్సాం ఉత్పత్తి పెరుగుదలరేటు 3.27– అంటే దేశంలో పెరుగుదలరేటు కంటె ఎక్కువే. మరి (ఏసంవత్సరాల మధ్యనో చెప్పకుండ) దేశంలో 4 శాతం, ఈశాన్యభారతంలో 2 శాతం అనటంలో గల ఉద్దేశ్యం ఏమిటి ? కొండప్రాంతం గిరిజనుల వెనుకబాటుతనాన్ని అస్సాంకు కూడా అంటగట్టి అస్సాం ఉద్యమాన్ని వలసదోపిడీ వ్యతిరేక ఉద్యమంగా చిత్రించడమేగా ?

అలాగే సాగుబడిలోవున్న భూమిలో నీటిపారుదల సౌకర్యాలున్నప్రాంతం దేశంలో 22 శాతం అయితే ఈశాన్యభారతంలో 18 శాతం మాత్రమేనని సురా చెబుతున్నాడు (పేజీ 83). అయితే 5వ పంచవర్షప్రణాళిక ముసాయిదాలో బ్రహ్మపుత్ర లోయప్రాంతం (అంటే ఒకటి రెండు జిల్లాలను మినహాయిస్తే అస్సాంరాష్ట్రం)లో నీటి పారుదలవసతి మొత్తం దేశంలో లాగే 22 శాతం ఉందని, కొండప్రాంతంలో 10 శాతం మాత్రమే ఉందని చెప్పబడివుంది. ఈ రెండు సంఖ్యలను జాగ్రత్తగా కలగలిపితే వచ్చిందే సురా చెప్పిన 18 శాతం ఈ కలగలుపుడు ఎందుకు చేసినట్లు ?

అలాగే ఇంకా నిరుద్యోగానికి మొదలయిన విషయాలకు సంబంధించి ఈశాన్య భారతాన్ని తదితర ప్రాంతాలను సురా పోల్చాడు. ఈ అంశాలలో అస్సాంకుసంబం

ధించినసమాచారం సేకరించలేకపోవడంమూలాన వాటిని ప్రస్తావించడంలేదు. అయినా సురా చేసిన 'పరిచయం' స్వరూపం తెలుసుకోవడానికి ఈమాత్రంచాలనుకుంటాను.

ఈదేశఆర్థికవిధానం అస్సాంనుదోచుకొని మిగిలినప్రాంతాలను అభివృద్ధిచేసే వలసవిధానం అనేప్రతిపాదనకు సురా ఇచ్చిన మిగతాసాక్ష్యాలను పరిశీలించేముందు ఒక్కవిషయం చెప్పాలి. చాలమందిలో అస్సాం అన్నిప్రాంతాలలోకీ వెనుకబడ్డదని, అన్నివనరులుండీ అంతతక్కువ ఆదాయంగల ప్రాంతాలులేవనీ ఒకభావనఉంది. ఇదేమంతనిజంకాదు. అస్సాం వెనుకబడ్డప్రాంతమే- పంజాబుకంటె, హర్యానాకంటె పశ్చిమమహారాష్ట్రకంటే, దక్షిణ (పశ్చిమ)బెంగాల్‌కంటె, కోస్తాఆంధ్రకంటె, దక్షిణ కర్ణాటక కంటె అస్సాం వెనుకబడ్డప్రాంతమే. అయితే అస్సాంతోసమానంగా వనరుల్ని కల్గిఉన్న బీహార్, ఒరిస్సా మధ్యప్రదేశ్‌లకంటెకాదు; నిరుడుక్షామంలో వందల మందిని ఆకలిదప్పులకు బలిపెట్టుకున్న ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్‌కంటెకాదు, విదర్భకంటే. మరాఠ్వాడకంటె, తెలంగాణ రాయలసీమలకంటె. ఉత్తరకర్ణాటక (గుల్బర్గ, బీదర్‌ప్రాంతం) కంటె, దక్షిణతమిళనాడుకంటెకాదు. అస్సాంలో 77 శాతం వెనుకబడ్డప్రాంతమయితే, మధ్యప్రదేశ్‌లోని 45 జిల్లాలలో 36 (అంటే 80 శాతం) వెనుకబడ్డవి. అసమానతలకు పుట్టినిల్లయిన భారతదేశంలో దేశపు సగటుఅభివృద్ధిని అస్సాం అభివృద్ధితోపోల్చడం ఎందుకు? ఒక్కపంజాబు నాలుగడుగులుముందుకేస్తే దేశమంతా కలిసికట్టుగా అస్సాంనుదోచి ప్రగతిసంపాదించిందని చూపడానికేగా? అస్సాంతోసమానంగా వనరులు బీహార్‌లోవున్నాయి. అయితే 1960-61లో అస్సాం తలసరిఆదాయం 349 రూపాయలయితే బీహార్ తలసరిఆదాయం 228 రూపాయలు; 1970-71లో అస్సాంలో 358 రూపాయలయితే బీహార్‌లో 223 రూపాయలు (1960-61 నుండి 1970-71 వరకు తలసరిఆదాయం తగ్గిపోయినరాష్ట్రం బీహార్ ఒక్కటే). అలాగే పారిశ్రామిక వనరులకు అటవీసంపదకు ఏప్రాంతానికీతీసిపోని ఒరిస్సా తలసరి ఆదాయం 1960-61లో 225 రూపాయలు 1970-71లో 269 రూపాయలు (మధ్య ప్రదేశ్‌లో 261, 262 రూపాయలు, కేరళలో 280, 299 రూపాయలు). అస్సాంలో గ్రామీణదారిద్ర్యం 48 శాతంఅని సురా చెబుతున్నాడు. ఈమధ్యవేసిన అంచనా ప్రకారం ఒరిస్సాలో గ్రామీణదారిద్ర్యం 70 శాతం పైనఉంది)యాదృచ్ఛికంగా ఒక దినపత్రికలోచూసిన రిపోర్ట్‌అవటాన దీనికిసరైన రిఫరెన్స్ ఇవ్వలేనందుకు క్షమించాలి) 1960-61లో ఆంధ్ర, బీహార్, కేరళ, మధ్యప్రదేశ్, ఒరిస్సా, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలు అస్సాంకంటె తక్కువ తలసరిఆదాయం కలిగిఉన్నాయి. 1970-71 లోను అదేపరిస్థితి. ఎవరు ఎవరినిదోచుకుంటున్నారు? అస్సాంనుదోచుకొని మిగిలిన

ప్రాంతాలు అభివృద్ధి చెందిపోతున్నాయా ? లేకపోతే బీహార్ ఒరిస్సారాష్ట్రాల సంపదను దోచుకొని మిగిలినదేశం (అస్సాంపోసహా) అభివృద్ధి అయిపోతోందా ? లేకపోతే పంజాబు హర్యానారాష్ట్రాలు, మురికిసందుల బొంబాయినగరం కుళ్ళిపోయిందని చెప్పుకోబడుతున్న కలకత్తానగరం మిగిలినప్రాంతాలను దోచిపెట్టి అభివృద్ధిచెందిపోతున్నాయా ! అసలు ఈదేశంలో ప్రాంతీయదోపిడీమీద ఆధారపడ్డ వలసవిధానం ఉందా ? ఈదేశంలో అంతర్గతవలసలు (colonial hinterlands) ఉన్నాయా ?

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పుకోవాలంటే పైపై పరిశీలనలు పనికిరావు. నాలుగు గణాంకాలుగుప్పిస్తే చాలదు. అస్సాంలో చాలవనరులున్నా భారతదేశపాలక వర్గం వలసదోపిడీ విధానంలో తనకు అత్యవసరంగా కావలసిన ముడిసరుకుల్ని తప్ప మరిదేనినీ అభివృద్ధిచేయలేదని సురా అంటున్నాడు. వలసవిధానంలో ఇది జరిగేమాట నిజమేగాని ఇలా జరిగినంతమాత్రాన అది వలస విధానంకాదు. ఈ విధంగా ఆలోచించడం దళారీ బూర్జువా వర్గం స్వభావాన్ని అర్థంచేసుకోకపోవడమే. ప్రగతిశీలం గల బూర్జువా వర్గం దేశంలోని అన్ని వనరుల్ని ఉపయోగించి ప్రజల అవసరాలను (తనకు లాభదాయకంగా ఉన్నమేరకు) తీర్చి తాను లాభాలు చేసుకుంటుంది. దళారీ బూర్జువావర్గం తద్విభిన్నంగా ఏరోజుకారోజు దొరికినంతమేరకు తానుతిని తనకు సాంకేతిక ఆర్థిక వాణిజ్య 'సహాయం'చేసే సామ్రాజ్యవాదులకు పెడుతుంది. 'భారత దేశం పెట్టుబడిదార్లకు ఉత్పత్తిసాధనాల అభివృద్ధి కంటె దైనందిన లాభాలే ముఖ్యమై పోయా'యన్నది కమ్యూనిస్టుల ఆరోపణేకాదు, అది అందరూ అంటున్న విషయమే. ఇదే దళారీబూర్జువా వర్గం స్వభావం. ఈ రకమైన వక్రాభివృద్ధి ఒక అస్సాంలోనేకాదు, దేశమంతటా జరుగుతోంది. ప్రభుత్వం ప్రకటించే పుస్తకాలలో వర్ణించబడ్డ వనరుల సంపదను వాటి వాడకంతో పోల్చితే, ఈదేశాన్ని పాలిస్తోంది మనుషులా లేక జీవంలేని శవాలా అన్న అనుమానం ఎవరికైనా కలుగుతుంది. అటువంటిదేదో లేకపోతే అస్సాంకంటె ఎక్కువ వనరులసంపదగల బీహార్ తలసరి ఆదాయం అస్సాం తలసరి ఆదాయంలో 60 శాతం మాత్రం ఉండడం, తలసరి ఆదాయాన్నే (వర్గవిభేదాల మాట మరచిపోయి) ప్రమాణంగాతీసుకున్నా దేశంలో ఈ ఒక్క సంపన్న రాష్ట్రమే రోజు రోజుకూ పేదదవుతూండడం వివరించడం వీలుపడదు. అసలు 'మమ్మల్నిదోచుకొని మీరంతా బలుస్తున్నారు' అనేహక్కు ఎవరికైనావుంటే అది బీహారీలకేగాని, అస్సామీలకు లేదు. అయితే ఆ ఆరోపణగూడ నిజంకాదు. ఈ దేశంలో అంతర్గతవలసలు లేవు, అంతర్గతవలస విధానం లేదు. ఇక్కడున్నది ఒక దళారీ గుత్తపెట్టుబడిదారు వర్గపాలన. ఈ వర్గం వనరులున్నచోట వనరుల్ని లేనిచోట ప్రజల శ్రమనుదోచి తాను

తిని, కొంత సామ్రాజ్యవాదులకు పెడుతోంది. ఈరకం దోపిడీలో ఎగుడుదిగుళ్ళుంటాయి. ఉత్పాదకశక్తిని ఎంతో అభివృద్ధిచేసిన ప్రగతిశీలం గల బూర్జువా వర్గ పాలనలోనే పాశ్చాత్యదేశాలలో ఎగుడుదిగుళ్ళున్నాయి. ఇంక దళారీవర్గం పాలన సంగతి చెప్పాలా? అయితే ఈ ఎగుడుదిగుళ్ళను సరిచేయడంకోసంకాదు నేడు పోరాటం చేయవలసింది. ఈపాలనను అంతం చేయడంకోసం.

మరయితే ఈశాన్యభారత ఉద్యమాల స్వరూపం ఏమిటి? వాటిపట్ల విప్లవ కమ్యూనిస్టులవైఖరి ఏవిధంగా ఉండాలి? ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే మొదట చెప్పిన విషయం గుర్తుంచుకోవాలి. మార్క్సిస్టు దృక్పథంలో జాతిఉద్యమాలకు విశిష్టమైన స్థానంలేదు. జాతిఉద్యమంపట్ల వైఖరి దాని వర్గస్వభావాన్నిబట్టి మారుతుంది.

ఈశాన్య భారతంలోని కొండప్రాంతాలు బ్రహ్మపుత్రనదీలోయ ప్రాంతం 'ఆర్థిక రాజకీయ సాంఘిక సాంస్కృతిక' రంగాలలో విభిన్నంగా ఉన్నాయని, వాటిని ఒక్కగాటనకట్టివేయడం అసాధ్యమని 'సురా' అంటున్నాడు (మరయితే అస్సాంను గిరిజనప్రాంతాలను కలిపి 'ఈశాన్యభారతం' అని పేరుపెట్టి గణాంకాలు సేకరించడం ఎందుకు?). అంతేకాదు ఈనాటి ఉద్యమాల వర్గస్వభావం కూడ విభిన్నం. ఈనాటి ఈశాన్యభారతాన్ని గురించి ముఖ్యంగా చెప్పవలసిన విషయం ఇది. సురా ఉద్దేశ్యం ఏమయినా, ఈ విషయాన్ని కప్పిపుచ్చడం ఈ పుస్తకం ముఖ్యంగా సాధించింది.

భారతదేశంలో ఎక్కడా అంతర్గత వలసదోపిడీలేదని చెప్పడం జరిగింది. ఇది అస్సాంకేకాదు, నాగాలాండ్ మిజోరంలకు గూడ వర్తిస్తుంది. అసలు ఒక ప్రాంతాన్ని వలసవిధానంలో ఆర్థికంగా దోచుకుంటే దానిఫలితంగా దోచుకున్న ప్రాంతాలన్నీ, ఆ ప్రాంతాలలోని వర్గాలన్నీ (వాటిమధ్య ఎన్ని అసమానతలున్నా) మొత్తంగా అభివృద్ధి చెందాలి. పాశ్చాత్యదేశాలు ఈనాటి 'మూడవ ప్రపంచం'లో వలసదోపిడీ మొదలు పెట్టిన కొద్దిసంవత్సరాలకే అన్నివర్గాలు (కార్మికవర్గంతోసహా), అన్ని ప్రాంతాలు, అభివృద్ధిచెందాయి. బ్రిటన్‌లో చార్టిస్టు ఉద్యమం తరువాత, ఫ్రాన్సులో ప్యారిస్ కమ్యూన్ తరువాత కార్మికవర్గ ఉద్యమాలు మందగించడానికి ఇదే కారణం. కాని, పేదవాని బట్టలో చిరుగులలాగ దేశమంతటా వెనుకబాటుతనం వ్యాపించిన భారత భూమిలో అటువంటిదేమీ కనుపించదు.

అయితే ఆర్థికేతర వలసపాలనఉంటుంది. ఇది బ్రిటిష్‌వారు ఈశాన్యభారతంలోను బెలూచిస్తాన్ ప్రాంతంలోను పాటించినది. దీనిస్వభావం ఆ ప్రాంతాలను

సరిహద్దుభద్రతకు గోడలాగాగణించడం. ఈశాన్యభారతంలోని గిరిజనరాష్ట్రాలను భారతప్రభుత్వం ఈరకమైన వలసభావంతో చూసింది. ప్రజాక్షేమంతో నిమిత్తంలేని ప్రభుత్వానికి ఇదిసహజధోరణిఅని ఈశాన్యభారతంపటం చూస్తేనేతెలుస్తుంది. అక్కడ ఎంతోకాలంగా సాగుతున్నఉద్యమాలు దీనికినిరసనగా మొదలయిన జాతిఉద్యమాలు. ఈవిషయం వాటిరూపంచూస్తేనే తెలుస్తుంది. నాగాలు మిజోలు భారతప్రభుత్వాన్ని సైన్యాన్ని తమశత్రువుగా ఎంచుకున్నారు. సాయుధుడైన శత్రువును సాయుధంగానే ఎదుర్కొంటున్నారు. ఈ పోరాటాల్ని అస్సాంఉద్యమంతో పోలిస్తేనే ఆ ఉద్యమాల విభిన్నవర్గస్వభావం అర్ధమవుతుంది. ఈ సందర్భంలో 'ఉద్యమాలునడిపేవారి స్వభావాన్ని ప్రమాణంగా తీసుకోగూడదు. ఉద్యమంయొక్క అసలుస్వరూపంచూడాలి, అన్నవాదంఉంది. అసలుస్వరూపంగూడచూద్దాం, కాని ఈవాదం బొత్తిగాఅశాస్త్రీయం. ఉద్యమం తనవర్గస్వరూపాన్నిబట్టి పోరాటపంథాను, కోర్కెలని నినాదాలను ఎంచుకుంటుంది. నాయకత్వం నిమిత్తమాత్రం. అస్సాంఉద్యమంనడిపేవారిలాగే 'ప్రీపాక్' పి.ఎల్.ఏల నాయకత్వం విద్యార్థుల, విద్యాధికులచేతిలోవుంది. త్రిపురలోజరుగుతున్న గిరిజనపోరాటాన్ని నడుపుతున్న త్రిపుర ఉపజాతి యువసమితి T.U.J.S. కూడ 'మధ్యతరగతి' యువకుల నాయకత్వంగలసంస్థే. అయినా ఈపోరాటం గిరిజనుల భూములుకాజేసిన బెంగాలీభూస్వాములకు, వారిని విపరీతంగాపీడిస్తున్న బెంగాలీ వర్తకులకు వ్యతిరేకంగా సాగుతున్న గిరిజన శ్రామికవర్గపోరాటం కావటంచేత దాని రూపంగూడ అఖిలఅస్సాం విద్యార్థిసంఘం నడుపుతున్న అస్సాంఉద్యమానికిభిన్నంగా వుంది. (అంతదాకాఎందుకు, ఈనాటి ఆదిలాబాద్ కరీంనగర్ జిల్లాల రైతాంగపోరాటానికి 'వాన్‌గార్డ్'గా నిలబడ్డది విద్యార్థులే).

సాంస్కృతికంగా అస్సాం సాధారణ (mainstream) భారతదేశ హిందూ-ముస్లిం సమాజంలోభాగం. ఈశాన్యేతర భారతదేశీయులు, కేంద్రప్రభుత్వంగూడ ఈశాన్యభారతంపట్ల దీనికనుగుణంగానే ప్రవర్తించారు. మొదటినుండిగూడ ఈశాన్యభారతంలో కల్లోలితప్రాంతచట్టంఉన్నా, మొదటినుంచిగూడ ఆ ప్రాంతమంతా ఉద్యమాలు నడుస్తూనేఉన్నా, నాగాలాండ్‌లో మిజోరంలో 1950లలోనే కల్లోలిత ప్రాంతాల ప్రకటన చేయబడగా అస్సాంలో ఈ సంవత్సరంవరకు ఎప్పుడూచేయలేదు. నాగాలను మిజోలను జంతువులనువేటాడినట్లు వేటాడినప్పుడు నోరుమెదపని పత్రికలు మేధావులు (వీరిలో అస్సామీలుగూడ ఉన్నారు) అస్సాంలో కల్లోలితప్రాంత ప్రకటనకు వ్యతిరేకంగా గగ్గోలుపెట్టారు. కేంద్రప్రభుత్వంగూడ ఆ ప్రకటనను ఎత్తివేసింది (అదే త్రిపురలో ఆ ప్రకటన ఎత్తి వేయబడలేదు సరికదా అక్కడి సి.పి.ఎం.

ప్రభుత్వం కొత్త కొత్త ఆర్డినెన్సులు జారీచేస్తోంది). చాలకాలంగా బెంగాలీ సాంస్కృతిక పీడనం అనుభవించిన అస్సామీలు 'తమదాకవచ్చినప్పుడు' గిరిజనులను పీడించక మానలేదు. 1961లో అప్పటి సంయుక్త అస్సాంరాష్ట్రంలో అస్సామీభాషను రాష్ట్ర భాషగా ప్రకటించడానికి ప్రయత్నంచేసారు. దీనికి అస్సాంఉద్యమ మార్క్సిస్టు మేధావి సంజీబ్‌కుమార్‌బరువా అస్సామీలు తరతరాలుగా సాగిస్తోన్న అస్తిత్వాన్వేషణ (search for identity) లో భాగంగా చిత్రించయత్నించాడు. అయితే బెంగాలీలలో జాతీయ దురహంకారమయినది అస్సామీలలో మరొకటికావడానికి వీలులేదు.

అస్సాం సమాజ నిర్మాణక్రమంగూడ మిగిలిన దేశానికి విభిన్నంకాదు. పల్లె పట్ల భూస్వామ్యవర్గం ఉంది, పట్టణాలలో పెట్టుబడిదారీ వర్గం వుంది (సురా ఇచ్చిన లెక్కలప్రకారం, అస్సాం తేయాకు పరిశ్రమ యజమాన్లలో పాశ్చాత్యుల్ని మినహాయిస్తే మిగిలినవారిలో సగంపైగా అస్సామీలే); అయితే అస్సాంలోని పరిశ్రమల యజమాన్లలో అస్సామీలు తక్కువని, ఎక్కువగా 'విజాతీయు'లని సురా అంటున్నాడు, భారతదేశ బడాబూర్జువా వర్గాన్ని ఒక ప్రాంతానికి 'విజాతీయు'లనడం అశాస్త్రీయం అన్న విషయం అటుంచి, అంతవరకు 'విజాతీయు'లన్న పదాన్ని బెంగాలీల వలస సందర్భంలో వాడుతూవచ్చిన రచయిత, పాఠకుడు పొరబడకుండ, ఈ 'విజాతీయులు' బెంగాలీలుకారని, మార్వాడీలు గుజరాతీలని చెప్పవలసింది. ప్రస్తుత ఉద్యమం వారికి వ్యతిరేకంకాదని గూడ చెప్పవలసింది. ఎందుకు చెప్పనట్టు? 'వలసదోపిడీ'ని వ్యతిరేకించే ఉద్యమం అయితే ప్రధానంగా వీరినా ఎదిరించేది, లేకపోతే రైతాంగాన్నా? నాగా, మిజో, త్రిపుర జాతుల ప్రజలు తమ శత్రువును స్పష్టంగా గుర్తించారు, పోరాటం చేస్తున్నారు. ఒక్క అస్సామీలే తమమీది 'వలస విధాన దోపిడీకి'కి కారణం ఎవరో తెలుసుకోలేకపోవడానికి కారణమేమిటి? వారికంత దృష్టిమాంద్యమా? లేకపోతే ఈ 'వలస విధాన దోపిడీ' అన్న సిద్ధాంతం ప్రతిపాదించిన మేధావులకు దృష్టిమాంద్యమా? త్రిపురలో గిరిజనులు తమ భూములుకాజేసి బెంగాలీ భాషను తమ మీదకు రుద్దడానికి ప్రయత్నంచేస్తున్న బెంగాలీ భూస్వామ్య - వర్తక వర్గానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తే, అస్సాంలో 'ఆసు', అస్సామీభాషను తమ భాషగా అంగీకరించి అస్సాం సమాజంలో కలిసిపోవడానికి ప్రయత్నంచేస్తున్న 'బహిరాగతుల'ను బయటకుగెంటడానికి ప్రయత్నించడం గమనించదగ్గ విషయమని సురా తానే అంటున్నాడు. అయితే ఇందులో అసలు గమనించవలసిన విషయం- ఈ రెండు ఉద్యమాల విభిన్న వరస్వరూపం- సురా గమనంలోకి రాలేదు.

అస్సాంలో ఒకప్పుడు బెంగాలీల సాంస్కృతిక పీడన ఉన్నమాట నిజమే. అయితే అది పాతకథ. ముఖ్యంగా 1961 లో అస్సామీభాషను రాష్ట్ర భాషగా ప్రకటించిన తరువాత 'విజాతి సాంస్కృతిక పీడన' ఎక్కడి నుండి వచ్చిందో అర్థంకావడం లేదు. ఈనాడు అస్సాంలో 60 శాతం అస్సామీభాషను తమ మాతృభాషగా అంగీకరించిన వారున్నారు (సురా 99 వ పేజీలో 'విజాతియు'లపేర ఇచ్చిన లిస్టులో చాలమంది ఈ కోవ వాళ్ళున్నారు). 11 శాతం స్థానిక మైదానప్రాంత గిరిజనులున్నారు. మిగిలిన 29 శాతం మాత్రమే బెంగాలీ, హిందీ, ఈశాన్యప్రాంత గిరిజన భాషలు మాట్లాడే వాళ్ళు. అస్సాంలో అస్సామీభాష మాట్లాడేవారు 'మైనారిటీ' అయిపోవడం ఏమిటి?

అస్సాం బూర్జువావర్గంచిన్నదే. కాని ప్రభుత్వపెట్టుబడి bureaucratic capital మీద ఆధారపడిపెరగడం అలవర్చుకున్న ఈదేశపు బూర్జువావర్గాలకు పెరగడం ఎంతో కాలంపట్టదు. ఈ అస్సామీ బూర్జువావర్గం తమరాష్ట్రంలోని వనరులపై ఆధిక్యతను సంపాదించిన భారత బడాబూర్జువావర్గాన్ని నిరసిస్తోంది. స్థానిక వనరులపై తన అధికారం పెంచజూస్తోంది. దీనిలోభాగంగా దేశబడాబూర్జువావర్గాన్ని 'విజాతియ పెట్టుబడిదారువర్గం'గా చిత్రిస్తోంది. ఈ చిత్రీకరణకు సంజీబ్‌కుమార్ బరువా, తిలోత్తమమిశ్ర వంటి అస్సామీమార్క్సిస్టు మేధావులు, 'సురా' వంటి 'విజాతి' మార్క్సిస్టు మేధావులు సాయంచేస్తున్నారు. కాని ఈ మార్క్సిస్టు మేధావులకు ఈనాటి భారత సమాజస్వరూపం అర్థమయినట్లులేదు. నేటి భారత బడాబూర్జువావర్గం ఒక అఖిలభారతీయవర్గం. దానికి ఉపజాతీయతలేదు. కావడానికి అది గుజరాతీ, మార్వాడీ, పార్సీ, జైన్, చెట్టియార్లకలయిక అయినా అది ఈరోజు ఏజాతికీచెందనివర్గం. అలా కాకపోతే, బిర్లాలు 'మార్వాడీ'లే అయితే రాజస్థాన్ (మార్వాడీలదేశం) ఈనాడు వెనుకబడ్డప్రాంతాల జాబితాలో ఉండేదికాదు. పారిశ్రామికంగా అత్యంతఅభివృద్ధి చెందినదనిచెప్పబడే మహారాష్ట్రలోని ముఖ్యపరిశ్రమలన్నీ గుజరాతీల చేతులలో ఉన్నాయి, మహారాష్ట్రుల చేతులలోకాదు (ఎ. ఆర్. కామత్, ఎకనామిక్ అండ్ పొలిటికల్‌వీక్లీ సెప్టెంబర్ 27, అక్టోబర్ 4, 1980). మరయితే మహారాష్ట్రలో 'విజాతియ ఆర్థికపీడన'ఉందని, 'వలసవిధానంలోదోపిడీ' జరుగుతోందనీ అందామా? శివసేనకు ఎర్రరంగుపులిమి విప్లవసేనగామార్చి నెత్తినెక్కించుకు ఊరేగుదామా? తెలంగాణాప్రాంతంలోకూడ ఆర్థికరంగంలో మార్వాడీ గుజరాతీలదిపైచేయి మరయితే చెన్నారెడ్డి మల్లికార్జున్‌లునడిపిన 'ప్రత్యేకతెలంగాణా' ఉద్యమం 'విజాతియవలస దోపిడీ'కి వ్యతిరేక జాతిఉద్యమమా? సమర్థనీయమా? అవునంటే 'సురా' ఢిల్లీవదలి

హైదరాబాద్ తరలిరావచ్చు. చెన్నారెడ్డి పదవీచ్యుతుడైన తరువాత ఆ పెద్దమనిషిని 'ఇప్పటికైనా కళ్ళుతెరవమ'ని 'ప్రత్యేకతెలంగాణ చెయ్యమ'ని ఆదేశిస్తూ కొంతమంది ఇక్కడ గోడలమీదరాస్తున్నారు. వీరికి సురా తనమేధస్సును అరువీయవచ్చు.

భారతదేశ బూర్జువా వర్గాన్ని గుజరాతీ మార్వాడీ పంజాబీ ఉపవర్గాలుగా (మార్క్స్ పరిభాషలో 'fractions') విడదీయడం వాస్తవికతకు విరుద్ధం. సరైన విభజన, ఒక బడాబూర్జువా వర్గం, ఒక్కొక్క ప్రాంతానికి చెందిన ఒక్కొక్క ప్రాంతీయ బూర్జువావర్గం. బడాబూర్జువావర్గంలో బిర్లాలవంటి మార్వాడీలున్నారు, టాటాలవంటి పార్శీలున్నారు. కిర్లోస్కర్‌లవంటి మహారాష్ట్రులున్నారు. అయితే వీరు తమజాతుల ప్రతినిధులుకారు. ఇది ఒక అఖిలభారతవర్గం. అలాగే ప్రాంతీయ ఛోటా బూర్జువావర్గాలంటే ఉపజాతీయవర్గాలుకావు. ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ బూర్జువా వర్గంలో తెలంగాణప్రాంతంలోని కలపవ్యాపారంలోఉన్న గుజరాతీలుకూడ ఒకభాగం. ఒకపెట్టుబడిదారు ఏ ప్రాంతంవాడన్నది అతని మాతృభాషనుబట్టి నిర్ణయించడం భౌతికవాదానికి విరుద్ధం. అతని వ్యాపారదృష్టినిబట్టి నిర్ణయించాలి.

ఇంత ఉపోద్ఘాతం అయిన తరువాత అస్సాం ఉద్యమం గురించి చూద్దాం. అస్సాం వెనుకబడ్డప్రాంతం అన్నది ఇక్కడ ముఖ్యవిషయంగాదు. అస్సాం సమృద్ధిగా వనరుల్ని కలిగిఉందన్నది చాల ముఖ్యవిషయం. ఈ వనరులమీద భారత బడా బూర్జువావర్గం ఆధిపత్యాన్ని అస్సాంప్రాంతీయ బూర్జువా వర్గం (ఇందులో అస్సామీలే కాదు, మార్వాడీలు కూడ ఉన్నారు) నిరసిస్తోంది, ఎదిరించదలచుకుంది. అయితే మనదేశం బూర్జువా వర్గం గట్టిగా పోరాటం చేయడానికి ఇష్టపడదు (ఒక్క ప్రజలతో తప్ప). గతంలో సామ్రాజ్యవాదులతోను చేయలేదు, తరువాత భూస్వాములతోను చేయలేదు. అందుకే అస్సాం ప్రాంతీయ బూర్జువా వర్గం బడాబూర్జువాలను పూర్తిగా ఎదిరించే స్వాతంత్ర్యం కోరడం లేదు. సి. పి. ఎం. వారి 'వేర్పాటు' అరోపణ అసత్యమని అస్సాంఉద్యమకారులు ఘోషపెడుతున్నారు. ఈఘోష అబద్ధపుఘోష కాదు. పచ్చినిజం. అంతటితెగింపు ఈదేశ పాలకవర్గాలకులేదు. తమది సాయుధ పోరాటంకాదని, తాము అహింసావాదులమని గాంధేయులమనికూడ ఘోషపెడుతున్నారు. ఏనాడో ఆలోచించడంమానేసిన సి.పి.ఎం. మేధావులు ఈమాటల్ని నమ్మకపోవచ్చు గాని, ఇదికూడపచ్చినిజం. ఎంతపచ్చినిజంఅంటే గాంధీనడిపిన 'స్వాతంత్ర్యపోరాటం' నిజస్వభావం తెలిసినవారికి, అస్సాంఉద్యమం స్వరూపంగురించి మరేమీ చెప్పనక్కర లేదు. అస్సాం బూర్జువావర్గానికి కావలసింది తమప్రాంతపువనరులమీద తమఅధికారం పెరగడం. అస్సాంలోపండించే తేయాకుమీద అమ్మకంపన్ను తమకేదక్కాలని, అక్కడి బావులలోని నూనెమీద 'రాయల్టీ' పెరగాలని అస్సాం జనపనార తమమిల్లులకే దక్కాలని (మొదట మిల్లులుపెట్టుకోవడానికి సదుపాయాలుకావాలని)- ఇవేవారికోర్కెలు. 'బహిరాగతుల'ంటారా- బూర్జువావర్గం జనసామాన్యం సహాయంలేకుండ పోరాటాలు

సాహిత్యం - మార్క్సిజం

సి. రామచంద్రారెడ్డి

ఆర్.యస్. సుదర్శనంగారి "మార్క్సుదృష్టిలో సాహిత్యం" వక్రీకరణకు త్రిపురనేని మధుసూదనరావుగారు యిచ్చిన సమాధానంలోని "విమర్శను చాలవరకు అంగీకరిస్తూనే వారివిమర్శపైకొన్ని ఆక్షేపణల్ని," మొత్తం విప్లవసాహిత్యంపై తీవ్ర ఆరోపణల్ని, సూత్రీకరణల్ని, సురేంద్రరాజుతన "సాహిత్యం - మార్క్సిజం" వ్యాసంలోచేశాడు.

"పరిసరాలఎరుక, తనమనస్తత్వం పనిచేసే స్వీయఎరుక వ్యక్తిచైతన్యం అవుతుంది, స్వీయఎరుక సామాజికఎరుకనుండి ఉత్పన్నమవుతుంది"అని మధుసూదన రావుగారు ఆర్.యస్. సుదర్శనంగారికి యిచ్చిన సమాధానంలో చెప్పటంవలన ఆయన మార్క్సిజం విమర్శించి, తిరస్కరించిన యాంత్రిక భౌతికవాదాన్ని అంగీక

చేయలేదని మార్క్సు ఎన్నడోచెప్పాడు. జనసామాన్యంలోని జాతీయశాఖావల్ని రెచ్చగొట్టి వారిమద్దతుపొందడానికే ఈ బహిరాగతులసమస్య ముందుకుతేబడింది. ఇదినమ్మశక్యంకాదంటే ఒక్కవిషయం గుర్తుచేస్తాను. ఈశాన్యభారతంలో (అంటే ముఖ్యంగా అస్సాంలో) పారిశ్రామికాభివృద్ధికోసం ఒకప్రత్యేక మినిస్ట్రీఉండాలని, కాబినెట్హోదాగలమంత్రి ఉండాలని ఈమధ్య కేంద్రప్రభుత్వం ఒకనిర్ణయంతీసుకుంది. అంటే బడాబూర్జువావర్గానికి చాలదగ్గరిచుట్టమైన ఇందిరమ్మ అస్సాం ఛోటా బూర్జువావర్గానికి దానికికావలసిన లంచంపెడుతోందన్నమాట.

ఇదంతా అన్యాయంకాదు, అస్సాంఅభివృద్ధిచెందితే ఎవరికీబాధలేదు. అంతేకాకుండ, బడాబూర్జువావర్గానికి వ్యతిరేకంగా ఒక ప్రాంతీయ బూర్జువావర్గం పోరాడితే కమ్యూనిస్టులు సామాన్యప్రజలకేహానీ జరగనంతకాలం ఆ పోరాటాన్ని సమర్థించవలసిందే. అయితే పాలకవర్గాల ఈ అంతఃకలహంలో లక్షలమంది సామాన్యప్రజలు పావులైతే ఆ కలహాన్ని కమ్యూనిస్టులేవిధంగా సమర్థిస్తారు? వీరిని అస్సాంనుంచి గెంటివేస్తే వారిగతి ఎంతదుర్భరంగావుంటుందో ఊహించలేని విషయమా? ఇటువంటి పనులుచేయడంలో మనపాలకుల నేర్పరితనం మనకుతెలియందా? కేంద్రంలోని బ్యూరోక్రాట్లకూ కలకత్తా వామపక్ష ప్రభువులకుమధ్య పూబంతులుగామారిన దండకారణ్య కాందిశీకుల చరిత్ర మరిచిపోయామా?

వర్గపోరాటదృక్పథం వదిలిపెట్టి, జాతుల 'బలహీనబంధాల సంకెళ్ళ సంగీతానికి' తన్మయత్వంపొందడం బూర్జువా సాంస్కృతిక సాపేక్షవాదానికి (cultural relativism) తగునేమోగాని మార్క్సిజానికితగదు. శ్రీమతి దేవకిజైన్కు తగునేమోగాని, పుస్తకాన్ని 'సృజన'కు 'ఫ్రాంటియర్'కు అంకితమిచ్చిన 'సుర్రా'కు తగదు.

రిస్తున్నారని సురేంద్రరాజు ఆరోపణ. స్వీయఎరుక ఉత్పన్నంకావటంలో వ్యక్తి ఆలోచన, జ్ఞానస్థాయి, చైతన్యస్థాయి, వ్యక్తిగుణగణాలు నిర్ణయాత్మకపాత్ర వహిస్తాయని సురేంద్రరాజు అభిప్రాయం.

వ్యక్తి చైతన్యంలోభాగమైన స్వీయఎరుక సామాజికఎరుకనుండి పుడుతుందని; వ్యక్తిఆలోచన, జ్ఞానం, చైతన్యం, గుణగణాలపై సమాజప్రభావం నిర్ణయాత్మక పాత్ర వహిస్తుందని మధుసూదనరావుగారి అభిప్రాయం. అంటే యిక్కడవ్యక్తికంటే సమాజంముఖ్యం. ఇదిసరైన మార్క్సిస్టు అవగాహన. సురేంద్రరాజుకి సమాజం కంటె వ్యక్తిప్రధానం, ఇది మార్క్సిజం నిర్ద్వంద్వంగా తిరస్కరించిన వ్యక్తివాదం.

పుట్టినవెంటనే ఏవ్యక్తికీ తనచుట్టూవున్న సమాజంగురించిన అవగాహన వుండటానికి వీలుండదు. మనిషిపెరిగేకొద్దీ తనచుట్టూవున్న పరిసరాలు, పరిస్థితులపై అభిప్రాయాలు ఏర్పరుచుకుంటూ, ఆలోచనాధోరణిని మలచుకుంటూ గుణగణాల్ని అలవరుచుకుంటాడు. ఇది వ్యక్తిచైతన్యమవుతుంది. నిర్దిష్టకాలంలో నిర్దిష్టపరిస్థితులు తమ మనుగడకు అడ్డుతగులుతున్నపుడు మనుషులు తమ మనుగడకోసం చేసేప్రయత్నంలో పరిస్థితులకు, తమకు వైరుధ్యమున్నట్లు గుర్తిస్తారు. ఈ వైరుధ్యాన్ని రూపుమాపి పరిస్థితులు తమకు అనుకూలంగా మార్చుకోవడానికి కొందరు ప్రయత్నిస్తారు. కొందరు రాజీపడి పరిస్థితులకు లొంగిపోతారు. పరిస్థితులతో పోరాడేవారు భావిమహోన్నత సమాజనిర్మాతలవుతారు. పరిస్థితులతో రాజీపడ్డవారు యీ దోపిడీ సమాజం యిలాగే కొనసాగేందుకు పరోక్షంగానో, ప్రత్యక్షంగానో తోడ్పడ్డ వాళ్ళవుతారు.

నిర్దిష్ట పరిస్థితుల్లో, నిర్దిష్టకాలంలో సామాజిక దోపిడికి గురిఅవుతున్న వాళ్ళలో కొందరు యీ సమాజాన్ని మారుద్దాం అని నిర్ణయించుకోవడానికీ, ఇంకొందరు యీ నిర్ణయానికి రాకపోవడానికీ కారణం తెలుసుకోవాలంటే మనం రెండు అంశాలను పరిశీలించాల్సివుంటుంది, అవి :

1. ఆ సమాజంలో వ్యక్తులు ఎంత ఎక్కువ దోపిడికి గురిఅవుతున్నారు-

2. ఏ మేరకు తిరోగమన, వినాశనభావాలు, అంధ విశ్వాసాలు వారిని అణగదొక్కుతున్నాయి.

స్వీయ ఎరుక కలిగిన వాడికి వ్యక్తి చైతన్యం వుంటుందని, యిలాంటి వాడే వాస్తవాన్ని మార్చటానికి పోరాటంచేస్తాడని సురేంద్రరాజు సూత్రీకరణ.

సురేంద్రరాజు దృష్టిలో స్వీయ ఎరుక అంటే తనను తాను తెలుసుకోవటం కావొచ్చు. ఇది ఆధ్యాత్మిక ధోరణి. తనను తాను తెలుసుకోవటం అంటే తన ఆలోచనల్ని, అభిప్రాయాల్ని, అవసరాల్ని తెలుసుకోవటం. ఇవన్నీ తెలిసినంత మాత్రాన ఒకవ్యక్తికి సమాజం గురించి కూడ తెలిసిపోతుందనుకోవటం పొరపాటు. తనను తాను సమాజం నుండి వేరు పరచుకుని చూడటం, తెలుసుకోవటం, అన్నది శుద్ధ వ్యక్తి వాదానికి, భావవాదానికి మూలం. సమాజం నుండి విడివడి ఏ వ్యక్తీ తన స్వీయ ఎరుకతో వాస్తవాన్ని మార్చలేడు.

త్రిపురనేనిదృష్టిలో స్వీయఎరుకఅంటే వ్యక్తి సమాజంనుండి వేరుపడక అందులోభాగంగా పొందినచైతన్యం. ఇలాంటిచైతన్యం కలిగినవ్యక్తి సమాజాన్ని మార్చితేగాని తనబతుకు మారదని తెలుసుకుంటాడు, సమూహంలోభాగమై పోరాటం సాగిస్తాడు. సమాజాన్ని మార్చగలశక్తి యిలాంటివ్యక్తులకు ఉంటుంది.

సురేంద్రరాజు వ్యక్తివాది. త్రిపురనేని గతితార్కిక భౌతికవాది.

సురేంద్రరాజు అనుకున్నట్లు, ఒకవ్యక్తి విప్లవకారుడుకావటానికి కారణం కేవలం అతనికి సమాజంపట్ల, మానవులపట్లవున్న నైతికబాధ్యత వల్లకాదు; విప్లవం వల్లనే దోపిడీ, దౌర్జన్యంలేని వర్గరహిత సమాజం స్థాపించబడుతుందని తెలుసుకోవటంవలన విప్లవవిజయానికి తనవంతుకర్తవ్యాన్ని నిర్వహించాల్సిన అవసరాన్ని గుర్తించటంవలన ఒకవ్యక్తి విప్లవకారుడవుతాడు.

త్రిపురనేని, మానవ కార్యాచరణకి జంతువు కార్యాచరణకిఉన్న తేడాను చెప్పినమాటల్ని 'కోట్'చేస్తూ సురేంద్రరాజు "ఇక్కడ మననంచేసుకుంటే వ్యక్తికి ఉన్న ప్రాముఖ్యత సులువుగా బోధపడగలదు" అంటున్నాడు. ఎలాగైనాసరే వ్యక్తి ప్రాధాన్యతను చెప్పాలనే అతనితపన యిక్కడకూడ మనకు కనబడుతుంది. జంతువుతో పోల్చినపుడు మానవుడిప్రాముఖ్యం పైచేయిగాఉంటుంది. కానీ, ఒకవ్యక్తిని సమాజంతో పోల్చినప్పుడు, సమాజప్రాముఖ్యం సులభంగా అర్థమవుతుంది. ఈ విషయాన్ని సురేంద్రరాజు అర్థంచేసుకోకపోవటం వయ్యక్తికవాద దృక్పథంవల్లనే.

ప్రపంచాన్ని, బాహ్యవాస్తవికతను మార్చే వ్యక్తి తాను మార్చబోతున్న వాస్తవికతను గురించిన జ్ఞానాన్ని కలిగి వుంటాడని, తాత్వికుడు, కవి ముందుగా కల్పిస్తేనే తర్వాత సమాజంలో ఆకృతి తీసుకుంటుందన్న సురేంద్రరాజు అభిప్రాయం- కేవలం భావాలు వాస్తవాన్ని మార్చగలవను భావవాదం తప్ప మరేమీకాదు. ఇది సామాజిక

విప్లవాన్ని తేవటంలో కేవలం ఉపరితలఅంశాలు పునాదిఅంశాలకంటే ఎక్కువ ప్రాధాన్యత వహిస్తాయని చెప్పటమే. అయితే ఉపరితలఅంశాలనుండి పొందినచైతన్యం కొన్నిసమయాలలో పునాదిఅంశాలపై నిర్ణయాత్మకశక్తి కలిగిఉంటాయి. అంతిమంగా పునాదిఅంశాలే విప్లవంలో నిర్ణయాత్మక పాత్రవహిస్తాయన్నది మార్క్సిస్టు అవగాహన.

భావాలు వాస్తవాన్ని మార్చగలవనుదృక్పథం, భావోద్యమం, మానవతా వాదం, సంస్కరణవాదం, నిశ్చయవాదంలాగానే పునాది అంశాల్ని కదిలించలేదు. కవులూ, తాత్వికులూ విప్లవంరాకముందు, వచ్చినతర్వాత విప్లవభావాల్ని ప్రచారం చేయటానికి, విప్లవ సామాజికచైతన్యం విస్తరింపచేయటానికి, విప్లవవిజయాల్ని గానంచేయటానికి, ఉపకరిస్తారు. పునాది రంగాలలో వర్గఘర్షణతో మొదలవుతుంది విప్లవం. విప్లవాన్ని విజయవంతంచేసేది కార్మికులు, కర్షకులు, యితర విప్లవకర వర్గాలు. కవి లేక తాత్వికుడియొక్క విప్లవభావాలకుపునాది వాస్తవపరిస్థితులు. అంతేకాని విప్లవం కవుల, తాత్వికుల "విశ్వామిత్రసృష్టి"కాదు.

"సమాజంకోసం, మార్పుకోసం కృషిచేసేవాళ్ళు ఏ వ్యవస్థలోనైనా కొద్దిమంది వుంటారు. కనుక వ్యక్తిగతఅంశానికి మార్క్సిజంగుర్తింపు ఉన్నదనేతెలుస్తుంది. అయితే యీ అంశాన్ని చెరిపివేసేప్రయత్నం మ కు మార్క్సిస్టుల్లో ఎల్లెడలాకనిపిస్తుంది" అని బాధపడిపోతున్నాడు సురేంద్రరాజు.

సమాజంకోసం, మార్పుకోసం, కృషిచేసేవాళ్ళు ఏవ్యవస్థలోనైనా కొద్దిమంది మాత్రమే వుంటారనటం న్యాయంకాదు. విప్లవారంభదశలో అధికసంఖ్యాకుల ఆశయాలకు కొద్దిమంది కట్టుబడి విప్లవం కోసం పనిచేస్తారు. విప్లవ కార్యాచరణ పెరిగి, విప్లవం విజయవంతమయ్యేదశలో ఎక్కువమంది ఆశయాలకు కట్టుబడి ఎక్కువ మంది విప్లవవిజయానికి తోడ్పడుతారు. విప్లవం విజయవంతమయ్యేకొద్దీ విప్లవ వ్యతిరేకుల సంఖ్య తగ్గిపోతుంది. ఈ దశల గూర్చి అవగాహన లేకుండా సూత్రీకరణలు చేయటం సురేంద్రరాజు అవగాహనాలోపాన్ని తెలియచేస్తుంది.

సురేంద్రరాజు భావిస్తున్నట్లు మార్క్సిస్టులు విప్లవంలో వ్యక్తి అంశాన్ని చెరిపివేయటంలేదు. వారికి తెలుసు విప్లవం చేసేది వ్యక్తుల బృందాలేనని. అయితే వ్యక్తిని సమాజంలో భాగంగానే మార్క్సిస్టులు చూస్తారు. సమాజం మారితేగాని వ్యక్తి మారడని విశ్వసిస్తారు అంతేగాని కొంతమంది వ్యక్తివాదులు, సంస్కరణవాదులు భావించినట్లు, వ్యక్తి మారటంతోనే విప్లవం సాధ్యమవుతుందని తలకిందువాదం మార్క్సిస్టులు చేయరు. వ్యక్తివాదం అవకాశవాదానికి, పలాయన వాదానికి, అంతిమంగా యథాస్థితివాదానికి దారితీస్తుంది.

"సాహిత్యం, కళలు సామాజిక సంబంధాలనుండే కొంతవరకు స్వతంత్రం కలిగివుంటాయి." యింకా "తప్పనిసరిగా సామాజిక సంబంధాల నధిగమించే ప్రయత్నంచేస్తుంది సాహిత్యం" అని సురేంద్రరాజు సూత్రీకరించాడు. ఆయన చెప్తున్న పైరెండు అభిప్రాయాల్లోని వైరుధ్యం మనకు స్పష్టమవుతున్నది. ఒకచోట "కొంతవరకు స్వతంత్రం కలిగివుంటాయి" అనటంలోను, ఇంకొకచోట సాహిత్యం "తప్పనిసరిగా" సామాజిక సంబంధాలనధిగమించే ప్రయత్నం చేస్తుందనటంలోను చాలవ్యత్యాసం ఉంది. తనకే స్పష్టంగా తెలియని విషయాన్ని ఎదుటివాళ్ళకి 'పరమ సత్యమైనదిగా' చెప్పటానికి ప్రయత్నిస్తున్నాడు సురేంద్రరాజు.

నిర్దిష్ట సామాజిక పరిస్థితుల్లో నిర్దిష్ట కాలంలో సాహిత్యాన్ని చూసినట్లయితే ఎక్కువభాగం వర్తమాన సామాజిక సంబంధాలకు అనుగుణంగానే ఉంటుంది. ఏ కొద్దిభాగమో అందుకు విరుద్ధంగా ఈనాటి సామాజిక పరిస్థితులకు ఒక అడుగు ముందో వెనకో ఉంటుంది.

సురేంద్రరాజు షేక్స్పియర్ రాసిన "రోమియో జూలియట్" నాటకాన్ని గూర్చి "ఆనాటకం ఆనాటి వైరుధ్యాల్ని చిత్రీకరించినా ఇంకా ఆనాటకం సజీవంగాఉందంటే దానిక్కారణం సార్వజనీనతఅని చెప్పుకోవాలి" అన్నాడు. ఒకరచన సార్వజనీనత కలిగిఉందంటే అర్థం-అది అన్నికాలాల్లో, అన్నిపరిస్థితుల్లో, ఒకేవిధంగా పాఠకుల్ని లేక ప్రేక్షకుల్ని ప్రభావితులగావిస్తున్నదని, ఆనందింపచేస్తున్నదని, ఇది అసాధ్యం. 'రోమియోజూలియట్' నాటకానికి ఆనాడున్న ప్రచారము, ప్రేక్షకులపై ఆనాడు అది చూపిన ప్రభావము నేడూ కలిగివున్నదనటం తప్పుడు అభిప్రాయం. ఎందుకంటే, ఏరచనైనా- (నాటకం కానివ్వండి, పద్యకావ్యం, గద్యకావ్యం ఏదైనా కానివ్వండి) దాని చారిత్రిక దశనుండి యీవలికివస్తే దాని ప్రభావం చాలతక్కువగా ఉంటుంది. షేక్స్పియర్ కాలంనాటి ఆంగ్లసమాజం స్త్రీపురుష సంబంధాల విషయంలో యీనాడూ అట్లాగేలేదు. ఎన్నో మార్పులకి గురైంది. కాబట్టి 'రోమియోజూలియట్' నాటకం సార్వజనీనత కలిగివుందనటం తప్పుడు అవగాహన.

"ఒక రచనను అన్ని వర్గాలపాఠకులు ఆనందించిన్నాడుకూడ మనం ఆరచనను సార్వజనీన రచనగా గుర్తించవచ్చు" అంటూ సురేంద్రరాజు, తన అభిప్రాయాన్ని బలపర్చుకోవటానికి, బాల్జాక్‌ని మార్క్స్, అట్లాగే బోద్‌లేర్, ఆస్కార్‌వైల్డులు మెచ్చుకోవటం; బుచ్చిబాబు రచనల్ని మార్క్సిస్టులు వ్యతిరేకులు మెచ్చుకోవటాన్ని ఉదాహరణగా యిచ్చారు. బాల్జాక్ తనకు తెలిసో, తెలియకో అదనపు విలువను గూర్చి

తన రచనల్లో చెప్పాడు కాబట్టి మార్క్సు అతడి రచనల్ని, ఆమేరకు మెచ్చుకున్నాడు. బాల్జాక్ తనరచనల్లో బూర్జువా కృత్రిమ విలువల్ని నిరసించాడు కాబట్టి బోద్‌లేర్, ఆస్కార్‌వైల్డులు అతడ్ని మెచ్చుకున్నారు. అయితే బాల్జాక్‌ని మార్క్సు మెచ్చుకోవటం లోను, బోద్‌లేర్, అస్కార్‌వైల్డులు మెచ్చుకోవడంలోనూ ఉద్దేశాలలో తేడావుంది. గతాన్ని, వర్తమానాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి సమాజరుగ్మతలకి మూలకారణం తెలుసుకుని, ఆకారణాన్ని రూపుమాపి అత్యున్నత మానవ విలువలుగలిగిన సమసమాజాన్ని స్థాపించటం మార్క్సుధ్యేయం. కాని బోద్‌లేర్, ఆస్కార్‌వైల్డ్‌ల ధ్యేయం బూర్జువా విలువల విధ్వంసం నుండి గతాన్ని పునఃప్రతిష్ఠాపన చేయటం. కాబట్టి ఒక రచన అన్నివర్గాల పాఠకుల్ని ఒకే విధంగా ఆనందింపచేస్తుందనుకోవటం పొరపాటు. బుచ్చిబాబు రచనల్ని మార్క్సిస్టులు ఎవరూ మెచ్చుకోలేరు.

ఒకరచయిత తనరచనలో రెండువిరుద్ధాంశాల్ని బలంగాచెప్పటంవల్ల విరుద్ధ భావాలుగల పాఠకుల మన్ననలు కొంతవరకు పొందవచ్చు. అయితే అంతిమంగా ఆ రచయిత ఎటువైపున్నాడన్నది చైతన్యంగల పాఠకులకు తెలిసిపోతుంది. ఈవిధంగా చూసినా సార్వజనీనతఅన్నది అపోహమాత్రమేనని తెలుస్తున్నది.

"ఉత్పత్తిచేయబడిన వస్తువు తనవినియోగదారుణ్ణి సృష్టించుకున్నట్లే, ఉత్పత్తి చేయబడిన రచన తనపాఠకుల్ని సృష్టించుకుంటుంది. కాబట్టి ప్రజలస్థాయినిబట్టి కవిత్వం రాయమనటం ఎంతమోసమో దీన్నిబట్టి తెలుస్తుంది"- అన్నది సురేంద్రరాజు సూత్రీకరణ. ఇంకా ఆయన- చెత్తసినిమాలుతీస్తున్న నేటి సినిమా నిర్మాతలు, దర్శకులతో అభ్యుదయ రచయితల్ని, విప్లవ రచయితల్నిపోల్చి యీరెండుపక్షాలు ఒకటేఅని తప్పుడు ఆరోపణచేశాడు. సురేంద్రరాజు ఆలోచన ఎంతవక్రమైనదో, ఎంతగా కుంచించుకపోయిందో యిక్కడ ప్రతిపాఠకునికి అర్థమవుతున్నది.

విప్లవరచనకైనా, ఆధునిక క్లిష్టరచనకైనా ముందేఅమూర్తంగా ఎక్కడో పాఠకులుండరు. కాబట్టి ఎలాంటివ్యక్తివాద, ఆత్మాశ్రయ, అయోమయ అయఃపిండాలైనా పాఠకుల్ని సులభంగా తయారుచేసుకుంటాయని సురేంద్రరాజు అభిప్రాయం. ఇలాంటి అభిప్రాయాలు, సూత్రీకరణలు చివరికి సాహిత్యాన్ని ప్రజలకుదూరంగా, అమూర్తంగా, కొరుకుడుపడనికొయ్యగా తయారుచేస్తాయి. ఆత్మసంతృప్తికోసం, కీర్తికండూతికోసం రచనలుచేసే దుస్థితికి దిగజార్చబడతాడు.

అర్థంచేసుకోగల కొందరికోసమే సాహిత్యం సృష్టించబడుతుందనే సురేంద్రరాజు అభిప్రాయం ఎక్కడికి దారితీస్తుందంటే- రాసినవాడే తనరచనకు పాఠకుడుగా

మిగిలిపోయే అధ్వాన్నపు పరిస్థితికి ఎంతఅస్పష్టంగా, అయోమయంగారాస్తే అంత గొప్పరచన సురేంద్రరాజులాంటివారికి.

నిజమైనవిప్లవరచయిత ప్రజల్ని అర్థంచేసుకుంటూ, వాళ్ళనుండి ఉత్తేజాన్ని పొందుతూ తనరచనలద్వారా ప్రజల్నియింకా చైతన్యవంతుల్ని చేస్తాడు. విప్లవ రచయితకి "ప్రజలనుండి ప్రజలలోకి" అన్నది చాల ఆచరణీయమైనది. అంతేకాని రచయిత తనయిష్టానుసారం ఆత్మసంతృప్తికి అర్థంకానివిధంగా సాహిత్యరచనచేస్తూ తన అమోఘరచనే పాఠకుల్ని సృష్టించుకుంటుందనే ఉలిపికట్టె పోకడలు అలవరుచు కోవటం ఆత్మహత్యాసదృశం.

రచయిత మిగతాజనంకంటే అత్యుత్తముడు, విప్లవరథసారధి- అనే అపోహ నుండి పుట్టినవి సురేంద్రరాజు సూత్రీకరణలు చాలవరకు.

సాహిత్యంవిషయంలో ప్రభుత్వదృక్పథాన్నే మార్క్సిస్టు విమర్శకులు అంగీక రిస్తున్నారని సురేంద్రరాజు ఆరోపణ. ఏరకమైనసాహిత్యం తనఉనికికి భంగం కలిగిస్తుందో, ఏది కలిగించదో పాలకవర్గానికి బాగతెలుసు. అంతమాత్రంచేత పాలక వర్గ దృష్టినే సాహిత్యానికి కొలబద్దగా వాడవలసినదుర్గతిలో మార్క్సిస్టు విమర్శకులు లేరు. బూర్జువావిలువల్ని, సాంప్రదాయాన్ని నిరసించిన చాలమంది రచయితలను మార్క్సిస్టు విమర్శకులు గుర్తిస్తున్నారు. అట్లాగే సంఘసంస్కరణాభిలాషకలిగిన గురజాడ అప్పారావులాంటి రచయితల రచనల్లోని మంచినిమెచ్చుకోవటం, చెడును విమర్శించటంలో మార్క్సిస్టు విమర్శకులు స్పష్టంగా, నిర్దిష్టంగానున్నారు. చలం లాంటి రచయితల రచనల్లోని అభ్యుదయాంశను మార్క్సిస్టువిమర్శకులు మెచ్చుకున్న సంగతి సురేంద్రరాజు మరిచిపోయినట్లున్నాడు. ఎటొచ్చీ తమరచనలద్వారా అభ్యు దయ నిరోధకభావాల్ని ప్రచారంచేస్తూ పాలకవర్గానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహాయపడుతున్న రచయితల్నిమాత్రమే మార్క్సిస్టువిమర్శకులు తీవ్రంగా విమర్శి స్తున్నారు. ఈవిషయాన్ని గుర్తించకుండా మార్క్సిస్టువిమర్శకులు మార్క్సిస్టులుకాని రచయితల సాహిత్యాన్ని ప్రభుత్వ అనుకూలమైనదిగా నిర్ణయిస్తున్నారని సురేంద్ర రాజు బాధపడటంలో అర్థంలేదు.

"నిజానికి శాస్త్రప్రగతి పెట్టుబడిదారీ వ్యవస్థలోనే పరాకాష్ఠనొందింది"- అని సురేంద్రరాజు శాస్త్రీయ అవగాహనలేని సూత్రీకరణచేశాడు. శాస్త్రప్రగతి అంతా పెట్టుబడిదారీ వ్యవస్థలోనే జరిగినట్లూ, సోషలిస్టు వ్యవస్థలో యిక శాస్త్రప్రగతి జర గాల్సిందేమీలేనట్లు వ్యాఖ్యానించటం సైన్సుకే విరుద్ధం. సైన్సు నిత్యనూతనమైనది.

కొత్త కొత్త విషయాలను కనుగొనటంతో పాత విషయాలు మరుగునపడటం, ఒక్కో సారి పాత విషయాలు మరింత పటిష్టంగా ముందుకురావటం శాస్త్రం విషయంలో జరుగుతుంది. అంటే సైన్సులో ఏదీ స్థిరంగా ఉండిపోదు. మార్పుకు గురవుతూనే ఉంటుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడిదారులు తమ లాభాలకోసం శాస్త్రపరిశోధనల్ని ప్రోత్సహిస్తారు. అయితే యీ శాస్త్రపరిశోధనా ఫలితాల్ని పెట్టుబడిదారులు, పాలక వర్గం అనుభవిస్తాయి. అందువల్ల పెట్టుబడిదారీ వ్యవస్థలో శాస్త్రప్రయోజనం పరిధి చాలతక్కువ. అది కుంచించబడుతుంది. సోషలిస్టు వ్యవస్థలో సామాజికాభివృద్ధికోసం శాస్త్రపరిశోధనలు జరుగుతాయి. శాస్త్రపరిశోధనాఫలితాలు సర్వమానవాభ్యుదయానికి ఉపయోగపడతాయి. సోషలిస్టు వ్యవస్థలో శాస్త్రప్రగతి, ఫలితం ప్రజలందరి నిత్య జీవితానుభవంలోకి రావటంవలన, యీదశే శాస్త్రానికి ఉత్తమదశ. కమ్యూనిస్టు వ్యవస్థలో యిది ఉన్నతదశ చేరుకుంటుంది.

సృజనాత్మకత - ఇంద్రియ గ్రహణశక్తి అన్న అంశంకింద సురేంద్రరాజు, కళను ఆస్వాదించటానికి, ఆనందించటానికి ఇంద్రియానుభూతి చాల అవసరమని, కళలను ఆనందించగల వాడికి మాత్రమే ఇంద్రియానుభూతి వుంటుందని, మిగిలిన వారికి ఇంద్రియాలు నిర్వీర్యంగా ఉంటాయని, అలాంటి వారికి జంతువుకు తేడాలేదని కొన్ని సూత్రీకరణలు చేశాడు. ఇంకా, "తక్షణ భౌతికావసరాలకతీతంగా దృష్టినిలప గలిగిన వాడుమాత్రమే సాహిత్యాన్ని సృష్టించగలడు, ఆనందించగలడని తెలుస్తుంది. భౌతికావసరాల పరిధిలో జీవించే మనిషి కళల్ని అందుకే ఆనందించలేడని" ఒక అమూల్యమైన(!) సూత్రీకరణకూడ చేశాడు. ఆయన అభిప్రాయం ప్రకారం - ఆక లైనపుడు భోజనం తిననివాడు, దప్పికైనపుడు నీళ్ళు తాగనివాడు, చలికీ, ఎండకీ, వానకి చెదరని బెదరనివాడు, శారీరకావసరాల్ని లెక్కచేయనివాడు మాత్రమే సాహి త్యం సృష్టించగలడు, ఆనందించగలడు. అంటే, "గాలి భుజించే ఋషులు" మాత్రమే యీపని చేయగలరని సురేంద్రరాజు అభిప్రాయమా!? ఇప్పుడు సాహిత్యాన్ని సృష్టిస్తున్నవారు, ఆనందిస్తున్నవారు భౌతికావసరాల్ని అధిగమించలేని "పామరులు" కాబట్టి వీళ్ళు సృష్టిస్తున్నది, ఆనందిస్తున్నది సాహిత్యం కాదన్నమాట!

తన తప్పుడు అభిప్రాయాలను బలపరచుకోవటానికి సురేంద్రరాజు వాడుకున్న మార్క్స్ అభిప్రాయాలు ఇవి 1 "....నిజానికి అతడు భౌతికావశ్యత నుండి స్వేచ్ఛ పొందినపుడు మాత్రమే సృష్టిస్తాడు"

2 "స్వంతఆస్తి రద్దుచేయటంద్వారా మానవేంద్రియాలకు పూర్తి స్వేచ్ఛ లభిస్తుంది.

ఇక్కడ, స్వంతఆస్తి రద్దుచేయటంతో మానవులకు భౌతికావశ్యకతలు ఉండవనికాదు. మానవులు భౌతికావసరాలకు అతీతమైపోతారనీకాదు. ఇక్కడ అర్థమేమంటే స్వంతఆస్తిలేని వర్గరహితసమాజంలో మానవుని భౌతికావసరాలు సులభంగాతీరే మార్గంఉంటుంది, కాబట్టి మానవులు తమకాలాన్ని, శక్తిని యిప్పటిలా కేవలం భౌతికావసరాలు తీర్చుకోవటానికి వెచ్చించనవసరంవుండదు. కళలకు, సాహిత్యసృజనకు అప్పుడు మానవులు తమ సృజనాత్మకశక్తిని, కాలాన్ని అధికంగా ఉపయోగించగలరని మార్క్స్ అభిప్రాయం.

సాహిత్యాన్ని ఆనందించాలనుకునేవాడికి సాహిత్యానికిచెందిన ఇంద్రియాలుంటే తప్ప లాభంలేదని సురేంద్రరాజు. ఇతని అభిప్రాయంప్రకారం సాహిత్యాన్ని ఆనందించటానికి మానవునికి సామాన్యంగా సహజంగాఉన్న అవయవాలు చాలవన్నమాట! అదనంగా సాహిత్యయింద్రియాల్ని కలిగివుండాలన్నమాట! ఈ సాహిత్య యింద్రియాలు ఎక్కడదొరుకుతాయో సురేంద్రరాజు చెబితేబాగుండు. ఇంకా, ఆయనబాధ ఏమిటంటే సాహిత్య ఇంద్రియాలు లేనివాళ్ళు సాహిత్యం బాగోగుల్ని నిర్ణయించటంతో ఇవ్వాళ సాహిత్యఅవగాహన లోపించినదట.

సాహిత్యానికి ఒకరకమైన యింద్రియాలు, మానవశరీర భౌతికావసరాలకు ఒకరకమైన యింద్రియాలూ ఉండవు. మానవుడు తనకున్న యింద్రియాలద్వారానే దేన్నయినా తెలుసుకోవటం జరిగింది. చాలమంది సాహిత్యాన్ని ఆనందించేస్థాయిలో ఎందుకులేరంటే, వర్గసమాజంలో వాళ్ళసర్వశక్తులు కేంద్రీకరించి శ్రమించినా చాలమందికి వాళ్ళ భౌతికావసరాలు తీరటంలేదు. ఈవిషయాన్నే మరోవిధంగా మార్క్స్ "ఎంతో అందమైన సంగీతంకూడ సంగీతాన్నానందించలేనివాడిలో ఎట్టిచలనాన్ని కల్గించలేదు. ఎందుకంటే ఆమనిషి శ్రవణేద్రియానికి అదిలక్ష్యంకాదు. దీనికికారణంగా ప్రధానమైనశక్తిని ధృవీకరించడంద్వారామాత్రమే నాలక్ష్యాన్ని చేరుకోగలను"అన్నాడు. ఇంకా వివరంగా చెప్పాలంటే, ఆకలితోబాధపడేవాడికి సంగీతంవినిపించి 'నీఆకలి మరిచిపోవోయ్! అంటే మనల్ని అతను పచ్చిమోసగాళ్ళకింద జమవేస్తాడు. కారణం అతని తక్షణావసరం ఆహారం కాబట్టి. అంతేగాని సురేంద్రరాజు అనుకున్నట్లు సాహిత్యాన్ని ఆనందించగల ఇంద్రియాలను కలిగివుండటం, లేకపోవటంకాదు.

ఇవ్వాళ మార్క్సిస్టురచయితలు జీవితంపైకాకుండా మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథానికిమాత్రమే నిబద్ధులౌతున్నారని, వీళ్ళకు జీవితంగురించిన లోతులుసరిగా

తెలియకపోవటంవలన వీరుజీవితాన్ని గురించి మాట్లాడానికి అనర్హులు– అని సురేంద్ర రాజు మార్క్సిస్టు రచయితల అర్హతానర్హతలు చర్చించాడు.

సురేంద్రరాజు దృష్టిలో మార్క్సిజంఅంటే అదేదోఅర్థంకాని అఖండ బ్రహ్మ పదార్థంలాగుంది. దానికి నిబద్ధుడైనవాడికి జీవితంగురించి తెలియదని ఆతనిబాధ. మార్క్సిస్టు ప్రాపంచికదృక్పథానికి నిబద్ధుడైనాడంటే అర్థం జీవితంలోని సంఘర్షణలకి తీవ్రంగా 'రియాక్ట్' అయినాడని. మార్క్సిజంచెప్పేదే జీవితంగురించి, జీవితసమస్యల గురించి, సామాజిక సమస్యల గురించి, వాటిని పరిష్కరించుకునే మార్గాలగురించి.

'కళ కళకోసమే'అనే శుద్ధకళావాదులకి మార్క్సిస్టురచయితలకీకూడ జీవితం పట్ల నిబద్ధతలేదని సురేంద్రరాజు ఆరోపించటంలో అతని మిడిమిడిజ్ఞానం బహిర్గత మవుతున్నది. కుహనామేధావులు, విప్లవంముసుగేసుకుని విప్లవాన్ని వెన్నుపోటుపొడిచే విప్లవవ్యతిరేకులు విప్లవాన్ని కోరుతున్నట్లు పోజుపెడ్తారు. సాహిత్యంలో మార్క్సిస్టు దృక్పథాన్ని వ్యతిరేకిస్తారు. మానవజాతిపట్ల, జీవితంపట్ల నిబద్ధులుకావటంవలన, మానవజాతిప్రగతికి మార్క్సిజంమాత్రమే సరైనమార్గమని తెలుసుకోవటంవలననే రచయితలు మార్క్సిస్టు ప్రాపంచికదృక్పథానికి నిబద్ధులవుతున్నారు. మార్క్సిస్టు రచయితల సిద్ధాంత నిబద్ధతని వ్యతిరేకించేవాళ్ళకి మార్క్సిజంఅంటేనేభయం. కాని, తమతప్పుడు సూత్రీకరణలకి, అభిప్రాయాలకి బలంచేకూర్చుకోవటానికి మార్క్స్, ఎంగెల్స్ అభిప్రాయాల్ని సమయం, సందర్భంలేకుండా 'కోట్' చేస్తుంటారు. 'కళ కళకోసమే' అనే శుద్ధకళావాదులకికూడ ఆధారం వాస్తవజీవితమే.

28 నవంబరు 1885న మిన్నాట్స్‌కి, ఏప్రిల్ 1888లో మార్గరెట్‌హార్క్‌నెస్‌కి ఎంగెల్స్ రాసిన ఉత్తరాల్లోని అంశాల్ని 'కోట్'చేస్తూ సురేంద్రరాజు– "బాల్జాక్‌ని ఎంగెల్స్ మెచ్చుకోవడం, జోలాని విమర్శించడంబట్టి చూస్తే, రచయిత ఏ ఐడియాల జీని నమ్మకపోయినప్పటికి వాస్తవికతను సంక్లిష్టమైన జీవితవైరుధ్యాల్ని తనరచనల్లో సమర్థవంతంగా చిత్రిస్తేచాలునని, ఇలాంటివారి రచనలు రచనాపటిమలేని అభ్యుదయ విప్లవవాదం రచనలకన్నా గొప్పది" అని అభిప్రాయపడుతున్నాడు.

బాల్జాక్ ఏ ఐడియాలజీని నమ్మకపోయినందుకు కాదు ఎంగెల్స్ మెచ్చుకున్నది, తన రచనల్లో 'అదనపువిలువ' గురించి చెప్పినందుకు, బూర్జువా కృత్రిమ విలువల్ని సమర్థవంతంగా విమర్శించినందుకు. తన రచనల్లో సమయం సందర్భం లేకుండా పేజీలకు పేజీలు ఉపన్యాసాలుదంచి రచనా శిల్పాన్ని, వస్తువుని నిర్వీర్యం చేసినందుకు జోలాని ఎంగెల్స్ విమర్శించాడు. అంతేగాని ఆయన ఏ సిద్ధాంతపట్ల నిబద్ధ

ఉన్నందుకు కాదు. సిద్ధాంత నిబద్ధత గలిగిన రచయిత తన రచనల్లో స్పష్టంగా వుంటాడు, నిశితమైన సామాజికదృక్పథం కలిగివుంటాడు, తన లక్ష్యాన్ని ఎన్నడూ మరిచిపోడు. జీవితంలోని, సమాజంలోని వైరుధ్యాల్ని పరిష్కరించుకోవటానికి పాఠకునికి ఒక మార్గం చూపిస్తాడు. ఆ మార్గాన్ని అనుసరించటం, అనుసరించక పోవటం పాఠకుని యిష్టానికి వదిలేయబడుతుంది. సిద్ధాంత నిబద్ధతలేని రచయిత సంక్లిష్టమైన జీవితవైరుధ్యాల్ని చిత్రించటంలో అస్పష్టతకిలోనై, పాఠకున్ని గందర గోళపరుస్తాడు. ఈ జీవితవైరుధ్యాల్ని ఎట్లాపరిష్కరించాలో తనకే తెలియనప్పుడు ఆ రచయిత పాఠకునికి పరిష్కారంచూపలేడు. రచయిత, పాఠకుడు కూడ అస్పష్ట తలో, అయోమయ గందరగోళంలో పరిష్కారం దొరక్క కొట్టుమిట్టాడుతారు. ఏదో ఆనందానికి, కాలక్షేపానికి పుస్తకాల్నిచదివే పాఠకుల్ని వదిలేస్తే, జీవితం గురించి స్పష్టమైన అవగాహన ఏర్పరుచుకోవటానికి, పరిష్కారమార్గాలు తెలుసుకోవటానికి పుస్తకాల్ని చదివే పాఠకులకి ఏ ఐడియాలజీ లేని రచయితలు యిచ్చే సందేశమేమిటి? ఏమీ ఉండదు.

రచనల్లో సిద్ధాంతాన్ని అదేపనిగా వల్లించాలని ఏ విప్లవ సాహిత్యకారుడూ అన టంలేదు. సిద్ధాంతం వెలుగులో రచనలు సాగించడం, మార్క్సిజం – లెనినిజం-మావో ఆలోచనావిధానం వెలుగులో సమాజాన్ని విశ్లేషించటం విప్లవ రచయితల పద్ధతి.

కాల్పనిక కవులు వాస్తవాన్నుండి గతంలోకి ఊహల్లోకి పారిపోతే, విప్లవకవులు అదే వాస్తవం నుండి భవిష్యత్తులోకానికి పారిపోతున్నారని, సమస్యలకు తమకు తెలిసిన సమాధానాన్ని ప్రచారం చేస్తున్నారని, సిద్ధాంతం అనే కళ్ళజోడు లేకుండా లోకాన్ని చూడటానికి విప్లవ రచయితలు భయపడుతున్నారని– సురేంద్రరాజు విప్లవ రచయితలపై అర్థం పర్థంలేని అశాస్త్రీయమైన అభాండాలువేశారు. పుస్తకాలు చదవటం తప్ప ఆచరణ తెలియనివాళ్ళు, సిద్ధాంతమంటే భయపడి జ్వరం తెచ్చుకునే వాళ్ళు, తామే గొప్ప జ్ఞానపరులనుకునే కుర్చీమేధావులు మొదటి నుండి విప్లవ సాహిత్యంపై చల్లుతున్న బురదే యిది.

కాల్పనిక కవులు వర్తమానం నుండి గతంలోకి ఊహల్లోకి పారిపోయినా, విప్లవకవులు (సురేంద్రరాజు అపోహపడినట్లు) భవిష్యత్తులోకి పారిపోయినా దానికి పునాది వర్తమానమే. అయితే, కాల్పనిక సాహిత్యకారులు వర్తమాన సమాజాన్ని మార్చాలని ఆలోచించకుండా గతంలోకి పలాయనం చిత్తగిస్తారు. కానీ, వర్తమాన సమాజాన్ని మారిస్తేగాని తాము కలలుకంటున్న భవిష్యత్ సమాజం జనించదని విప్లవ

కవులకీ బాగా తెలుసు. వాస్తవాన్ని తమ రచనల ద్వారా నిర్భయంగా విమర్శిస్తూ, విశ్లేషిస్తున్నది విప్లవ రచయితలే. చెరసాలలకు, ఉరికొయ్యలకు, తుపాకి తూటాలకు విప్లవ రచయితలు బలిఅవుతున్నది ఎందుచేత సురేంద్రరాజుగారూ? వాస్తవాన్ని విమర్శించి, పాలకవర్గాల, పెట్టుబడిదారుల, భూస్వాముల దోపిడి దౌర్జన్యాలను తమ రచనల్లో ఎండగడ్తున్నందువల్ల కాదా? ఈ సత్యాన్ని యింతవరకు తెలుసుకోకపోతే యిప్పుడైనా తెలుసుకోవటం సురేంద్రరాజుకి సముచితం.

వాస్తవాన్ని స్వీకరించగలధైర్యం, ప్రాణత్యాగాలకైనా వెనుదీయని విప్లవ రచయితలకికాక మరెవ్వరికీవుందో సురేంద్రరాజే చెప్పాలి. విప్లవ సాహిత్యకారులు సిద్ధాంతంకళ్ళజోడు పెట్టుకోవటంలేదు. సిద్ధాంతంవెలుగులో తమదృష్టిని మరింత నిశితం చేసుకుంటున్నారు. సిద్ధాంతమంటే జడుసుకునే పిరికివాళ్ళు చీకటిలోకిపోతారు. విప్లవసాహిత్యానికీ, విప్లవకార్యాచరణకీ సిద్ధాంతం మార్గదర్శి. సిద్ధాంతమార్గదర్శకత్వంలేని విప్లవం చుక్కానిలేని నావవంటిది.

సర్రియలిస్టు రచనలకీ అస్తిత్వవాదరచనలకీ సురేంద్రరాజుకి భేదంతెలియదు. సర్రియలిస్టురచనలు వాస్తవానికి భూతద్దంపట్టిచూస్తాయి, మనకిచూపిస్తాయి. కాబట్టి సమస్యల వాస్తవస్వరూపాన్ని అవిచెప్పవు. అస్తిత్వవాదరచనలు సమస్యలకు వ్యక్తిపరమైన పరిష్కారాలు సూచిస్తాయి. అందుచేత మార్క్సిస్టువిమర్శకులు అధివాస్తవిక రచనల్ని, అస్తిత్వవాదరచనల్ని బూర్జువా క్షీణసాహిత్యంకింద లెక్కిస్తారు.

18వ శతాబ్దంలో మార్క్సిజం రూపుదిద్దుకోలేదు. అలాంటప్పుడు మార్క్సిజం మార్గదర్శకత్వంలో ఆనాడు విప్లవాలుజరగటం, మార్క్సిస్టు నిబద్ధతతో విప్లవరచనలు రావటమనేది ఆనాడు అసంబద్ధం. ఆ చారిత్రికదశలో ఆనాటి కృత్రిమవిలువల్ని నిరసించి, సర్వవిలువల విధ్వంసాన్నికోరిన డిడెరాట్ రచనలు గొప్పవిగా మార్క్స్‌కి గాని మరొకరికిగాని అనిపించవచ్చు. కానీ నేడుమనం 20వ శతాబ్దపు ఉత్తరార్థంలో వున్నాం విప్లవాలు విజయవంతమవుతున్న దశలోవున్నాము. శాస్త్రవిజ్ఞానం 18వ శతాబ్దంలోకంటే ఎక్కువప్రగతిని సాధించింది. మానవసమాజ విలువలు అప్పటిలానే యథాతథంగా యిప్పుడులేవు. మార్పులకుగురైనాయి. ఈనాడు సర్వవిలువల విధ్వంసక వాదం సర్వనాశనహేతువు. గతంలోని, వర్తమానంలోని మంచినిమనం వారసత్వంగా స్వీకరిస్తాం. చెడునినాశనంచేస్తాం. సర్వవిలువల విధ్వంసకవాదము మార్క్సిజానికే వ్యతిరేకం.

సాహిత్యానికి కేంద్రస్థానం హృదయమేనా ?

"ప్రాచీన కాలంలోనే కాదు ఏ కాలంలో అయినా కవిత్వానికి హృదయమే కేంద్రం." అన్న వాక్యంతో సోదుం రామ్మోహన్‌గారు రా.రా ని సమర్థించ పూనుకున్నారు. అనుభూతి అర్ణవంలో పడవేయని కవిత్వం కవిత్వం కాదన్నారు. అదే కవిత్వం యొక్క మౌలికగుణమని, అది లోపిస్తే కవిత్వమూ గాదు, కళాకాదు అని అన్నారు. అసలు కవిత్వం హృదయగతమైందని వారనుకొంటున్నప్పుడు హృదయము మెదడు రెండూ కూడా కేంద్రనాడీమండలం (Central nervous system) లో భాగాలే కాబట్టి కవిత్వం పుట్టుకక్కూడా హృదయమే కేంద్రస్థానం అన్నా అనొచ్చు వారు. కాని అసలు హృదయం కేంద్ర నాడీమండలంలో భాగమేనా ? కవిత్వానికి ఒక గుణాన్ని ఆపాదించటమనేది ఆయా సామాజిక దశలమీద ఆధారపడివుంటుంది. హృదయాన్ని ముందు కరిగించే మౌలికగుణం ఆలోచనల్ని రేకెత్తిస్తుందని చెప్పటంలో కూడా కవిత్వం పుట్టుకకు హృదయమే కేంద్రంగా భావించినట్టు అర్థమవుతుంది. వీరి భావనలో మెదడు వ్యాపారాన్ని శాస్త్రీయంగా విశ్లేషించినట్లయితే మెదడు మూడు భాగాలుగా విభజింపబడింది. పెద్దమెదడు (cerebrum), చిన్న మెదడు (cerebellum) మెడుల్లా (Medulla Oblongata) మెదడు, వెన్నుపాము కేంద్ర నాడీమండలంలోని ముఖ్యభాగాలు. శరీరంలోని ప్రేరణలన్నీ ఈ కేంద్ర నాడీమండలం ద్వారానే మెదడుకు కొనిపోబడతాయి. మనకు తెలిసిచేసే ప్రతిపని మెదడులోని నాడీకణముల ప్రేరేపణ వల్లనే జరుగుతున్నది. ఈ పెద్దమెదడులోనే మానవుని ఆలోచన, జ్ఞాపకం నొప్పి, స్పర్శ, గ్రహణం, చూపు, శ్రవణం మొదలగు జ్ఞాన కేంద్రాలున్నవి. మెదడు అనే కేంద్రంతో టెలిఫోన్ తీగలవలె పనిచేయుభాగాలే నాడులు ఇవి శరీరమంతటా వ్యాపించివుంటాయి. శరీర అవయవాల నుండి మెదడుకు వార్తలను తెచ్చేనాడులను బోధక నాడులు (Sensorynerves) అనీ, కేంద్రస్థానమగు మెదడు నుండి ఆజ్ఞలను శరీరభాగాలకు కొనిపోయేనాడులను ప్రవర్తక నాడులు (Motor nerves) అనీ అంటారు. మెదడు నుండి వ్యాపించే నాడులలో కొన్ని జ్ఞానేంద్రియాలతో కలుపబడి

మార్క్సిస్టులు వ్యక్తి అరాచకవాదాన్ని స్వీకరించనందుకు సురేంద్రరాజు బాధపడి "ఆధునికమానవుడి జీవితవైరుధ్యాల్ని చూడ్డం యిష్టంలేక ఆ వైరుధ్యాల్ని గురించి వచ్చిన ఆధునికసాహిత్యాన్ని నిరసించారు ; రకరకాలపేర్లుపెట్టి" అని మార్క్సిస్టు విమర్శకుల్ని నిందిస్తున్నాడు. మార్క్సిస్టులు జీవితంలోని వైరుధ్యాల్ని తప్పకచూస్తారు. అయితే ఆవైరుధ్యాల్నుండి పుట్టుకొచ్చే వ్యక్తివాదధోరణుల్ని మార్క్సిస్టులు నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తారు.

వుండుటచే వాటిని బోధక నాడులంటాము. నాడులు ప్రధానంగా వార్తాహరులు. కొన్ని నాడులు రక్తనాళాలను సంకోచింపచేసి రక్తప్రసరణను క్రమపరుస్తాయి.

కవిత్వం అనేది చెవితోను కన్నుతోను అనుభూతిచెందేది. నేత్రనాడుల ద్వారా కవిత్వం అనే వాస్తవాన్ని (Objective reality) కన్ను మెదడుకు చేరవేస్తుంది హృదయము, మెదడు రెండు అంతర్గత సంబంధాలున్న పదార్థాలే అయినా కవిత్వానికి మెదడు ప్రధానమవుతుందిగాని, హృదయం కేంద్రం కాదు. జ్ఞానేంద్రియాలవల్ల కలిగిన ప్రేరణ మెదడులో ఆలోచనా రూపంలో సంపూర్ణత్వాన్నిపొంది ప్రతిచర్య (Reaction) జరుగుతుందేగాని మెదడుకు ఆప్రతిచర్య తీవ్రతకు అనుగుణంగా లోబడి కావలసిన రక్తాన్ని సరఫరాచేసే హృదయంలో మాత్రం కాదు. 'హృదయమే కేంద్రం అనడంలో గుండె నిర్వహిస్తున్న శారీరకవిధులు (Physiological functions) శాస్త్రీయంగా విశ్లేషించటానికి బదులు హృదయము, హృదయ సంస్కారము, హృదయ స్పందన అనే అశాస్త్రీయ పదఅవగాహనతో ప్రాచీనరసవాద సిద్ధాంతాల్ని మేళవించి చెప్పటంలో విమర్శలో శాస్త్రీయత లోపించింది.

పశువుకూ హృదయముంటుంది. మనిషికీ హృదయముంటుంది. కాని మనిషికి సంస్కారముందిఅంటాం. యిక్కడ సంస్కారమంటే మేధోపరిపక్వత అనేఅర్థం. మేధోపరిపక్వతే మనిషిని పశువునుండి వేరుచేసేది. సంస్కారముఅనేది శాస్త్రీయంగా చెప్పాలంటే జ్ఞానేంద్రియాలద్వారా ఒక వాస్తవికత (objective reality)ని మెదడుకు అందజేసినప్పుడు దానికి సంబంధించిన నాడీమండలం (nervous system) ఎలా ప్రతిక్రియచూపుతుంది అనేదానినే ప్రవర్తనామార్పులు(behavioural changes)అని చెప్పుతుంటాం. సంస్కారమనేది వివిధపరిస్థితుల్లో వేరువేరుగావుండొచ్చు. మౌలికంగా వున్న కొన్నిలక్షణాల్లో మార్పురావడం అనిమాత్రమే గ్రహించాలి. అంతేగాని 'హృదయసంస్కారము' అనంటే యిక్కడ నైతికవిలువల (ethical values) తో కూడిన కొలబద్ధమాత్రంకాదు. సోదుం రామ్మోహన్‌గారు వాడిన 'హృదయసంస్కారం' అనేపదం ఇలాంటి నైతికప్రమాణాల (ethical standards) ని దృష్టిలో వుంచుకొని బూర్జువా భావజాల పదజాలం మోజులోవాడినట్టిదేగానిమరొకటికాదు. "సాహిత్యం మేధోపరిపాకాన్నే పెంచేదయితే అది Social science అవుతుందిగాని సాహిత్యం కాదన్నారు. సాహిత్యానికి శుద్ధకళావిలువలు, రసవాద సిద్ధాంతాలు, హృదయ సంస్కారాలు ఆపాదించితేనే అది సాహిత్యమవుతుందని, సామాజిక ప్రయోజకత్వం ఆపాదించితే అది సామాజికశాస్త్రం అవుతుందని వారి భావన. సాహిత్యానికి సామాజిక

ప్రయోజనత్వం ఆపాదించినపుడు ప్రయోజనత్వాన్ని గూర్చి గతితార్కికంగాచేసే ఆలోచనాక్రమం మెదడు వ్యాపారమవుతుంది. అక్కడ వ్యక్తి తార్కికమైనటువంటి ఆలోచనా సంఘర్షణలకులోనై ఒక కార్యాచరణకు ఉపక్రమిస్తాడు. హేతుబద్ధం (rational)గా హృదయ సంస్కారాన్ని పెంచే సాహిత్యంలో తార్కికమైన ఆలోచనా సంఘర్షణ వుండక ఉద్రేకాల ఉరవడి (emotional sweeping) మాత్రమే వుంటుంది. సాహిత్యానికి ప్రయోజనత్వం ఆపాదించినపుడు అది మెదడు వ్యాపారమైన ఆలోచనాక్రమం అయినప్పుడు, అట్టి సాహిత్యాన్ని సామాజికశాస్త్రం అని అనడంలో సోదుం రామ్మోహన్‌గారికి అడ్డువచ్చిన శుద్ధకళానియమాలు ఏమిటో తెలిపితే బాగుండు. ఆలోచనతో కూడిన ప్రతికార్యాచరణ కూడా శాస్త్రీయంగానే వుండి ప్రయోజనత్వాన్ని కేంద్రంగా చేసుకొంటుందిగాని ఉద్రేకాల (emotionality)ని కేంద్రంగా చేసుకోదు.

"హృదయ సంస్కారంలో మార్పువచ్చిన వ్యక్తి విప్లవ కార్యాచరణకు కూడా సంసిద్ధపడతాడు." అని అనటంలో హృదయ సంస్కారంలో మార్పు అనే పదానికి 'behavioural changes' సమానార్థంగానేకన్పిస్తుంది. behavioural changesకు ప్రధాన ప్రేరణకేంద్రము మెదడు అవుతుందికాని మెదడు ఆజ్ఞలకు లోబడి పని చేస్తున్న హృదయం మాత్రం కేంద్రం కాదు. వారు ఊహించిన హృదయ సంస్కారంతో కూడిన emotionality ఏ విప్లవ కార్యాచరణకు ప్రేరణ అవుతుంది? ఒక వేళ అయితే ఆ విప్లవం ఎంతకాలం నిలుస్తుంది? అనే విషయాలు హృదయసంస్కార, అనుభూతి అర్ణవంలోపడ్డ సోదుం రామ్మోహన్‌గారే తేల్చాల్సివుంటుంది.

ఎల్లెందు — చేకూరి శ్రీనివాసరావు
29-4-81

xxii + 108 పేజీల కవితాసంకలనం వెల 6 రూపాయలు ఎక్కువో తక్కువో తెలీదుగాని, శీలా వి. ముఖచిత్రమూ, నాలుగుపేజీలనిడివి కుందుర్తి అభిప్రాయమూ, రెండుపేజీల పి.యస్.ఆర్. ఆంజనేయశాస్త్రి 'ఉపద', చద్దికంటె పూరగాయే ఘన మనిపిస్తున్నాయి. ఆరుద్ర 'కృతజ్ఞత' మరోఆకర్షణ. పన్యాలవారి జ్ఞాపకాలు ఇంకొకటి.

"ఆరోజుల్లో పలుకున్నకవి"గా 'పసుమర్తి'ని కుందుర్తి ప్రశంసించారు. ఆ రోజులంటే అభ్యుదయ కవిత్వంరోజులు. 1918లో శ్రీకాకుళంజిల్లాలో "వంశధారామ తల్లి ఒడిలో" పుట్టిపెరిగినకవి, ఇంత కఠినమైనశబ్దాన్ని తన కవితాసంకలనానికి పేరుగా ఎందుకు స్వీకరించినట్టో తెలీదు. జగన్నాథ పండితరాయల్నీ క్రిస్టోఫర్ కాడ్వెల్‌నీ చెరో చేతబట్టి, ఆరుద్రలాంటికవుల్ని అభ్యుదయ భావరీతులవైపు మళ్ళించిన 'పసుమర్తి' 1940 దరిమిలారాసి ఎన్నోపత్రికలలో ప్రకటించిన యీ 24 గేయాలలో చివరిది ఈ ఉద్గీథ. దీనిఅర్థం ప్రణతం (ఓంకారం)అనీ, సృష్టి స్థితిలయాలగురించి జిజ్ఞాస సాంప్రదాయకంగనక 'పసుమర్తి'ని అదిపట్టుకుని 'సంప్రదాయాన్ని' విడనాడకుండానే సామ్యవాదపై ఖరిని ప్రదర్శించాలని ఆరుద్ర రాశారు. సంప్రదాయజ్ఞతకీ సాంప్ర దాయికతకీ తేడావుంది. మొదటిదేమో పరిజ్ఞానానికిచెందింది. రెండోది భావధోరణికి చెందింది. 'పసుమర్తి'లో ఈరెండవది అసలులేకుండా పోలేదు. 'అభ్యుదయ'కవిత్వం గమ్మత్తైఅది. ఒక మాజీమిత్రుడన్నట్టు అది అందరి విడిదిలాంటి సత్రంగామారింది. 'పార్టీగతం'కాని అభ్యుదయాన్ని స్వీకరించారని 'పసుమర్తి' గురించి ఆంజనేయశాస్త్రి అంటున్నారు. 'జనరల్' అభ్యుదయం ఆకుకూచెందదు, పోకకూ పొందదన్నట్టు అదీ యిదీ- ఏదీ- కానిస్థితిని కల్పిస్తుంది. పార్టీలేమో పనికిరావు. అభ్యుదయంమాత్రం రావాలి- ఇదిఎలాసంభవం ? పార్టీమనిషి దోషి పార్టీ- అతీతుడు ఋషీనా ? "ఆరోజుల్లో" 'అభ్యుదయం' సువిశాలం- అందుకేదానికి నిర్దిష్టతా స్పష్టతా లేకపోయింది. తెన్నూ చూపూకూడా ఒకతీరుకిచెందినవికాలేదు. ఈ అతివిశాలత్వమే 'అభ్యుదయ' ధోరణికి అందరూ సుగుణమనుకునేలోపం. ఇక రచనావస్తువులో పేదరికం, ప్రజలబాధలు, జాతీయ, అంతర్జాతీయ మహాఘటనలు. "ఆదికాలంనాటి ధర్మప్రబోధదృక్పథం" అభ్యుదయకవిత్వంలో వచ్చిందంటున్నారు కుందుర్తి. ధర్మం అన్నియుగాలకూ ఒకటే కాదు. సార్వకాలీనత, సార్వజనీనత- యివి గాలిబుడగలుగాని, అందమైనవి, వస్తు పరమైన కవితలు 'మినీ' సైజులోనూ రావచ్చునని కుందుర్తి మనస్తున్నారు. కవిత్వ స్వభావాన్ని నిర్ణయించేది సైజా ? అయితే, మహాభారతాన్ని మించినకావ్యం వేరే వుండబోదు. అనవసరంగా 'సైజు' గురించి వివాదంలేవదీసి కొండవీటిచేంతాళ్లలాంటి

రచనలే వస్తుపరమైనవి కాగలవని కుందుర్తి, తమకు తెలిసినంతలోనే వెలువడిన సుదీర్ఘకవితల ఆత్మాశ్రియతవిషయం మరుస్తున్నారు.

'ఛవిఛటా' (sic) ప్రచురణఅయిన 'ఉద్గీథ'కు రెండోప్రపంచ సంగ్రామకాలమే నేపధ్యం. ఫాసిజాన్ని చావుదెబ్బతీసిన సోవియట్ రెడార్మీ విజయాన్ని ప్రపంచ కార్మికవిజయంగా భావించిన ఈ కవిని మెచ్చుకోవాలి. అయితే ఇప్పుడు ఆ సోవియట్ రెడార్మీ తన సంప్రదాయాలకు తానేగోడకట్టి దురాక్రమణశక్తిగామారి, దుర్బలదేశాలలో దూరి, ప్రపంచాధిపత్యవైఖరిని ప్రదర్శిస్తూంది. అలాగే, ఆతర్వాతికాలాన 1950లో కొరియాలోనూ ఇంకా తర్వాత కాంగోలోనూ విజృంభించిన ప్రజాయుద్ధాన్ని 'పసుపర్తి'కలం గేయాలుగా వర్ణించినా, అవి ఒకపెద్ద చదరంగంలో శగటులే గనక వెనకటంతటి ఉత్సాహాన్నీ వూపునీ కలిగించలేకపోయాయి. 1979 హద్దుగావున్న ఈ సంకలనం, మూడుదశాద్దాలకుచెందిన మహాఘటనలలో కొన్నిటిని ఎందుకువిడిచిందో తెలీదు. జనచైనా అవతరణ నటుంచి, తెలంగాణా సాయుధరైతాంగ పోరాటమూ కవికంటికెందుకెక్కలేదోమరి ?

ఈకవి కారుణ్యవాది, ఖడ్గవాదికాదు. గాంధీజీ, లియోటాల్‌స్టాయ్, మార్క్సు, ఎంగెల్సు, కన్ఫ్యూషియస్, క్రీస్తూ, గీతాకారుడు– ఇందరిని ఒకేగాటకట్టివేసే విఫల యత్నంలో 'ఆర్తి' గేయంరచించారు. మానవజాతిపరిణామ, వర్గద్వైకృథంగురించి కవి అవగాహన సవ్యంగానేవుంది. మొత్తానికి, ప్రగతిశీలభావాలను సమర్థించారు– కాకుంటే, స్వీయాత్మకతధోరణి వదలక భావాలగజిబిజి, భావప్రకటనలో తికమక, "నేను బానిసను" అనేగేయం రాయించింది. మనుషులంతా డబ్బుకిబానిసలైన ఈ వ్యవస్థలో మానవత్వానికి విలువే లేకుండాపోయిందని అందరినీ చీదరించుకుని లాభం లేదు. అలా 'వేతనబానిసల'ను– "డబ్బుగలుగువాని" తొత్తుకొడుకులని వేమనలా వదిలెయ్యగలమా ? ఆ బానిసత్వాన్ని అంతమొందించేందుకు జరిగే మహామానవ ప్రయత్నానికి కవి తనరచనలతోనైనా సాయపడినప్పుడు స్వాతంత్ర్యేచ్ఛను కవి తనకొక్కడికే ఆపాదించుకోవడం జరగదు. స్వాతంత్రం మంచిది. దేన్నుంచి యీ స్వాతంత్ర్యం ? వైయక్తికమైన తనపరిమితులనుంచీ సంకోచాలనుంచీ దురభిప్రాయాలనుంచీ స్వాతంత్ర్యమా ? అది 'జీవన్ముక్తి' వైపు నడుపుతుంది. కుటుంబ బంధాలనుకాదనే స్వాతంత్ర్యం అరణ్యవాసానికీ వానప్రస్థానికీ తీసుకెడుతుంది. ఈ స్వాతంత్ర్యం సమాజపరంకానప్పుడు దీనివల్ల అంతగాలాభంలేదు. సాదాకవిని నిలేసి అన్యాయాలూ అక్రమాలూవుండీ కనిపించడంలేదా, 'కరుణ'తో సరిపెట్టుకోక "గుండె

పేదోళ్ళపోచమ్మ బతుకమ్మపాట

జానపద కళారూపాలతోపాటు తెలుగు పాటకు కొత్తరాగాలునేర్పి ప్రజల గాథలను పాటలల్లి పల్లె, పట్నం, వీధి, వాడపేటల్లో మనసు గొంతువిప్పి ప్రజలకోసం కలందూసి గళం ఎత్తింది జననాట్యమండలి. దానిలో భాగంగానే ఈ "పేదోళ్ళ పోచమ్మ" బతుకమ్మ పాటను ప్రచురించింది.

జానపద కళారూపాల్లో "ఉయ్యాలో" ఆంధ్రదేశమంతటా సుపరిచితమైన బాణి ఆ బాణిలో రాయబడ్డదే ఈ "పేదోళ్ళ పోచమ్మ" పాట. "ఉయ్యాలో" పాటకున్న ప్రత్యేకత నేను విన్నంత వరకు కథల రూపంలోనే పాడుతారు. ఇక్కడ కూడ కథ లాంటి జీవితాన్ని చూస్తాము. 'ఊరన్నకాడ మాదిగిండ్లన్నట్టు', దొర వారు, కూలి జనం ప్రతి ఊరిలో ఉంటారు.... అ దొర "అప్పులిచ్చి ముప్పు తెస్తాడు" ఆ తర్వాత ఆజనాన్ని ఒక చట్రంలో బిగించి వాళ్ళకు తెలియని ఉచ్చులుబిగిస్తాడు. రాత్రి పగలు కొట్టిపోసుకున్నా ఆ బతుకు మారదు. మారదని "ఈ పాడు బతుకింక / నేసీద్వ లేనయ్య / గడియ పుర్సత్ లేక / గాలిగాలిగ ఉంది / ఇగ ఈడ బతుకొద్దు / ఇందూరు పోదాము /" అంటది పోశమ్మ. ముత్తయ్య పోశమ్మ భర్త - ఆమె మాట లినినవ్వి "ఓసిపిచ్చిముండ / ఒట్టిగా మననిట్ల / దొర పోనిస్తడా / " అంటాడు. ముత్తయ్యకు పోదామనేఉన్నా బయటికి కన్పించని సంకెళ్ళ వాళ్ళ కాళ్ళకు ఉండనే ఉన్నాయి. కాక ఇందూరులోనైనా సెందూరులోనైనా గిసొంటి దొరే ఉంటదని వాళ్ళకేం తెల్సు? దొర చూయించిన పాడు బావి ముత్తయ్య పానాలుతీసింది. గుండె గుద్దుకున్నా నెత్తికొట్టుకున్నా ఏంలాభం, రెక్కలుతెగిన పక్షిలా, "పాపిష్టి బతుకింక / బతికేది ఎట్లయ్య / పిల్లజెల్లా నెట్ల / ఈదుకొనిరావాలి / నీజీవికెట్ల / నిమ్మళం అయ్యింది" / అని పోశమ్మ ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లింది ఇది కళ్ళకుకట్టినట్లున్న హృదయవిదారక దృశ్యమే

మంట"లో ఎదనుసికావడంలేదా అనిఅడగడం, కొంతవరకు తన ధోరణిని తానే విమర్శించుకున్నట్టుగావుంది.

"చీలికపీలికల సిద్ధాంత రాద్ధాంతావేశాల పరిధులకు"గాక, అభ్యుదయానికే 'కమిట్' అయిన కవిఅని ఆంజనేయశాస్త్రి రాసినమాట, నిజానికి 'పసుమర్తి'కి ఘనత నాపాదించేదికాదు. రసస్ఫురణలూ, పలుకుబడులూ వగైరా సరేగాని, కఠినమైన పదజాలానికి కవి బాగా లోబడినట్టు, భావప్రకటనలో తేటదనంతక్కువై పులుము దెక్కువైనట్టు కనిపిస్తుంది. ప్రారంభదశలోని కవిత్వమేననిపిస్తుంది.

— రమ

"అమ్మ ఆకలంటే / చెయ్యినరికిత్తునా / కాలుగోరికిత్తునా" ఇది ఆ మెక్షణక్షణం పడే వేదన ఈ విషయాలనుండి తప్పించుకోవడానికి కన్నబిడ్డలతో సహా తానుచావా లనుకుంటే, విషాన్ని తయారుచేస్తుండగా అచ్చయ్య "సీతో టిఈబాధ / నిల్చిపోదేతల్లి బతుకుమారనీకి / బాటసూడాలమ్మ / ఆశసంపుకోకు అన్నలంఉన్నామమ్మ / " అని ధైర్యంచెపుతాడు. రైతుకూలీలు రాజ్యమేలాలని బోధిస్తాడు. మాండలికంలో రాయ బడ్డ ఈ పాటను మలచడంలో చాలవరకు సఫలమైంది జననాట్యమండలి. సమూహంగా పాడుకునే ఈపాటలో అన్నిరసాలు పోషింపబడతాయి అభినయంలేకున్నా వినేవారికి కళ్ళకుకట్టినట్లుంటుంది. ఇది ఉయ్యాలపాటలోని ప్రత్యేకత. ఇదివరకు వరదలమీద, ఉప్పెనమీద, రైలుప్రమాదం మీదకూడ ఈబాణీలో రాయబడినా ప్రత్యేకించి వాటిని ప్రచారంలో ఎవరూపెట్టలేదు. కాలక్రమేణా అవిమరుగునపడిపోయాయి.

జననాట్యమండలికృషితో ఈపాట నిస్సందేహంగా జనాల్లోకిపోతుంది. కాని దీన్ని పాడడానికి ఎక్కువసమయం పడుతుంది. ఇది ఈపాటకున్న అననుకూలత. ప్రజల్లో పనిచేస్తున్న కళాకారులు ఇదితప్పకుండా గుర్తిస్తారు. అనుభవంద్వారా నేర్చుకుంటారు, నేర్చుకొని రోజురోజుకు ఎదుగుతూ ఇంకాఇలాంటి మరికొన్ని పుస్తకాలు ప్రచురిస్తారని ఆశిద్దాం.

— ఎ. వి.

పేదోళ్ళపోచమ్మ – బతుకమ్మపాట
ప్రచురణ : జననాట్యమండలి, ఆంధ్రప్రదేశ్ [అక్టోబర్ 1980]
పేజీలు: 20 వెల: 30 పైసలు ప్రతులకు : సృజన, హనుమకొండ, 506 001.

అనిర్దిష్టఅవగాహన - 'అవగాహన'

'ప్రగతిశీల సాహిత్యోద్యమం ప్రధానలక్ష్యంగా తెలుగులోని ఉత్తమరచనల్ని ఉత్తర ప్రాంతీయభాషలవారికి పరిచయంచెయ్యటం, తెలుగులోని ఆంగ్ల రచయిత లకుకూడా ఒకవేదిక నిర్మించడం, రచయితలమధ్య పరస్పరఅవగాహన పెంపొందించటం' మొదలైన ఆశయాలతో బయల్దేరిన బుక్స్ & బుక్స్‌వాళ్ళ ప్రథమప్రయత్నమే 'అవగాహన' 1,2,3 ఆలోచనావీచికలు. అయితే ఈ మూడుసంచికల్నీపరిశీలిస్తే తమ ప్రధానఆశయాల్ని వాళ్ళు మొదటిసంచికతోనే వదిలేశారనిపిస్తుంది. ఒక్క మొదటిసంచికలోమాత్రం రోణంకి అప్పలస్వామిగారి ఇంగ్లీషుకవిత ప్రచురించారు.

మూడుసంచికల్లో కలిపి చాలాకవితలున్నా పాఠకుల్ని కదిలించేది ఒక్కటీలేదు. ఇదేకథలకూ వర్తిస్తుంది.

క్రియాశీల రాజకీయదృక్పథం లేకపోవటం, ఆచరణనుంచి విడిగా సాహిత్యాన్ని సమీక్షించబూనటం 'అవగాహన' వ్యాసాల్లోని ప్రధానలోపం ఆ కారణం వల్లే మనం ఏవ్యాసంచదివినా గాఢమైన విషయచర్చ ఉన్నట్టుఅనిపించదు. (కుటుంబరావుగారి వ్యాసాలు మినహాయింపు.)

మొదటిసంచికలో శ్రీరోణంకి 'కవిత్వ నిజస్వభావం' అనేవ్యాసంరాస్తూ కళ ప్రయోజనాత్మకమని అంగీకరిస్తూనే అర్థస్ఫోరక పదగుంఫన, రసోత్పత్తిని రగుల్కొల్పే భావనాపటిమా కవితకు ఇంధనాలని సూత్రీకరించారు. మాంత్రిక, తార్కిక కాల సంయోగంవల్ల కవిత ప్రజ్వలిస్తుందని, పాశ్చాత్య పుస్తకవిజ్ఞానంవల్లకాదోలు, అభిప్రాయపడ్డారు ప్రజల్నుంచీ, ప్రజల జీవితాల్నుంచీ, ప్రజాపోరాటాల్నుంచీ దూరమైన సాహిత్యంలో ఇంధనమూ ఉండదు. ప్రజ్వలనమూ ఉండదు.

రెండవసంచికలో నారాయణబాబు పైవ్యాసం 'ఇన్ఫర్మేటివ్'గాఉన్నా కవిత్వ చర్చ, విషయవిశ్లేషణా ఎక్కువగా కనబడవు. నారాయణబాబు కవిత్వాన్ని కొంత వ్యాసంలో స్పృశించినా అది ఇంతకుముందెవరైనా చెప్పిందోలేక 'ఎంతబాగున్నదో చూడుడు' పక్కీలోనో ఉంది. కవినిగురించిన సమాచారం ఇవ్వటమొక్కటేకాకుండా కవినీ, ఆయన కవిత్వాన్నీ సామాజికంగా విశ్లేషించి చూపించిఉంటే బాగుండేది.

మూడవసంచికలో 'శ్రీశ్రీ మహాకవిత్వం' పేరుతో శ్రీశ్రీ వ్యక్తిత్వచర్చా, విరసం రాజీనామాకుసంబంధించినవిషయాలూ ప్రచురించటంలోని ఔచిత్యమేమిటో అర్థంకాదు.

మొత్తంమీద 'అవగాహన'కి పొడవూ వెడల్పూఎక్కువేగానీ లోతుతక్కువ. ఈవిషయాన్ని గుర్తుంచుకుని ముందుసంచికలు వెలువరిస్తే బాగుంటుంది. —ఆర్.ఎన్.జీ.

అవగాహన : మూడుసంచికలు :
ప్రతులకు : మానేపల్లి సత్యనారాయణ, బుక్స్ & బుక్స్. విజయనగరం.

పుస్తకస్వీకారం

1. ఇదికదనం కదలండి - హీరాలాల్ మోరియా ఉర్దూకవిత - తెలుగుఅనువాదం
కవిరాజమూర్తి, ఖమ్మంజిల్లా రచయితలసంఘం ప్రచురణ - జనవరి 1980
38 + xii పేజీలు, వెల : ఆరురూపాయలు.
ప్రతులకు : ఖమ్మం జిల్లారచయితలసంఘం, మోహన్‌రోడ్, ఖమ్మం

2. కవితాకాహళి - సర్ సి.ఆర్. రెడ్డి కళాశాల విద్యార్థుల కవితాసంకలనం-
సంకలనకర్త - బండ్లమూడి సత్యనారాయణ
ప్రచురణ: ఇందుమతి ప్రచురణలు, మార్చి 1981, 74 + xx పేజీలు వెల: రు. 6-00
ప్రతులకు : ఇందుమతి ప్రచురణలు, నరసింహారావుపేట, ఏలూరు 534 006

ఇంద్రవెల్లి: మరికొన్ని వివరాలు

ఇంద్రవెల్లి దారుణమారణహోమం తర్వాత పత్రికారచయిత ఎం. రఘురాం వారంరోజులపాటు ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించి ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, జూన్ 13, 1981 సంచికలో ఇంద్రవెల్లి హత్యాకాండపై ఒక నివేదిక రాశారు. గతంలో మనదృష్టికిరాని- అంటే ఇంకా బహిరంగంకాని వాస్తవాలూ, వివరాలూకొన్ని ఆ నివేదికలో ఉన్నాయి.

....గోండులు బల్లాలు, కొడవళ్ళు, కర్రలు, రాళ్ళుపట్టుకొని 'సాయుధంగా వున్నార'ని ముఖ్యమంత్రి అంటున్నాడు. కారప్పొడికూడా వెంటతెచ్చుకున్నారని ఆదిలాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అంటున్నాడు. కొన్నిరౌండ్లు బాష్పవాయువు ప్రయోగించినతర్వాత అదివిఫలమై ప్రజాసమూహం ఐదుగురు అధికారులు, ముప్పై మంది పోలీసులూవున్న బృందంపై దాడిచేసిందని ఒకపోలీసును బల్లెంతో పొడిచి చంపేసి, అధికారులను గాయపరిచారని ఎస్. పి. అంటున్నాడు. ఐతే అధికారులు గాయాలకు చికిత్సచేయించుకున్నట్టు ఎక్కడా సమాచారంలేదు.

.... గోండులను తీవ్రవాదులు రెచ్చగొట్టారనే వాదనను బలపరచుకోవడానికి అధికారులు 'తీవ్రవాదుల' అధికారపత్రిక 'క్రాంతి'నీ, కరపత్రాలనూ చూపారు.... నిజానికి కరపత్రాల్లో గోండులు కాని వాళ్ళు, అటవీశాఖాగుంజుకున్న భూములను తిరిగి ఇవ్వాలనే డిమాండ్ ఉంది, అడవిలో చెట్లు కొట్టడానికీ, వ్యవసాయానికీ హక్కు ఉండాలనే డిమాండ్ ఉంది, ప్రకటించిన గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల భూములను గిరిజనేతరులకు అమ్మడాన్ని నిషేధించే 1964 చట్టాన్ని సరిగా అమలుపరచాలనే డిమాండ్ ఉంది, కరపత్రాల్లోనూ పత్రికల్లోనూ గిరిజనేతర దోపిడీ వర్గాలగురించి ఘాటైన విమర్శఉంది, దోపిడీదార్లతో మిలాఖతవుతున్న సిపిఐ, సిపిఐ(ఎం) వ్యతిరేక వ్యాఖ్యలున్నాయి- కాని గిరిజనేతరులకు వ్యతిరేకంగా హింసను రెచ్చగొట్టడమేమీలేదు....

.... గోండులను గ్రామంలో ప్రవేశించకుండా నిరోధించేటప్పుడూ, కాల్పులు జరిపేటప్పుడూ ఒక లైసెన్సు పొందిన నాటువైద్యుని నాయకత్వంలో కొందరు గిరిజనేతర వ్యాపారస్తులనూ, చిన్నకులాల హిందువులనూ, ఇంద్రవెల్లిలో గోండులు గృహదహనాలూ లూటీలూ చేస్తున్నారని' సంఘర్షణను రెచ్చగొట్టడానికై అదిలాబాద్ పోవడానికి అనుమతించారు.

.... కాల్పులకు దారితీసిన వాస్తవ సన్నివేశాలు ఇంకా దిగ్భ్రమగొలిపేవిగా వున్నాయి. ఎక్స్-అఫీషియో ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అయిన రెవెన్యూడివిజనల్ అధికారి (ఆర్‌డిఓ) కాల్పులకు అనుమతి ఇవ్వాల్సి ఉండగా ఎస్‌పి తాను స్వయంగా కాల్పు

లకు ఉత్తరువుఇచ్చి ఆ తరువాత ఆర్‌డిఓ అనుమతికోసం ప్రయత్నించాడు. ఆ ప్రయత్నాలన్నీ విఫలం కాగా ఆర్‌డిఓ వైపు పిస్టల్ గురిపెట్టి కాల్పుల ఉత్తరువుమీద సంతకం చేయించుకున్నాడు.....

....ఎన్నో శవాలను పోలీసులు తామే దహనంచేసి కొందరు గాయపడ్డ వాళ్ళను వ్యాన్లలో కుక్కుకొని ఆస్పత్రికి తీసుకువెళ్ళారు. ఆవ్యాన్లలోంచి ఆస్పత్రి సిబ్బంది పదిశవాలను బయటికితీశారు. మరి ముగ్గురు ఆ తర్వాత మరణించారు. సరియైన సమాచారం రాసుకోకుండా నిరోధించిన పోలీసు జులుం గురించి కొందరు ఆస్పత్రి సిబ్బంది ఆరోపించారు. పదముగ్గురే చనిపోయారని చెప్పబడుతున్నప్పటికీ అంత కంటె రెట్టింపుమంది ఆస్పత్రిలోనే చనిపోయారు. అయితే ఆస్పత్రిలో వివరాలేమీలేవు.

....ప్రత్యక్షసాక్షులు, కాంగ్రెస్‌వర్గాల కథనంప్రకారం ఉట్నూరుపట్టణం లోనే 30-40 మృతదేహాలు రోడ్డుపక్కనపడిఉన్నాయి. వీటిలోకొన్నిటిని పారిపోతున్న గోండులుపట్టుకుపోయారు. మిగిలినవాటిని పోలీసులు స్వాధీనంచేసుకున్నారు.

....ఇచ్చోడలో 25 మంది, ముత్తునూరులో 30 మంది బాధితులను కలుపుకుంటే మొత్తంబాధితులసంఖ్య 250 అవుతున్నది.

....తానుస్వయంగా గోండుఅయివుండి గోండులఅభివృద్ధికోసం ప్రయత్నించిన అసిస్టెంట్ ప్రాజెక్ట్‌అధికారిఅయిన ఒకసీనియర్ అధికారిదగ్గర 37 మంది బాధితుల ఫోటోలుఉన్నాయి. పదమూడు మరణాలగురించిమాత్రమే ప్రచారంచేస్తున్న ప్రభుత్వ ప్రచార నిజస్వరూపాన్ని ఇదిస్పష్టంగా తెలుపుతున్నది.

....ఏప్రిల్ 20 సభకుచేరుకున్న పది పదిహేనువేలమంది ఆదిలాబాద్‌వైపుతప్ప తక్కిన అన్నివైపులకూ పరుగెత్తారు వీళ్ళజాడ ఇప్పటికీ తెలియరావడంలేదు. ఇక మహారాష్ట్రలోని యవత్‌మల్, చంద్రపూర్ జిల్లాలనుంచివచ్చిన గోండులపరిస్థితి మరీఘోరం. ఇక్కడఉండేస్థలంలేదు, వెనక్కి తిరిగిపోనూలేరు.

....అడవిలో ఏభూమినుంచైతే వెళ్ళగొట్టబడ్డారో ఆభూమినే సాగుచేయమని గోండులకు పౌరకలెక్టర సలహాఇచ్చాడు. అంతకుముందు సాగులోఉన్నప్పటికీ 1964 చట్టం అమలుఅనే మిషతో ప్రభుత్వంగుంజుకున్న సాగుభూములనుమాత్రమే సంపా దించుకోవడానికీ, సాగుచేయడానికీ ప్రయత్నించమని సలహాఇవ్వబడింది. కొత్తగా చెట్లనునరకమని చెప్పబడలేదు. ప్రభుత్వప్రచారంలో 'తీవ్రవాదుల'మీద ఈ ఆరో పణే ప్రధానంగా ఉంటున్నది. పోగొట్టుకున్నభూమిని తిరిగిపొందే ప్రయత్నంలో అడ్డువచ్చే అధికారులతోకూడా పోరాడవలసివుంటుందని గోండులకు చెప్పబడింది.

ఇంద్రవెల్లిపై ఇద్దరి కవితలు :

నిశ్శబ్దగీతం

విమల

శవాన్ని తగలేసాక
చెట్టూ మిగిలిన
నిశ్శబ్దం
నిశ్శబ్దం భయంకరంగా వుంది
ప్రతిచెట్టూ, గుట్టా, గుడిసెమీద
ఆఖరికి మనుష్యుల మీద కూడా
నిశ్శబ్దం కప్పబడింది
అది చూస్తే నీకు
ప్రశాంతంగా కనపడే
సముద్రం గుర్తొచ్చి
ఒళ్ళు జలదరిస్తుంది
నీ గుండె చప్పుడు
నీకే వినపడేటంత
నిశ్శబ్దాన్ని
భయపెట్టే నిశ్శబ్దాన్ని
భరించలేక
నువ్వు ప్రశ్నిస్తావ్
మళ్ళీ నిశ్శబ్దమే జవాబు
కానీ....
తూటాదెబ్బ దూసుకుపోయిన
తలుపు చెక్కా
బెరడు రాలిపడ్డ చెట్టూ
రోడ్డు మీద ఇంకా తడి
ఆరని రక్తం మరకా....
ఇవి ఏవీ నీకు ఇంకా
అర్థంకాకున్నా
తలమీద ఎర్రచారల
రాకాసి చప్పుడికి
నిశ్శబ్దంగా మూతపడ్డ
మనిషి పెదవుల ధ్వని
విచ్చుకున్న కళ్ళల్లో
ఎర్ర జీరా-
నీకు తప్పక జవాబు
చెప్పే వుంటాయి
గుండెల్ని చీల్చు కొచ్చి
కళ్ళలో సుళ్ళు తిరిగే

...గోండులతో భూసంబంధమైన వివాదాలను పరిశీలించే అధికారవర్గాలు చెప్పినప్రకారం గోండులభూమిలో మూడోవంతుకన్న ఎక్కువభూమి గోండులుకాని వాళ్ళ చేతుల్లోఉన్నది. భూపరిమితిచట్టం ఉండగాకూడా 2000 నుంచి 6000 ఎకరాల భూకమతాలుకూడా ఆదిలాబాద్‌లో ఇంకాకొనసాగుతున్నాయి.

కలెక్టర్ కార్యాలయంలోని ఒకరహస్యఫైల్లో ఈకిందివాస్తవాలు ఉన్నాయి.

...."సర్వేలోపాలగురించి పూర్తిగా తెలిసిఉన్నప్పటికీ పట్వారీలు గోండులకు ఆ విషయాలెన్నడూ వివరించలేదు. చాలామంది గోండులకు పట్టాలగురించి తెలియదు, వాళ్ళకెక్కడా భూమికూడా చూపబడలేదు. ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారికార్యాలయం నిజామాబాద్‌లోఉంది. గోండులు అంతదూరంవెళ్ళి 1964 చట్టంగురించి అటవీశాఖతో తమకున్న వివాదాన్ని పరిష్కరించుకోలేరు. వ్యాపారికంటె ఎక్కువగా గిరిజన కార్పొరేషన్ గోండులను దోచుకుంటున్నది. ఆదిలాబాదు జిల్లా కేంద్రసహకారబ్యాంకులో

దుఃఖ
నిశ్శబ్దం
చెట్ల కొమ్మల మీద
ఇనప బూట్లు చేసిన గాయాలు
నీ హృదయాన్నీ, గాయపరుస్తాయి
మానవ రక్తాన్ని
బ్లాటింగ్ పేపర్‌లా పీల్చే
అమానుషాన్ని భరించటం
అసహ్యకరం
మళ్ళీ నువ్వు ప్రశ్నిస్తావ్
తిరిగి నిశ్శబ్దమే జవాబు
కానీ....
ఈ నాటికీ
ఆకాశంలో ధ్వని తరంగాల్లో
గింగురుమంటున్న
'ఫైర్, ఫైర్' అన్న కేకలూ
అస్తవ్యస్తంగా
పూర్తిగా చెరగని
పరువెత్తిన పాదాల గుర్తులూ
ఇవి ఏవీనీకుఇంకా
అర్థంకాకున్నా,
తడిసిఎర్రబడ్డ
బ్యాండేజీ చూసుకుని
అడవిలోకి అడుగుపెడుతూ
నిశ్శబ్దంగా పైకెత్తిన గోండుపిడికిలి..
నీకుతప్పక జవాబు
చెప్పేవుంటుంది,
ప్రశాంతసముద్రంలోన
అలలు విరుచుకుపడడానికి
సన్నద్ధంఅవుతున్నాయి,
లోనుండిఅలలు
పైకెగిసిపడేముందటి
నిశ్శబ్దం అది
తుడుంమోగించడానికై
పైకెత్తిన
చేతులకీ - శబ్దానికీ
మధ్యనున్ననిశ్శబ్దం
ఒక్కక్షణంమాత్రమే.

రగిలే జెండా

హెచ్చార్కె

ఇవాళ ఇంద్రవెల్లి ఒక ప్రతీక
తిరుగుబాటు జెండా ఎత్తడానికి
ఓనమాలు దిద్దనక్కరలేదు
కష్టాలు, కన్నీళ్లు కలబోసి
వడబోసుకుంటే చాలు
మిగిలే సమాధానం పోరాటం
లోపలికి, లోపలికి, లోలోపలికి
ఎంత దూరమని పోతారు వెనక్కి
అడవి కడుపులోకి ఎంత ముడుచుకున్నా
అమ్మ కడుపులోనికి తిరిగి పోలేరు గదా
తిరగబడి గెలుస్తారు, బ్రతకాలి గదా

ఇవాళ ఇంద్రవెల్లి
నా కలానికి ఆత్మవిశ్వాసం
చంపిన, చెరిచిన, జైళ్లలో కుక్కిన
జనం పోరాటం విడువరంటే విన్లేదు

పాట :

[1] బజిలీ పిల్లర్లం

బజిలీ పిల్లర్లమండిబాబు
మేము బతుకు లేనోల్లమండిబాబు
మా రక్తమంత ధారబోసి
లాడీసులు నింపుతాము ॥బజిలీ॥

పొద్దు పొద్దున్నే లేచి
సద్దిబొద్ది కడుపునింపుకోని
నెత్తిమీద టోపిబెట్టి
కాళ్లకేమొ బూట్లుతొడిగి
సెమ్మాసు తట్టలన్ని
భుజంమీద బెట్టుకోని
సినిగిపోయిన బట్టలేసి
కొలువుజేయబోతాము ॥బజిలీ॥

బొగ్గుబాయిలోన మేముబాబు
దిక్కులేని పచ్చులాముబాబో
తిన్నకూడు అరికెదాక
కాలినంత దొబ్బుకొత్తె
బొగ్గుతట్ట తెత్తుకోని
టబ్బులన్నీ నింపాలె
రెక్కలన్ని బొక్కలాయె
డొక్కలన్ని ఎండిపాయె ॥బజిలీ॥

బగ్గు బగ్గు మండేటి బాబో
బొగ్గు [2] పేసిలోన మేముబాబో
బొగ్గుతట్ట లెత్తుకోని
టబ్బులన్ని నింపుతుంటె
బాయి దొరగాడువచ్చి
[3] పోటికి పెళ్లేస్తె వాని
గైరాజరేసి మా
గంజిలో మన్నేసినాడు ॥బజిలీ॥

పేసిలో టబ్బు నింపిబాబో
[4] గులైదాక దొబ్బుకొచ్చిబాబో
నరాలన్ని జివ్వుమాన
జిగ్గుతాడు కూడగట్టి
తాడుగట్టినా టబ్బు
తెగిపోయి వెనుకకచ్చి
రాజన్న మీదికొచ్చి
రక్తంచిందించలేద ॥బజిలీ॥

చేసెటోడు ఒక్కడైతె బాబు
పనిచూసెటోళ్ళు ముగ్గురైరిబాబు
దొరలకెదుట సెప్పితె
చెప్పరాని తిప్పలొచ్చు
చెమట కత్తిరియ్యాలె

ఇప్పుడు విను
కళ్లెదుట వందమంది నేలకొరగడం
చూసికూడా
వాళ్ల మళ్లీ "పొరకలదొర" మీటింగుకే
పోతారట

ఇవాళ ఇంద్రవెల్లి
ప్రేమా, భయం కలగలిసిన సన్నివేశం
వాళ్లను ఎవరు ప్రేమించాలో
వాళ్ల గుండెకు హత్తుకుంటున్నారు
వాళ్లను చూసి ఎవరు భయపడాలో
వాళ్లతమ ఇనుపబూట్లలోవణుకుతున్నారు
ఆసుపత్రిలో, కాళ్ల గాయాల
మొదుగులైనా
ఆమె చేతులకు సంకెళ్లెందుకో చెబుదూ!?

ఇవాళ ఇంద్రవెల్లి ఒక పతాకం
రగల్ జెండా అంటే రగిలే జెండా

పెట్లను నాపెయ్యాలె
బాసండ్లు దోమాలె
బట్టలుతికియ్యాలె
దొర బూట్లు తుడువాలె
దొడ్డిసాపు జెయ్యాలె
కిందినుండి మీదిదాక
దొంగలంజకొడుకులైరి ॥బజిలీ॥

లీడరోల్ల మాటలింటె బాబు
ఉన్న హక్కులూడిపాయెబాబో
మూడునెల్ల కొక్కపారి
ముడ్డిమీద తన్నుకుంట
టర్మినేషనిచ్చుకుంట
తన్నిపంపించినారు ॥బజిలీ॥

గీ బజిలీ పిల్లర్ల బతుకొద్దుబాబు
గీ గాయిదోల్ల బతుకులొద్దుబాబో
బొగ్గు తట్ట లెత్తినాము
బగ్గబగ్గ మండుతాము
సెమ్మాసు లెత్తిమేము
దొరల నడుసుకుంటాము
సబ్బల్ల పట్టిమేము
లీడరోల్ల తరుముతాము
బజిలీ పిల్లర్ల మంత
బాంబులై పేలుతాము ॥బజిలీ॥

1. బొగ్గునింపే షిఫ్టు కార్మికులు. 2 స్థలం. 3. మీటుబెట్టిన కర్రెకు బొగ్గుపెల్ల తగిలించినావని. 4. మార్గము

(గద్దర్ రాసిన గ్యాంగోల్లమండి మేముబాబో పాటకు అనుసరణ : హుస్సేన్)

కవితలు :

షరా మామూలే

ఐ. యస్. గిరి

ఓటువిత్తనంతో
ఆవికల్పవృక్షపు మొలకను కళ్ళజూడాలని,
నాయకులవాగ్దానాల ఎండమావిలో
తన అవసరాల దప్పికనుతీర్చుకోవాలని,
సర్కారు సోషలిజంసబ్బుతో
పేదరికంమురికిని కడుక్కోవాలని,
చౌకదుకాణాల చికిత్సతో
హెచ్చుధరల జాడ్యాన్ని కుదుర్చుకోవాలని,
డిగ్రీకుక్కతోకతో
నిరుద్యోగంగోదావరిదాటాలని,

ఏలినవారి సెక్యులరిజం గొడ్డలితో
కులమతాల రక్కసిపొదల్ని ఛేదించాలని,
కోర్టుగొడుగుతో
అన్యాయాల మండుటెండను తప్పుకోవాలని,
నేతలచిరునవ్వుల వెన్నెలతో
సమస్యల అమావాశ్యల్ని తరిమేయాలని
అనుకున్నప్రతిసారీ
ఓటరుకు
ఎన్నికలజూదానికి మళ్ళీఆహ్వానం.

వాళ్ళు నల్గురూ

సాగర్

ఇక్కడనేను
ఒకచేతో ఆకాశాన్ని మోస్తూ
మరోచేత్తో భూమినిమోస్తూ
బండిపోతూ వదిలివెళ్ళిన
గాడిని స్పష్టంగాచూస్తున్నాను
ఈదారిని నడక కష్టమనిపించదునాకు:

ముందుకు దారిచూపేబండివెంట
ఎందరో ముందుకుపోతుంటే
వాళ్ళనుచేరుకోలేని
వాళ్ళనుఃందుకోలేని క్షణాలు
ఈనడకలో మరీదూరమవుతుంటే
నాకేసి చేతిలోని ఆకాశంలో మెరుపుమెరిసి
ఈ భూమిమీద ఎర్రశిశువు శిలువమోసినపుడు
నాకు కష్టమనిపిస్తూనేవుంటుంది ::

అప్పుడునాకు వెన్నెలపాట గుర్తొకొస్తుంది :
నా నడకలో వేగంపెరగటం
అప్పుడు యాదృచ్ఛికంకాదు :
రక్తంలో కసిపేరుకుపోవటం
చేత్తోమోసేఆకాశం జరిగిపోవటం విశేషంగాదు :
పట్టుబడ్డవాళ్ళు నల్గురూ
అందించిన ఆయుధం ఆదుకోవడమేవిశేషం :

నేను సైతం

ఎన్నార్ 'భోలా'

దేశంనిండా
నాగలివాళ్లకు
సంకెళ్లబిగుస్తాయన్న
చట్టం చాటింపుకు
కుందేళ్లు బెదర్లేదు, చెదర్లేదు

భూమినిండా మొలకెత్తినరైతులు
భూమినేకర్చుకొని భూమినిపర్చుకొని
భూమినేనమ్ముకొని
భూమినిండా నెత్తుర్లుచిమ్ముతునేవున్నారు,
భూమికి ఊపిర్లుపోస్తూనేవున్నారు
పోరాడుతునే వున్నారు—

నేనుమాత్రం
సాగులేని పంటలాపెరిగి
బరికిన మేతగడ్డిలా
నరికేయబడుతున్నాను

ఊపిరున్న శవంలా
ఉపయోగపడనివస్తువులా
చిలుమెక్కినట్టు
బరువెక్కినట్టు
నాలో నేను
మథనపడుతున్నాను

గ్రామాలకు తరలండంటూ
ఎత్తిన యువపిడికిలిఘాటికి
చిలుమొదిలి
చలివదిలి
నా ఊపిర్లుకూడ
ఉద్యమప్రభంజనంలో
ఐక్యమవుతాయి.

సి. ఎచ్. మధు కవితలు రెండు :

రాత్రి

రాత్రి
లక్ష ప్రశ్నలు
శరీరం మీద లక్షసూదుల చిత్రహింసలు
"మీగ్రూపేమిటి ?
నీ స్నేహితుల పేర్లేమిటి ?
మీ గుడారాల అడ్రసేమిటి ?"
ఒక్కతన్నుకు
పక్కలో బొక్కలు విరుగుతున్నాయి
"ఎక్కడ దాక్కున్నారు ?
ఏ కొండల మాటున కూడబలుక్కున్నారు ?
బూటుకాల క్రింద కాలు నలిగిపోతూవుంది
"ఏయే మీటింగ్‌లలో పాల్గొన్నావు ?
నీకు తుపాకి ఎవ్వా ?
వానిదెబ్బకు
నోటినుండి రక్తం కారుతూవుంది

"మీ లక్ష్యం ఏమిటి ?"
మౌనంవిడిచి "విప్లవం జిందాబాద్"
అన్నాను
వీపులో బూటుకాలుదెబ్బ
"మీపల్లెల పేర్లేమిటి ?"
మళ్ళీ నా మౌనం
కడుపులో లాఠీదెబ్బ
X X X X
ఈరాత్రి
నా మౌనం నన్ను చంపుతుందని
రేపు ఉదయం
తూర్పున ఉదయిస్తానని
నాకు తెల్సు

కథలు :

చిన్నపని

పెద్దిరాజు

"రేషన్‌బియ్యంకోసం కోసుడుదూరం పోవాలా ? సేరుబియ్యమేగా కోంటి సుబ్బయ్య కొట్లోతెస్తా".

రేషన్‌కాడయితే తోసుకుచావాలి, కోమటిసుబ్బయ్యయితే బెల్లమ్ముక్క పెడతాడు. అందుకని నసుగుతున్నాడు చిన్నోడు.

"ఏంమాటలు నేర్చావయ్యా ! నాలుగడుగులులేను కోసుడుదూరమయిందా నీకు? నే సెప్పగానేఎల్తే యీపాటికి తిరిగొచ్చేవాడివికాదూ ?"

దూరాభారాల్లోకూడా ఎవరికొలమానంవారిది. ఉన్నదూరాన్ని నాలుగింతలుచేసి వాడుచెప్తే, నాలుగడుగుల్లోకిమార్చి ఆమె చెబుతుంది.

పైగా సేరుకుమూడుకాన్లు మండబెట్టుకుంటాడు సెట్టి, అందులో సగానికీసగం రాళ్ళు, తేరగాపోసుకుంటానికి మూడుకాన్లంటేమాటలా, ఈపూటకి పచ్చిపులుసు సేసుకోఒచ్చు."

ఈమాటతో రేషన్‌షాపుకు పోవటమే నయమనిపించింది. అమ్మచేసే పచ్చిపులుసు కమ్మదనంగుర్తొచ్చి నోరూరింది, సంచితీసుకుని బయల్దేరటానికి సిద్ధమైనాడు చిన్నోడు.

వెలుగు

మిత్రుని కాల్చిచంపినతర్వాత-
కనులు కన్నీరుపెట్టకూడదని
కంటిరెప్పలమీద పోలీసులు
కాపలాకూర్చున్నారు
మిత్రుని అడుగుజాడలపైన
సిబిడి నిఘావుంచి
అడవి, వూరు, ముందూవెనుక
తుపాకీ తోరణాలుకట్టి-
భయపడనికాళ్ళను భయపెట్టిస్తామని
ఇనుపబూట్ల ఆర్భాటం
బాధేకాని-
భయంలేనికన్నులలో
పొడిచిన ఎర్రమందారాలు
పోలీసులు దీపాలార్పిన ఆ చీకట్లో
వెలుగయి-
కాలుతున్న మిత్రునిశవంచుట్టూ
పోలీసులు వెలుగుపాకకూడదని
తుపాకీలుపట్టుకొని

వాళ్లపిచ్చికానీ-
తుపాకీభయానికి
వెలుగు గుండె ఆగి చచ్చిపోతుందా ?
తుపాకీదెబ్బకు
చావులేని వెలుగుగుండె కాలుతుందా ?

"పావలాకాని సేరుబియ్యానికిపోతే మిగిలినమూడూకాన్లా, కానిబెల్లం, కాని చింతపండు, దమ్మిడి ఎండుమిరపకాయలు, దమ్మిడి ఉల్లిపాయలు తీసుకుని మిగిలిన దమ్మిడి పెట్టి పటికిబెల్లం కొనుక్కో"మని అయిదణాలులెక్కపెట్టి పొట్లంకట్టి పంచిలోవేసి 'జాగ్రిత్తనాయనా'అని చెప్పిపంపింది.

'అమ్మ ఎంతమంచిదో'ననుకుంటూ పరుగుతీశాడు చిన్నోడు

కారులా పరుగెత్తుతున్న వాడ్ని "సిన్నగా ఎల్లారిసిన్నా"అని హెచ్చరించి 'బాబు. మనసుకుదిరితే మందులసంచి' అనుకుని మురిసిపోయిందిఅమ్మ.

కొట్టుదగ్గరజనం ఒత్తిడిగావుంటే ఎలాదూరివెళ్ళాలో ఊహించుకుంటూ పరుగెడుతోన్న చిన్నోడికి చప్పున గుర్తొచ్చింది రేషన్ కార్డు.

వేగంగావెళ్ళేకాళ్ళను స్లోచేసి రివర్సుగేర్ లోలా వెనక్కునడిచి, ఉత్తి చేతుల్తో టర్నింగ్ కోసి ఇంటికేసితిరిగి స్పీడు అందుకున్నాడు చిన్నోడు.

బంతిలా తిరిగొచ్చిన చిన్నోడ్నిచూసిన అమ్మకు చూరులోదాచిన కార్డు గుర్తొచ్చింది.

"అయ్యో నామతిమండ, పాపిష్టిదాన్ని బిడ్డనెంత బాధపెడతన్నానమ్మా"అని నొచ్చుకుని,

'ఇదెక్కడి! పీశాచమా! అట్టముక్కకున్న ఇలువ మనిసి మాటకులేదు. అక్కడికది దర్మంగా ఇస్తారా అంటే అదీలేదు ఆరుగురికిచ్చే బత్తెం ముగ్గురికి చాల్దు. పూటకీ టికానా లేనోళ్ళు ఒక్కసారి తెచ్చుకోలేక మళ్లీఎల్తె, టాకు అయిపోయిందని చెప్పి దేకుసమ్మ కుంటారు ఈ అన్నాయం మన్నుగలవ! జనాన్ని సల్లుల్ని మాడ్చినట్లు మాడ్చి ఈల్లేం బావుకుంటారు? బెమ్మంగారు చెప్పినట్టు ఏదో యినాసకాలం దాపరించింది."

ఆక్రోశంతో శావనార్థాలుపెడ్తూ చూరులోకార్డు వెతికి చేతిలోపెట్టి మరొక్కసారి మెల్లగా వెళ్ళమని చెప్పి సాగనంపింది.

ఈమెకి బ్రహ్మంగారి కాలజ్ఞానమైతే తెల్సిందిగాని సమకాలీన జ్ఞానంలేనట్టుంది.

స్వాతంత్ర్యంవచ్చి పద్దెనిమిది మాసాలే అయింది. కొద్ది సంవత్సరాల్లో రామ రాజ్యం లాంటి శ్రేయోరాజ్యం స్థాపిస్తామని నాయకులు ఉద్ఘాటిస్తూంటే వినాశకాలాన్ని వూహిస్తుందేమిటీ?

....

బియ్యం తీసుకుని రయ్యిన ఒస్తున్నచిన్నోడు సెంటర్లోకి రాగానే అడ్డరోడ్డు లోంచి అదిరిపాటుగా వచ్చిన సైకిల్ ఢీ కొట్టి తిరిగి చూడకుండా ఉడాయించింది

తోటి మనిషికి తనవల్ల హానిజరిగిందని విచారించటానికి కూడా వీలులేనంత బిజీ అయిపోయింది గాబోలుజగం.

బిక్కుబిక్కుమంటూ వెళ్ళిపడిన చిన్నోడు ఒక పొర్లుపొర్లి లేవబోయి కాలుకలుక్కుమనగా కెవ్వున కేకవేసి ఒంటికాలు మీద నిలబడి దెబ్బతగిలిన కాలు మోకాలుదగ్గర ఎత్తిపట్టుకుని విలవిల్లాడుతున్నాడు.

సైకిల్ చక్రం శిలమండ మీంచి జారిపోయిందేమో గిలకపాటు తప్పి పాదం సీల ఊడిన సిగ్నల్‌రెక్కలా వేలాడుతున్నది.

దెబ్బవల్ల కలిగిన నొప్పికన్న కాలు పనికిరాకుండా పోతుందన్న భావమే వాడ్ని భయపెట్టి బావురుమని ఏడిపిస్తున్నది.

అమ్మో నాకాలు.... అమ్మో నాకాలు....

శోకాలుపెడుతున్నాడు....

సంచిలోనుంచి ఒలికిపోయిన బియ్యం ఎండుమిరపకాయలు ఉల్లిపాయలు చెల్లాచెదురుగాపడి అప్పటికే పెద్దగుంపుగా పోగయిన జనంలాకాక అచేతనంగా పడివున్నాయి.

గుమిగూడిన జనం సానుభూతివాక్యాలు, సాంత్వనయనాల్తో ఏమీచేయలేక పాలుపోక కళవళపడుతున్నారు. ఒకాయనైతే 'హద్దుమీరి' సైకిల్ తొక్కినవాణ్ణి పట్టుకుని దేహశుద్ధి చేయాల్సిందని గట్టిగా చెబుతున్నాడు.

క్షణాలు భారంగా గడుస్తున్నాయి
చిన్నోడు దీనంగా ఏడుస్తున్నాడు
జనాలు దీర్ఘంగా విచారిస్తున్నంతలో
మందినిచీల్చుకుని ముందుకువచ్చాడు.

చివర్లునలిగి పోగులు వేలాడుతున్ననిక్కరు, మాసికలువేయటానికికూడా వీలులేకుండా చినిగినబనీను, చెమటతోతడిసి అరి అట్టకట్టుకుపోయిన బట్టలతో కొలిమిలో కాలిచల్లారిన ఇనపముక్కలావున్న యువకుడు తిన్నగా చిన్నోడిదగ్గరకువెళ్ళి

"బాబూ నీకేంఫర్వాలేదు"అని ధైర్యంచెబుతూ, వాడ్ని రెండుచేతుల్తోఎత్తి కాళ్ళు చార్లగాబాపి కూర్చోబెట్టాడు. తను వాడిముందు చతికిలబడికూర్చుని కుడికాలు వాడిగజ్జలో పోటీపెట్టి దెబ్బతగిలినకాలి మోకాలుదగ్గరనుంచి చేతుల్తోసవరదీస్తూవచ్చి మడంపట్టుకుని ఒక్కగుంజుగుంజాడు. కిటుక్కుమని గిలకపాటులో పడిపోయింది. జేబులోంచి సహజంగానే మాసినతన చేతిగుడ్డతీసి కదలకుండా కట్టుకట్టి, ఒలికిపోయిన

బియ్యం వెచ్చాలను సంచిలోకివత్తి చిన్నోడ్ని ఎత్తుకుని "ముందు డాక్టర్ దగ్గరకు ఎల్దాం. తర్వాత మీయింటికి తీసుకెళ్తాను ఏం ?" బుజ్జగిస్తూ తీసుకువెళుతున్నాడు.

బిగబట్టిచూస్తున్నజనం ఒక్కసారి ఊపిరిపీల్చుకుని "అబ్బా ఏమిచొరవ, ఏమి చొరవ, ఏమితెలివి, ఏమిసమయస్ఫూర్తి "అని విస్తుపోయి తెగమెచ్చుకుంటున్నారు.

"ఇంతమందిలోనూ ఒక్కరికీతోచలేదు" నొచ్చుకున్నాడు ఒకనల్లకళ్ళజోడు.

"మనకెలాతడుతుంది ? అతను సోషల్‌వర్కరై వుంటాడు"— ఒకషోకేలా.

"సోషల్‌వర్కర్ అలానేవుంటాడా ? చేతిపనివాడులావుంటే"— ఒక లిబికిచి

"అతను ఎవరైనప్పటికీకూడా ఎముకవైద్యం తెలిసినవాడు"— పంతులుగారు వివరించేసు.

"ఆదేంకాదు, వాడెవడోనాకుతెలుసు" కొత్తఖండాన్ని మొట్టమొదట కనిపెట్టిన వాళ్ళా ఎలుగెత్తిచాటాడు ఓ ఖద్దరుకండువా.

"వాడా.... వాడు.... కమ్యూనిస్టు" ఆ మాటల్లో అసహాయమైన ఈర్ష్య ధ్వనించింది.

అందరూ అటుతిరిగారు.

చూపువేటుదూరంలో పోతున్న వాడివీపు ఆకాశమంత విశాలంగా కనబడు తున్నది.

బండల నడుమ

బి. సి. ఎచ్. శేఖర్

బండలమధ్య వేళ్ళమీద లెక్కబెట్టగలిగినన్ని గుడిసెలున్న అదొకచిన్న పల్లెటూరు. వూరుఅంటంగూడా బాగుండదని నా అభిప్రాయం. ఆ కొండలమధ్య (గుడిసెల్ని ఎవరికివారు కొంపలంటుడంట అక్కడి 'అలగా' జనానికి అలవాటు) ప్రతిరోజులాగే (చంద్రుడొస్తేతప్ప) ఆరోజుకూడా చీకటితాండవిస్తోంది. చలిగాలి దరిద్రానికి తోడై వీస్తుంది.

దాదాపు అర్ధరాత్రిదాటింది.

"ఒరేయ్ ఎంకయ్యా! లేరా లే!"

ఎంకయ్య ఆ కేకతో ఒక్కసారి గాఢనిద్రనుండి ఉలిక్కిపడి లేచికూర్చుని కళ్ళు నులుపుకుండేంతలో ఆ అరుపులాంటికేక పేడమూప్పుతో దూరమయింది.

పెళ్ళానికి పాముకరిచిందన్నా, నాలుగేళ్ళకొడుకు నిద్రలో నీలుక్కుపోయాడన్నా, ఇంట్లోకి కుక్కజొరబడి రాతెండిగిన్నెలు చప్పుడుచేస్తున్నా, పందికొక్కులు ఇంట్లో బొరియలు తవ్వుతున్నా, ఆఖరుకు కుక్కవచ్చి తనపక్కలో పడుకున్నా ఏ రాత్రి అతను నిద్రలేవలేదు. పక్కలోపడుకున్న కుక్కనుకరుచుకొని మరింత వెచ్చదనాన్ని అనుభవిస్తాడు.

అలాంటి ఎంకయ్య ఈ కేకవినగానే ఉలిక్కిపడి లేవకతప్పలేదు. ఆ కేక అతనిజీవితంలో అతిముఖ్యమైనది సుపరిచితమైనది. ఆకేకకు అర్థమేమిటో అతనికి బాగాతెలుసు. తెలుసుకనుకనే అతనికాళ్ళు నీళ్ళకుండదగ్గరికి పోయాయి నీళ్ళతో మొహాన్నికడుక్కుని కళ్ళునులుపుకుంటూ చినిగిన తనకున్న ఒకేఒక నల్లటిపంచె (మట్టిఅంటుకుని నల్లబడిన) తలకుకట్టుకుని దరిద్రంతినేసిన చెప్పులజతని కాళ్ళలోకి బలవంతంగాదూర్చి నిద్రపోతున్న తన నాలుగేళ్ళ చిన్నారికొడుకుని ఒకసారిచూసి నిర్వంగానిట్టూర్చి బయటకు అడుగులువేశాడు ఎంకయ్య.

బయట చలిపెడుతున్నబాధ అతని దరిద్రంకంటే భయంకరమైనది కాదుగాబట్టి అది తనదరిద్రంలో ఒకభాగమని తెలుసుకాబట్టి చిన్నగా వణుకుతూ నడుస్తున్నాడు.

ఎంకయ్య ఒకచిన్న నాపరాయిగనిలో కార్మికుడు. గనిలోబానిసంటే సహజంగా ఉంటుందేమో! అతనితోపాటు ఓ వలభైమంది ఆ గనిలో పనిచేస్తారు. పొద్దుటే గనిలోకివెళ్ళి రాళ్ళనుతొలిచి అడుగుకి కొంతడబ్బు కూలీతీసుకుంటుంటారు. రాత్రిపూట

డకు ఆరేడుమైళ్ళదూరంలోవున్న పట్టణంలో నివసిస్తుంటాడు. వారాంతంలో అక్కడికి వెళ్ళి బట్వాడా తీసుకుంటారు. ఇబ్బందులకు యజమానివద్ద ఎంతోకొంత అప్పుతీసు కున్నవారే. అప్పుమాత్రం ఎవరూ తీర్చలేకపోతున్నారు. వడ్డీతో రెండింతలౌతుంది.

అప్పటికే ఆ లారీదగ్గర కొన్నిచుట్టలు ఎర్రగా కాలుతున్నాయి. మట్టిలోపుట్టి మట్టిలోపెరిగిన నల్లటి మనుషుల్నిమాత్రం ఆ చీకటి మింగేస్తుంది. చిన్నగా వాళ్ళ దగ్గరికిపోయి తనూ ఓచుట్ట వెలిగించాడు. రావలసినవాళ్ళకోసం ఎదురుచూస్తూ ఆలోచ నలో పడ్డాడు.

'తను పుట్టిందిపెరిగింది ఇప్పుడు శ్వాసపీలుస్తూ విడుస్తుందీ ఈ రాళ్ళమధ్యనే సంపాయించింది రోగాలు, రొప్పులూ రాళ్ళదెబ్బలూ. ఈ రాళ్ళమధ్యనే తనభార్య ప్రాణంపోగొట్టుకుంది పాముకరిచి. ఈ రాళ్ళమధ్యనే తనకొడుకు అక్షరంముక్క నేర్చుకోడానికి నోచుకోలేకపోయాడు. ఈ రాళ్ళమధ్యనే తనుఅప్పుతో పదిముక్కు వేయించుకున్నాడు. ఇక్కడ్నించి వెళ్ళిపోదామంటే అప్పుతీర్చాలి. తను అప్పుతీర్చ లేడు. కాబట్టి తనుబలవంతంగా ఈ రాళ్ళమధ్యకు తోయబడుతున్నాడు. ఈ రాళ్ళ మధ్యనేవున్న తనగూటిలోనికి కనీసం చలిచొరనీయకుండా చేయలేకపోతున్నాడు. అన్నాన్ని కుక్కలపాలు చేస్తున్నాడు'.

"రండెహె తొరగాకానీయండెహె మీ యవ్వారాలు, సందుదొరికితే గుసగుసలు".

ఎంకయ్య ఆలోచనలను భగ్నంచేస్తూ మేస్త్రీ కేకలు సగంకాలినచుట్టను ఇంకో దమ్ములాగి ఆర్పి భద్రంగా బొడ్లోపెట్టుకుని నాపరాళ్ళవేపు అడుగులువేశాడు అందరి లాగే. ఇద్దరు కార్మికులసాయంతో ఓబండ నెత్తిమీదకెత్తుకున్నాడు. అడుగులు లారీ వేపు పడుతున్నై. మనసుని ఆలోచనలు పీకుతున్నై.

'తనెందుకిలా వున్నాడు ?

ఎందుకు ?

ఎందుకు ?

దానికి కారణంఎవరు ?

యజమానా ?

దేవుడా ?

చట్టమా ?'

"అబ్బా" ఒక్కగావుకేక, రాయిపడి కాలివేలు చితికిపోయింది. అందరూ

"ఒరేరంగన్నా ఇంతకిరసనాయిలు ఇటుతేరా" వెంటనే వెలుగుతున్న దివిటీ లాంటి బుడ్డిలోంచి ఇంత కిరసనాయిలు ఎవరో కాలివేలుమీద పోశారు, పైపంచె లోంచి ఒక పేలికను కట్టుగాకట్టారెవరో. కిరసనాయిలుతాకిడికి తీవ్రంగా తీపుపుడు తోంది ఎంకయ్యకాలు".

"ఇంటికెళ్ళి పండుకోరా ఇయ్యాల్టికి నువుపనిసెయ్యలేవు ?" ఒకగొంతు ఆప్యాయంగా సలహాయిచ్చింది.

అతనిచ్చినసలహాలో 'ఇయ్యాల్టికి' ఆప్యాయతతో కూడుకున్న మాటేగానీ వ్యంగ్యార్థంలోకాదు- అదే పున్నోళ్ళకు ఇంతదెబ్బతగిలితే ఎన్ని రోజులు డాక్టరు వాళ్ళింటికితిరుగుతాడో, ఎంతమంది బంధువులో లెక్కబెట్టలేము. కానీ అతని జీవితంలో అలాంటిదెబ్బలు లెక్కేలేదు. పలుకరించేదెవరు. అందుకే "పనిచెయ్యక పోతే రేపుతిండెట్ట ?" మనసుప్రశ్నించింది.

"పనెలాచేస్తావో నేంచూస్తాను ?" కాలికున్నదెబ్బ నొప్పిరూపంలో ప్రశ్నించింది.

బాధ ! నొప్పి ! రేపు ! తిండి !

'అబ్బా !' 'అమ్మా !' మూలుగుతూ గుడిసెవేపు కుంటుతూ నడిచాడు ఎంకయ్య

X X X X

మనుషులచర్మాన్ని నల్లగామార్చాలనే దురుద్దేశం ఉందికాబోలు ఎంత మండి పోతోంది. బండలు కొలిములోకాల్చిన ఇనుపకడ్డీల్లా మాడిపోతున్నై. ఆ ప్రదేశ మంతటా వులులు, సుత్తులు టకటకలాడుతున్నై. అవితప్ప మరేమీ విన్పించటం లేదు. ఎంకయ్యకూడా వులితో నాపరాళ్ళను తొలుస్తున్నాడు. ఎంకయ్య కొడుకు నాలుగేండ్లవాడు ఒక బండచాటునీడలో ప్రపంచం తనకేమీ పట్టనట్లు సుఖనిద్ర (రాళ్ళలో) పోతున్నాడు. అన్నంతట్ట, నీటికుండ వాడికికొంచెం అవతలఉన్నై. ఎంకయ్యకాలు బాగావాచివుంది. అయినా పనిలోకి రాకతప్పలేదు. కారణం తిండి.

నల్లగావున్న చొక్కాలాంటి అతనిశరీరంపైపడిన ఎండని చర్మంశోషణచేస్తుంది. అతనికడుపులో ఆకలి. చిన్నగాలేచి తలగుడ్డయిప్పి ఒక్కసారి విదిలించాడు. దుమ్ము ఆ ప్రదేశంలో బాగాఅలుముకుంది. వులి సుత్తి ఒకరాయిచాటునపెట్టి, తిరిగివచ్చి గడ్డపార వాటిపక్కనేవుంచి కొడుకుదగ్గరికి వచ్చాడు.

వాణ్ణి నిద్రలేపి కాస్తంతఅన్నంకలిపి వాడికిపెట్టి తనూతిన్నాడు. అన్నం ఎర్రగావుంది. కడుపులోమంటగావుంది. కుండలోనీళ్ళువంచి వాడికితాపి తనూతాగాడు.

చెయ్యికడుక్కుని తలగుడ్డకు తుడుచుకున్నాడు. బొడ్లోంచి సగంకాలినచుట్టను వెలిగించాడు. కొడుకు మళ్ళీనిద్రలోకి జారుకోబోతున్నాడు. రెండుదమ్ములుపీల్చి పొగ వదిలాడు.

"ఏఁవయ్యోయ్" ఎవర్నీ అన్నట్లుగా కేకవేసిన మనిషివేపు చూశాడు ఎంకయ్య పంచె కట్టిన అపరిచితుడు అల్లంత దూరంలో నిలబడి పిలుస్తున్నాడు.

"నిన్నే మా అయ్యగోరు రమ్మంటున్రు."

"ఎవరా అయ్యగోరు? ఎక్కడవుండు" అని తిరుగు ప్రశ్నలెయ్యలేదు ఎంకయ్య. ఎవరైతేనేం 'అయ్యగోరు' అంటున్నాడు కాబట్టి అతని మెదడు ప్రశ్నించమని నోటికి చెప్పలేదు కాళ్ళకు వచ్చినతనివెంటనడవమని ఆజ్ఞ యిచ్చింది. కొడుకు నెత్తుకొని ఉంటుతూ అతన్ని అనుసరించాడు ఎంకయ్య.

కొంచం దూరంలో ఒక చెట్టుకింద మోటారు సైకిల్‌పై కూర్చొని వున్నడొక మనిషి పాంటుషర్టు ఖరీదైనవని తెలుస్తూంది. నడివయస్కుడు.

"అయ్యగోరు మీ లేబరాపీసరు. చాలా దయగలవోడు. పేదలంటే చెడ్డ అబిమానం ఆనకి" దూరంగా వుండగనే చెప్పాడు ఎంకయ్యని పిలుచుకొస్తున్న వ్యక్తి.

ఎంకయ్య లేబరాఫీసరు నెప్పుడూచూశ్కేదు. ఎవరో అనుకుంటుంటే కాబోలు ఇన్నాడతను. యజమానులు బ్రాందీ, విస్కీలు, కోళ్ళు, కుక్కలతో లేబరాఫీసర్లని మచ్చికచేసుకుంటారని.

"మరీన యీడి కెందుకొచ్చినట్టబ్బా" ఆలోచించాడు. 'అనుంటి బాందీలకు లొంగే ఓడు కాదేమో' మనసు సమాధానపరిచింది.

"దండాలు బాబుగోరు" పిల్లగాణ్ని బుజంమీద నుండి దింపి వినయంగా చేతులు జోడించాడు ఎంకయ్య.

"నీ పేరేంటిరా ?"

"నా పేరు ఎంకయ్యండి తమరు ఎంకన్న అనండి".

"నువ్వు ఈ క్వారీలోనే పనిచేస్తుంటావా ?"

"ఔను ఈ కోరీలోనేనండి"

"మీ యజమాని మంచోడేనా ?"

"..................." చెప్పడానికి సందేహించాడు చెపితే ఏంగాడవో సెప్పక పోతే ఏంగాడవో తేల్చుకోలేక తలొంచుకుని నిలబడ్డాడు ఎంకయ్య.

"వర్లేదు నిజంచెప్పు. నేను మీ లేబరు మేలుకోరేవాణ్ణే, మంచోడు కాదని విన్నాను. మీకు మేలుచేద్దామని వచ్చాను చెప్పరా చెప్పు."

"నిజమేనండి మంచోడు కాదండి" తడపడుతూ సమాధానం

"ఎందుకని ?" మోటారుసైకిల్ ప్రశ్న. ఒక కాగితం కలం తీసుకుని ఎంకయ్య చెబుతున్నది రాసుకుంటున్నాడు.

"మాకు బట్వాడా సరిగా యియ్యడండీ. మాకేదన్నా దెబ్బ తగిలిందనుకోండి. లేబరురూలు పకారం వారే డబ్బులియ్యాలంట కదండి. ఈన అట్టాకాదండి మేం దెబ్బ నయం సేయించుకోడానికి డబ్బులు వడ్డీకిచ్చి తీర్సిందాక పాణాల్తీస్తడండి. రాతిరే నాకాలికి దెబ్బతగిలిందండి" దెబ్బవేపు చూపించాడు. ఎంకన్నకు లేబరాఫీసరు మీద గురి కుదిరింది. "ఇంకా సెప్పాలంటే శానావున్నయండీ. మా గూడేనికి బడిలేదండి"

"మరి మీ పిల్లలెలా చదువుకుంటున్నారు ?"

"సదువూసందే ఏదీలేదండి. సదువే కాదు బుడ్డ డాకటరుబాబు కూడా లేడండి. అందుకే మా ఆడది పాముకరిసి సచ్చిపోయిందండీ. డాకటేరుంటే బతికేదేనని అందరూ అన్నారండి."

"అయ్యోపాపం" రాస్తున్న కలాన్ని ఆపకుండా అన్నాడు లేబరాఫీసరు.

"మీకు లేబర్‌యాక్టుప్రకారం బడి, హాస్పిటల్, ఏదైనా దెబ్బతగిలిందంటే ఉచితచికిత్స ఇవన్నీఉండాలి. ఈ కాగితంమీద సంతకంపెట్టు అవన్నీ వచ్చేఏర్పాట్లు చేస్తా".

"సంతకంరాదండి. ఏలుముద్దరేత్తానండి".

వేలిముద్ర వేసింతర్వాత మోటారుసైకిల్ దూసుకునిపోయింది.

పడమట సూర్యుడు సంధ్యారాగం ఆలాపిస్తున్నాడు, ఆకాశం ఎర్రగా కందినట్లుంది. లేబరాఫీసరుగురించి ఆలోచిస్తున్నాడు, ఇంటివేపునడుస్తూ ఎంకయ్య.

'శానామంచోడు, దరమాతుముడు పిల్లగాడికి సదూసెప్పించొచ్చు' తనవెంబటి వొస్తున్న కొడుకువేపొకసారిచూశాడు వాడాఫీసరై పోయినట్లు.

'ఏదైనా దెబ్బతగిలితే పసర్లుకాకుండా ఇంగిలీసుమందులేపియ్యొచ్చు' ఆలోచిస్తూ ఇల్లుచేరుకున్నాడు.

మట్టికొట్టుకున్న శరీరం- మట్టిలోపొర్లాడిన బట్టలు జీవితమంతామట్టే- సుత్తి, వులి, తట్ట ఒకమూల్నపెట్టి మొహంకడుక్కుందామని కుండదగ్గరకు వెళ్ళాడు. కొడుకు దూరంగా ఆడుకుంటున్న పిలలవేపువెళ్ళాడు.

ఏదో మోటర్ సైకిల్ మోతవిన్పించింది. బయటికొచ్చి చూశాడు- మోటర్ సైకిల్ వెంకయ్య యింటిముందాగింది-

ఈ మోటర్ సైకిల్ మధ్యాన్నం వచ్చిందికాదు. దానిమీదున్నవ్యక్తి యజమాని జోగారావ్- బుర్రమీసాలు గ్లాస్గోపంచె. తెల్లటిఖరీదైనలాల్చీ- భారీవిగ్రహం.

"ఒరేయ్ ఎంకన్నగా ఇట్రారా" బలవంతంగా తెచ్చిపెట్టుకున్న శాంతంతో అంటున్నపిలుపు. ఎంకన్న మోటార్ సైకిల్ దగ్గరగావెళ్ళాడు.

"ఏందిరా నువ్వుచేసింది- ఇదేనారా" లాల్చిజేబులోంచి కాగితం బయటికి తీసింది బుర్రమీసాలచెయ్యి.

"ఇదేంటో చదువురా" మీసాలు గర్జించినయ్.

"నాకు సదువురాదు బాబయ్యగోరూ" అమాయకుడిపలుకు-

"నాయాలా చదువురానోడివి ఈ స్టేట్ మెంటెలాగిచ్చినవ్‌రా- చదువురానోడివి అలాగే ఉండకూడదురా" చెప్పలేని యింకాఎన్నోమాటలు మాట్లాడుతూ మోటార్ సైకిల్ గర్జించింది.

"అబ్బా" దిమ్మ తిరిగింది ఎంకన్నకు కళ్ళ గిర్రున తిరిగినై. మోటారుసైకిల్ తల్లకిందులైనట్లు కన్పడుతుంది.

"ఫట్ ఫట్" బూతులతో దెబ్బలు

"అబ్బా" పక్కనున్న గోడకు కొట్టుకొని కిందపడిపోయాడు. తలకు దెబ్బ.

రక్తం.... రక్తం.... రక్తం....

మొహం ఎర్రగా మారిపోయింది. బట్టలు మట్టితోపొర్లాడుతున్న బట్టల్లోకి రక్తం ప్రవహించి తడిసిపోయినై.

"నాయాలా ఇదే నీకు చాలదురా ఎంత పాపం దలిచినా మీ అలగాబుద్దులు పోవురా బదొందలిచ్చి ఈ కాగితం విడిపిచ్చుకునేసరికి తలప్రాణం తోక్కొచ్చింది. ఆ లేబరాపీసరుగాడు బదొందలకేలొంగిండు. లేకపోతే నీపీక పిసికేవాణ్ణి దొంగలంజా కొడకా...."ఇంకా ఏదేదో అంటుంది బుర్రమీసాలతో కప్పబడ్డ భోషాణంలాంటి నోరు.

ఇంకేమీ విన్పించడంలేదు ఎంకయ్యకి స్పృహతప్పుతోంది నాడులు పనిచెయ్యడం ఆపేస్తున్నై.

వెళ్ళిపోతున్న మోటారుసైకిల్ చప్పుడులో యజమాని తిట్లూ లేబర్ ఆఫీసరు తీయటిమాటలూ కలిసిపోయి ఒకేలాగ అన్పిస్తున్నయ్ ఎంకయ్యకు. స్పృహతప్పుతున్న ఎంకయ్యకు ఏదో కొత్త స్పృహ....

పరిచయం :

"విప్లవాన్ని కడవరకూ తీసుకొనిపొండి"

అది 1949 వసంతం. చైనాలో యాంగ్జీనదీప్రాంతం- ప్రజావిముక్తి సైన్యానికో కొమింటాంగు ప్రభుత్వానికిమధ్య జరుగుతున్న అంతర్యుద్ధంలో ఎర్రసైన్యానికి సంపూర్ణవిజయం చేరువవుతున్న సమయం- యాంగ్జీనదికి ఉత్తరంవైపునున్న భూభాగాన్ని ఎర్రసైన్యం విముక్తంచేసింది- దక్షిణంవైపు వెళ్లడానికి నది అడ్డుగాఉంది-

విమానాలుఉంటేతప్ప నదినిదాటడం సులభంకాదు- ఇతర మార్గాలగుండా నదిని ఎర్రసైన్యం దాటకుండా శత్రువు దిగ్బంధంచేసాడు- ఎర్రసైన్యానికి విమానాలు లేవు- ఎర్రసైన్యాన్ని నదియే ఎదుర్కొంటుందని కొమింటాంగు సైనికాధికారులు సంబరపడిపోతున్నారు.

ఇటువంటిసమయంలో నదికి దక్షిణంవైపునఉన్న కొమింటాంగుసైన్యం ఎత్తుగడలను, సైనికస్థావరాలను తెలుసుకుని ప్రజావిముక్తిసైన్య ప్రధానకేంద్రానికి సమాచారం అందజేసేబాధ్యతను తీసుకుని కంపెనీకమాండర్ 'లీ' నాయకత్వంలో ఎర్రసైన్యపు నూతన నాలుగవదళానికిచెందిన ఒకదళం బయలుదేరి, అత్యంతసాహసంతో ప్రమాదాలను ఎదుర్కొని దక్షిణానికి చేరుతుంది- ఎర్రసైనికదళం నదిని దాటిందనితెలిగాయనే కొమింటాంగుసైన్యం వాళ్ళకోసం వేటప్రారంభిస్తుంది- శత్రువు చేతికిచిక్కకుండా ఎర్రసైనికదళం సమాచారం సేకరించిపంపడంలో చూపిన ధైర్య సాహసాలు, ఎదుర్కొన్నప్రమాదాలు, చేసినత్యాగాలు, పొందినవిజయం ఈ చిత్రం Reconnaissance Across The Yangtze River లో అద్భుతంగా చిత్రీకరించబడ్డాయి- ఈ కార్యక్రమంలో "విప్లవాన్ని కడవరకూ తీసుకొనిపొండి" "Carry the Revolution through the end" అన్న మావో నినాదం వాళ్లకెప్పుడూ ఉత్తేజకరంగా ఉంటుంది- ఈ పనిని జయప్రదంగా నెరవేర్చడంలో 'లియూ' నాయకత్వంలోని గెరిల్లాదళం ఎర్రసైనికదళానికి సహాయపడిన తీరునుగమనిస్తే శత్రువు బలంగాఉన్నచోట గెరిల్లాదళాలు ఎటువంటి గురుతరమైన బాధ్యతను నెరవేర్చగలవో తెలుస్తుంది.

'లియూ' చేపలుపట్టి జీవించేకుటుంబానికి చెందినఅమ్మాయి- నాలుగు సంవత్సరాల క్రితం ఆ ప్రాంతానికిచెందిన 'హౌ- టెంగ్- కీ' (Hou- Teng- Ki) అనే భూస్వామిమనుషులు ఆమెతండ్రిని చంపివేస్తాడు- ఆమెనుకూడా చంపబోతుండగా 'లీ' రక్షిస్తాడు- భూస్వామి మనుషులబారినుంచి 'లీ'ని 'లియూ' రక్షించిపంపుతుంది- ఆ తరువాత 'లియూ' గెరిల్లాదళంలో చేరుతుంది- ఇప్పుడు వాళ్ళిద్దరూ తమ లక్ష్యసాధనలో కలుస్తారు- 'లీ' నాయకత్వంలోని ఎర్రసైనికదళంచేతిలో ఆ భూస్వామి

చిక్కినతరువాత మంచిపనులుచేస్తూ, ప్రజలకు ద్రోహంచేయకుండా బతికేఅవకాశాన్ని అతనికిఇస్తుంది. కాని అతడు తప్పించుకొనిపోయే ప్రయత్నంలో 'లియూ'చేత కాల్చిచంపబడతాడు.

శత్రువువేస్తున్న ఎత్తుగడల పథకానికి చెందిన డాక్యుమెంటును ఎర్రసైనిక దళం, గెరిల్లాదళం కలిసి మారువేషాలతో అపహరిస్తాయి. శత్రువు నిర్మిస్తున్న యుద్ధ స్థావరానికి సంబంధించిన వివరాల నమూనాను, అత్యంత సాహసంతో శత్రుప్రదేశంలోకి వెళ్ళి, ఎర్రసైనికదళం సేకరిస్తుంది. ఆ నమూనాను ప్రధానకార్య స్థానానికి అందించాలి. నమూనాతోపాటు 'లి-యోన్' పర్వతం మీద చిక్కుకుపోయిన ఎర్ర సైనికదళం, గెరిల్లాదళం పూర్తిగా శత్రుసైన్యం చేత చుట్టివేయబడతాయి. ప్రధాన కార్యస్థానంతో సంబంధంపెట్టుకొనే వీలులేకుండా శత్రుసైన్యం కాల్పుల్లో ట్రాన్స్ మిటర్ ధ్వంసమైపోతుంది. చీకటి సమయం, తెల్లవారితే శత్రువు చేతిలో చావడం తప్ప మరోమార్గం లేదు. నదిని దాటి ఉత్తరం వైపునున్న ప్రధానకార్యస్థానానికి సమాచారం అందించకుండా శత్రువు కట్టుదిట్టాలు చేసాడు. ఈ విపత్కర పరిస్థితిలో 'లీ' తమ దళాన్ని రెండుగా చీల్చి శత్రువును మోసగించి, ఇద్దరు గజ ఈతగాళ్లైన సైనికులు నదిని దాటేలా చేస్తాడు. నమూనాను అందుకుని, శత్రువు యుద్ధస్థావరాలను కనిపెట్టి ఎర్రసైన్యం ఒక్కపెట్టున నదిని దాటుతూ శత్రువుమీద దాడిచేస్తుంది. శత్రువు లొంగిపోతాడు. ప్రజలు ఆనందోద్వేగాలతో స్వాగతం చెపుతుండగా ఎర్రసైన్యం యాంగ్జీనది దక్షిణదిక్కుకు తరలివస్తుంది.

సాయుధ పోరాటం ఉన్నతదశకు చేరుకున్నప్పటి పరిస్థితిని చిత్రించేది ఈ చిత్రం దేశవిముక్తి కోసం రక్తతర్పణ చేస్తున్న ఎర్రసైన్యం మీద ప్రజలకు ఎంత మమకారం ఉంటుందో, వాళ్ల ఎర్రసైనికులను శత్రువు బారినుండి ఎంత జాగ్రత్తగా కాపాడుతారో చూస్తే 'ప్రజలమీద ఆధారపడడం' అంటే ఏమిటో అర్థమవుతుంది. ప్రజల సహకారం లభించిన తరువాత శత్రువు ఎంత బలవంతుడైనా, ఎంత దిగ్బంధం చేసినా విజయాన్ని సాధించవచ్చు. అయితే శత్రువు కంటపడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, శత్రుసమాచారం సేకరించడంలో తెలివితేటలు, శత్రుదిగ్బంధం నుండి తప్పించుకునే చాకచక్యం కూడా ముఖ్యమైనవే.

చైనీస్ భాషలో నిర్మింపబడి, గొప్ప విప్లవోత్తేజాన్ని కలిగించే ఈ చిత్రంలోని సంభాషణలు తెరమీద ఇంగ్లీషులో కనిపిస్తాయి.

'ప్రాణహిత'

ప్రథమవర్ధంతి సంస్మరణ

కొ. కు. వివిధఅంశాలపై కొన్ని అముద్రిత అభిప్రాయాలు.

భాష, మాండలికం : తిక్కనభారతంలో మాండలికాల ప్రయోగాలుచేశాడు.

ఉదా : 'విజయంచేసిన' — వేంచేసిన

....ఉత్తరప్రదేశ్‌లో నెహ్రూ తనచిన్నతనంలో గ్రామాలలో పర్యటించుతూ మామూలురైతులు తులసీరామాయణంనుంచి తమజీవితాలకు అన్వయించే సూక్తులు పల్లించటంవిని నిర్ఘాంతపోయాడు.

మాండలికాలు రావాలి. మాండలికాలమీద డిక్షనరీలురావాలి.

ఉదా : ఒకపక్షికి యాభైమైళ్ళకొకపేరుంది. డిక్షనరీవుంటే ఏ ప్రాంతానికి వెళ్తే ఆ ప్రాంతంలో ఆ పక్షి పేరునుబట్టి గుర్తించవచ్చు. ఇప్పటివరకు సరియైన డిక్షనరీలేదు.

ఉదా : అనంతచెట్లు 14 రకాలు - కోశాంబి. విశ్వజనీనమైనపేర్లు (Universal names) అవసరం. సాధారణంగా వాడేపదాలే వాడాలి.

పోరాటప్రాంతంలో సంబంధంఉన్నవాళ్ళే, అక్కడఉంటే మంచిసాహిత్యాన్ని సృష్టించవచ్చు. పోరాటప్రాంతానికి దూరంగాఉన్న నాలాంటివాళ్ళు రాయలేరు.

ఉదా : అల్లంరాజయ్య కథలు.

పోరాటప్రాంతం సాహిత్యం వాళ్ళభాషలో రాయాల్సిందే దీనికి వ్యాకరణం అక్కర్లేదు. మా భాష బాగుండదని తెలంగాణవాళ్ళు అనుకొంటారు. సురవరం ప్రతాపరెడ్డిగారు ఆ భాషలోనే రాసాడు. అన్నిప్రాంతాల సాహిత్యంచేరాక సాధారణ భాష (Common language) వస్తోంది ఆ భాషలోనే రాయాలి.

చలంశైలి బాగుంటుంది. భాషపైన పాశ్చాత్య భాషాప్రభావంఉంది. జాక్ లండన్ అమెరికన్ఇంగ్లీషు అనువాదానికి కష్టతరమైంది.

భాష ఒకరాష్ట్రంలో, కేంద్రం (centre) లోస్థిరంగా ఉటుంది.

ఉదా : కృష్ణా, గుంటూరుజిల్లాల్లో భాషస్థిరంగావుండే అవకాశంవుంది. అంచుల్లో (Periphory) మారుతూఉంటుంది.

ఉదా : చిత్తూరు, శ్రీకాకుళం, ఆదిలాబాద్.

ఆటలపేర్లుకూడా ప్రాంతాన్నిబట్టి మారుతూఉంటాయి.

ఉదా : కర్రబిళ్ళఆట, కాని వామనగుంటలుఅనే ఆటపేరు మారనట్టుతోస్తుంది.

ఉదా : మహెంజోదారోలోగూడా ఈఆట ఉన్నట్టుతెలుస్తోంది.

కథ : కథలగురించి కొ. కు. ఇలాఅన్నారు. ఎస్. ఎస్ ప్రకాశరావు పేపర్ టైగర్ కథలో సూక్ష్మరూపంలో విప్లవం (Microscopic revolution) ఉంది. ఇట్లాంటి

కథే లూసన్ 'Madmans' Diary (పిచ్చివాని డైరీ). "యజ్ఞం" కథ కాళీపట్నం రాసింతర్వాత ఒక సంవత్సరానికి ఆయన్ని కలిసాను. నిజానికి ఆ కథలో ముగింపు-కొడుకే తండ్రినిచంపితే బాగుండేది అని నాకనిపిస్తోంది. రామారావుగారి రచనల్లో "ఈస్తటిక్ బ్యూటీ" ఉంటుంది.

'కుట్ర' కథ మంచిప్రయోగం. మనం ఎవరినిఉద్దేశించి కథరాస్తామో వారికి అర్థమైతీరాలి.

విరసం : విరసంలో కొత్తవాళ్ళగొంతు బలంగావినిపిస్తోంది. వాళ్ళు కవిత్వంలో ముందున్నట్టుగా విప్లవంలో ముందున్నారో లేదో నాకుతెలియదు.

(Youthminds are ready for revolutionary literature But Idonot know whether they are ready for revolution.)

విప్లవసాహిత్యం అప్పుడు అభ్యుదయ సాహిత్యం చేసినపని చేయాలి. అభ్యుదయ సాహిత్యోద్యమం 1950కే చప్పబడింది. "అభ్యుదయ" అనేపేరు బాగా ప్రచారంలోకి వచ్చింది. ఆ దశ (Process) యింకా విరసానికి రాలేదంటాను. [కొ. కు. తో అక్టోబర్ 3, 1979న మద్రాసులో అల్లం రాజయ్య, దామెర రాములు, నిజాం వెంకటేశం జరిపిన ఇష్టాగోష్ఠి సారాంశం.]

విరసంగురించి ఆఖరిరోజుల్లో :

కొ. కు. 17-8-80 నాడు మరణించారుగదా. 13-8-80 నాడు దామెర రాములుకు రాసిన లేఖలో "నేను విరసం సభలకువస్తే ఇతరులను ఉద్ధరించడానికికాదు. నా ఉద్ధరింపుకే. నేను రచయితలని సమిష్టిగాకలిసి, మాట్లాడి, వాళ్ళఅనుభవాలని తెలుసుకుని చాలా ఏళ్ళయింది. అది నాకునష్టం. నేను చెప్పదలచుకొన్నదీ, చర్చించదలచుకున్నదీ రాస్తూనే ఉన్నాను. విరసం సందర్భంలో నా "అనుభవాలు" పూర్తిగాశూన్యం zero! సాహిత్యరచన విషయంలో నాది గతచరిత్ర. దీనికి విప్లవ సాహిత్యోద్యమంలో గాఢవిశ్వాసంగల మీలాంటి యువకుల Social Setting నాకు అర్థంగావటం ఎంతైనా అవసరం, తామరాకుమీద నీటిబొట్టులాగా తళతళలాడే రచయితలూ, రచనలూ విరసాన్ని ముందుకుతీసుకుపోలేవు. విరసం వ్యక్తులకుయిస్తున్న ప్రాముఖ్యంపూర్తిగాపోవాలి. ప్రాముఖ్యం రచనలకే పరిమితంకావాలి" అనిరాసారు.

(అల్లం రాజయ్యకు రాసిన లేఖలనుంచి కొన్నిఅభిప్రాయాలు)

కళారూపాలు : ....సారథివాళ్ళకథ, పాండవులకథ, బుడుగుజంగాలకథ వంటి రూపాల గురించి నాకు ఏమీతెలీదు. వాటిలోకి విప్లవసంస్కృతి, ప్రజాచైతన్యం తీసుకరావటానికి అవకాశాలున్నాయేమో ప్రయోగాలద్వారా తెలుసుకోవచ్చు. ప్రస్తుతం క్లాసికల్ ఇతివృత్తాలకు కాలదోషం పట్టినమాట నిజమేగాని, బూర్జువాసంస్కృతి జనంమీద ఇంకా కొంతబలంగా ఉన్నట్టు కనబడుతుంది.

<u>పారాసైకాలజీ :</u> ....పారాసైకాలజీమీద నా అభిప్రాయాలను కొంచెంకూడా సంస్కరించవలసిన అవసరాన్ని ఎవరూ ఇంకా కలిగించలేదు. అది నాకేనష్టం, ఎందుకంటే జ్ఞానంపదునెక్కటానికి సంస్కారంపొందాలి.

<u>బూర్జువాలప్రయోజనం :</u> ....మార్క్సిస్టు సాహిత్యాన్ని బూర్జువా పబ్లిషర్లు తమలాభాల కోసం అచ్చువేస్తారు. అదేవారి ప్రయోజనం. ఏ మేరకు? అనేదానికి ఎవరు సమాధానం చెప్పగలరు. 30 శాతం లాభంకోసం పెట్టుబడిదారీ ఆత్మహత్య చేసుకుంటుందని కార్ల్‌మార్క్స్ "కాపిటల్"లో అన్నాడు ఆ మేరకు।

<u>చలం :</u> ....చలం నెగెటివ్ దృక్పథం గురించికూడా కొన్నిదశాబ్దాలక్రితం "అభ్యుదయ" వగైరా పత్రికల్లో చాలమందిమి రాసాం. ప్రతిఒక్కసత్యాన్నీ ప్రతితరమూ మళ్ళీ మళ్ళీ డిస్కవర్ చెయ్యటం తెలుగువాళ్ళ ప్రత్యేకత।

<u>చందమామ :</u> ....చందమామలో అప్పుడప్పుడూ ఘాటైనకథలు వస్తుంటాయి. దానికి ఉండేకీర్తి అలాంటికథలతోనే అనుకుంటాను. అవి సర్క్యులేషన్ పెంచవేమోగాని, దేశం మూలమూలలా అభిమానులైన మేధావుల్ని సంపాదించుకుంటున్నాయి. నేను వేరేపనిమీద ఢిల్లీపోయినప్పుడు హిందీ రచయితలు చందమామకారణం నాకోసం సభపెట్టారు. కీర్తిశేషుడు మోహన్‌రాకేశ్ నన్ను టి. వి. లో ఇంటర్వ్యూకూడ చేశాడు. చందమామవిజయం అచ్చుగా పెట్టుబడిదారీ నైపుణ్యంవల్ల కలిగినదికాదు. ఆ పెట్టుబడిదారులే తమ ఇతరపత్రికలను విజయవంతం చేసుకోలేకుండా నానాఅగచాట్లు పడుతున్నారు....

<u>చర్చ :</u> సృజనలోవచ్చిన "జ్ఞానవిజ్ఞానాలమధ్య వైరుధ్యం" వ్యాసంగురించి ఎవరుగాని పట్టించుకున్నట్టూ చర్చించినట్టూ నాకుతెలియలేదు. అదేదో నావ్యక్తిగత విషయం కాదుగద। అందులో నిజంఉంటే అందరికీ పనికివస్తుంది. అందులో అవగాహనాలోపంఉంటే దాన్ని చర్చద్వారా సరిదిద్దాలి, పూర్తిగా తప్పుఅవగాహనఅయితే గట్టిగా ఖండించాలి....

....నా అనుభవంవెనక ఏదన్నా సత్యంఉంటే ఇదినిజమో, కాదో, ఇందులో నా అపోహలున్నాయేమో నలుగురూకూర్చుని చర్చిస్తేగానితేలదు.

....నా విశ్లేషణను ఎవరూ గుడ్డిగా ఆమోదించనవసరంలేదు. వీలయినంతమందిని దీన్నిగురించి ఆలోచించేటట్టు చెయ్యండి. నేనుఇక్కడ విషయాలను ఎవరితోనూ దీర్ఘంగా చర్చించే అవకాశంలేదు, అక్కడ విరసంసభ్యులు చాలామంది ఉన్నారు చర్చించండి....

....వీలయినంతమందిలో చర్చించి నేను చెప్పేదానిలో పొరపాటు ఏమన్నా ఉంటే నాకురాయండి.

Adilabad Tribal Relief Fund

We wish to make an appeal through your journal for donations to the Adilabad Tribal Relief Fund. This fund has been started in the wake of the firing on tribals in Indervelli on April 20, 1981. The Government has promised relief to the families of the victims, but reports indicate that the number of those killed is far higher than the official figure(13). Thus there are many more families (60-100) whose members have been killed and who are in dire circumstances. Also, many of the injured are in need of assistance as they are too afraid of police harassment to seek medical aid from official agencies. In addition, hundreds of families are now without means of livelihood and are facing starvation.

We hope contributions to this fund will be forthcoming. They should be sent to: Adilabad Tribal Relief Fund, C/o Srjana, Hanamkonda, Warangal 506001 (AP)

Manoranjan Mohanty
Secretary PUDR Delhi *Modhumita Majumdar*
Delhi *Ashwini Ray*
Secretary PUCL Delhi *Inder Mohan*

Adilabad Tribal Relief fund Account is in State Bank of Hyderabad, Warangal Branch in the name of P. Varavara Rao A/c No is 2730. Drafts and cheques should be drawn in his name.

ఆదిలాబాద్ గిరిజన సహాయనిధి

C/o సృజన, హనుమకొండ, వరంగల్ 506 001

గతసంచికలో ప్రకటించిన విరాళాలు ఒక బంగారు ఉంగరం, 4 వెండిపట్టెలు + రు. 11,427-70, పదిహేనువందల రూపాయల విలువగల మందులు

1.	Well wishers, త్రివేండ్రం, కేరళ	400-00
2.	ఆర్. వై. ఎల్. వరంగల్ (ఈద్గా రు. 115-00, గొల్లపల్లి రు. 27-00 గోవిందరాజులగుట్ట రు. 140-00)	282-00
3.	హేతువాదసంఘం, గోదావరిఖని	200-00
4.	ఆర్. ఎస్. యు. తిరుపతి	84-00
5.	ధర్మాజీ గూడెం - ఇంద్రవెల్లి సంఘీభావసభ తేది 8-7-81	63-00
6.	గిరాయిపల్లి మృతవీరులసభ వరంగల్ తేది 25 7-81	38-40
7.	ఆర్. ఎస్. యు. కె. ఎం. సి. వరంగల్	33-07
8.	ఎస్. జి. యం. అమానుల్లా, ఇంజనీరింగ్ కాలేజీహాస్టల్ తిరుపతి	28-00
9.	పి. కె శంకర్ అండ్ పార్టీ, అనంతపూర్	15-00
	మొత్తం రూ.	12,571-17

ఒకబంగారు ఉంగరం, 4 వెండిపట్టెలు, పదిహేనువందల రూ॥ విలువగలమందులు.

ఆదిలాబాద్ గిరిజన సహాయనిధి అకౌంట్ పి. వరవరరావు పేర స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ వరంగల్ బ్రాంచిలోఉంది. అకౌంట్ నంబర్ 2730. [illegible]

SRJANA Telugu Monthly August 81 H/WL-10

Regd. No. with Registrar of Newspapers 10953/67.

SRJANA
Hanamkonda-506001

Single copy Rs. 2-00
Yearly Subscription Rs 20-00